
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
బుధవారం 23 జూలై 2025



సైదాపురం పూర్వపు ఎంపీడీవోపై వేటు

సైదాపురం, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : సైదాపురం పూర్వపు ఎంపీడీవో పి శివకుమార్‌ను సస్పెండ్ చేస్తూ జడ్పీ సీఈవో మోహన్ రావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం అన్నమయ్య జిల్లా కోట ఎంపీడీవో కార్యాయలంలో ఏవోగా పని చేస్తున్న శివకుమార్ సైదాపురం ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న సమయంలో మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సిబ్బంది నుంచి నగదు వసూలు చేసినట్లు ఫిర్యాదులు అందాయి. ఈ మేరకు పూర్తిస్థాయిలో విచారించిన ఉన్నతాధికారులు వాస్తవమని తేలడంతో ఆయన్ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.


సమస్యలు అనేకం.. చూపాలి పరిష్కారం!

• అభివృద్ధిలో పుంజుకోని వేగం • రకరకాల సమస్యలతో సతమతం • నేడు జిల్లా రివ్యూ కమిటీ సమావేశం



సోమశిల డ్యాం దిగువున దెబ్బతిన్న అప్రాన్ (ఫైల్)





నెల్లూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : చిన్న పనికి కూడా ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి. రెవెన్యూ సమస్యలకు ఒకపట్టాన దొరకని పరిష్కారం.. మరోవైపు అభివృద్ధి పనుల్లో ఆశించినంతగా కనిపించని పురోగతి. నిధులు, భూసేకరణ వంటి రకరకాల సమస్యలతో పుంజుకోని వేగం.. ఇంకోవైపు నెల్లూరులో ఆందోళన కలిగిస్తున్న రౌడీయిజం.. ఇవీ క్లుప్తంగా జిల్లాలో ప్రస్తుత పరిస్థితులు. వీటన్నిటిపై చర్చించేందుకు జిల్లా రివ్యూ కమిటీ (డీఆర్సీ) సమావేశం బుధవారం జరగనుంది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి జిల్లాకు చెందిన మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణలతోపాటు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలంతా హాజరుకానున్నారు. ఉదయం 10 గంటలకు నెల్లూరులోని జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సమావేశం ప్రారంభం కానుంది. ప్రధానమైన సమస్యలతోపాటు కీలక శాఖలపై ఈ సమావేశంలో సమీక్షించనున్నారు. ఈ మేరకు అన్ని శాఖలకు ఉత్తర్వులు అందాయి. పూర్తిస్థాయి వివరాలు, నివేదికలతో డీఆర్సీకి హాజరుకావాలంటూ కలెక్టర్ ఆనంద్ నుంచి ఆదేశాలు వెళ్లాయి. ఈ ఏడాది తొలిసారిగా డీఆర్సీ సమావేశం జరుగుతుండగా, ఇన్‌చార్జి మంత్రితో సహా మంత్రులు, ఎమ్మెల్యేలు ఒకేచోట కూర్చోవడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. గత డీఆర్సీ సమావేశంలో చర్చించిన పలు కీలక సమస్యల్లో కొన్ని పరిష్కారమయ్యాయి. అందులో ఆమంచర్ల ఏపీఐఐసీ భూముల సమస్య ఒకటి. ఇప్పుడు కూడా ఆదే విధంగా ప్రధాన అంశాలపై ఎటువంటి సమీక్ష జరపుతారన్నది జిల్లావాసుల్లో ఆసక్తి నెలకొంది.

సమీక్షించాల్సిన అంశాలెన్నో..

● జిల్లాకు జీవనాడి వంటి సోమశిల జలాశయం అప్రాన్ నిర్మాణంలో అంతులేని జాప్యం కొనసాగుతోంది. రానున్న వర్షాకాలంలోపు అయినా పనులు పూర్తవుతాయో లేదో చెప్పలేని పరిస్థితి. బిల్లుల సమస్యతో కాంట్రాక్టర్ పనులు చేయడం లేదని అధికారులు చెబుతున్నారు. అలానే సోమశిల హైలెవల్ కెనాల్ రెండు దశల పనుల్లో కూడా ఆశించిన పురోగతి కనిపించడం లేదు. ఇక్కడ భూసేకరణ ప్రధాన సమస్యగా మారింది.



● నెల్లూరు, సంగం బ్యారేజీల నిర్మాణానికి రూ.500 కోట్లకుపైగా వెచ్చించారు. ఈ రెండు బ్యారేజీలకు కాంట్రాక్టర్ల నిర్వహణ పీరియడ్ కూడా ముగిసింది. దీంతో ఈ బ్యారేజీలు ఇప్పుడు ఇరిగేషన్ అధికారుల నిర్వహణలోకి వచ్చేశాయి. కానీ ఇక్కడ టెక్నికల్, నాన్-టెక్నికల్ సిబ్బంది లేరు. ఆఖరుకు గేట్లు ఆపరేట్ చేసేందుకు కూడా సిబ్బంది లేకపోవడం గమనార్హం. సిబ్బంది నియామకానికి పలుమార్లు ప్రతిపాదనలు పంపినా ప్రభుత్వం నుంచి అనుమతులు రాలేదు.

లింగసముద్రం : విస్తరణకు నోచుకోని రాళ్లపాడు ఎడమ కాలువ

● బండేపల్లి-ఉేగపూడి కాలువ నిర్మాణానికి పట్టిన గ్రహణం వీడటం లేదు. 25 వేల ఎకరాల ఆయకట్టు రైతులు ఈ కాలువ ఎప్పుడు పూర్తవుతుందా.. అని కళ్లల్లో ఒత్తులేసుకొని ఎదురుచూస్తున్నారు. 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో పనులు ప్రారంభించగా.. వైసీపీ అధికారంలోకి రాగానే పనులు నిలిపేశారు. అయితే ఇప్పుడు మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఇంత వరకూ పనులు మొదలు కాలేదు.

రాళ్లపాడు ఎడమ కాలువ విస్తరణ పనులకు మోక్షం లభించడం లేదు. ఏళ్ల తరబడి రైతులు విజ్ఞాపనలు చేస్తున్నా ఈ పనులు పట్టాలెక్కడం లేదు. 2003లో ప్రారంభమైన మోపాడు సప్లై ఛానల్ పనులు నేటికీ నత్తనడకన సాగుతున్నాయి. ఈ పనులకు జైకా నిధులు ఉన్నప్పటికీ సరైన పర్యవేక్షణ లేకపోవడంతో పనుల్లో పురోగతి కనిపించడం లేదు.

● గత ప్రభుత్వంలో అగ్రికల్చరల్ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) నిధుల పేరుతో జిల్లాలో 222 రోడ్లను రూ.185.40 కోట్లతో బాగు చేసేందుకు టెండర్లు పిలిచారు. అందులో 149 పనులను మాత్రమే కాంట్రాక్టర్లకు అప్పగించగా, మిగిలినవి చేసేందుకు ఎవరూ ముందుకు రాలేదు. అయితే ఈ వర్కులకు ఇంతవరకూ ఏఎంసీ నుంచి ఎటువంటి బడ్జెట్ గానీ, రుణం గానీ మంజూరు కాలేదు. చేసిన పనులకు కూడా బిల్లులు ఇచ్చే పరిస్థితి లేదు. దీంతో ఈ రోడ్లను ఇక్కడా బాగు చేయలేక, మరో పథకం కింద బాగు చేయలేక అవస్థలు పడుతున్నారు.

● నెల్లూరులో ఇటీవల కాలంలో రౌడీయిజం ఎక్కువైపోయింది. దీని మూలంగా హత్యలు, గొడవలు కూడా ఎక్కువయ్యాయి. రాత్రిపూట ఆకతాయిలు బ్యాచ్‌లుగా 

నగరంలో తిరుగుతూ ఒంటరిగా వెళ్లేవారిని కత్తులతో బెదిరించి డబ్బులు లాక్కెళుతున్నారు. రౌడీలు, ఆకతాయిలకు స్థానిక రాజకీయ నేతలు అండ గా నిలుస్తుండడంతో తమకు ఒత్తిళ్లు వస్తు న్నట్లు పోలీసు వర్గాలు బహిరంగంగానే చెబుతున్నా యి. ఈ పరిస్థితిపై కూడా డీఆర్సీలో చర్చించాల్సిన అవసరముంది.

కదిలించిన 'ఆంధ్రజ్యోతి' కథనం

ఎట్టకేలకు జిల్లా రివ్యూ కమిటీ(డీఆర్సీ) సమావేశం బుధవారం జరగనుంది. ఎనిమిది నెలల అనంతరం జరుగుతున్న సమావేశం కావడం విశేషం. ఈ నెల 8వ తేదీన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'డీఆర్సీ ఉందా.. లేదా..?' కథనానికి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ స్పందించారు. జిల్లా అభివృద్ధిపై అనేక అంశాలను చర్చించాల్సిన అవసరాన్ని ఆంధ్రజ్యోతి తెలియజేసింది. ఈ విషయాన్ని కలెక్టర్ ఆనంద్.. ఇన్‌చార్జ్ మంత్రి, జిల్లా మంత్రులు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వెంటనే డీఆర్సీ సమావేశం నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు సూచించారు. ఈ క్రమంలో తొలుత ఈ నెల 17వ తేదీన డీఆర్సీ నిర్వహణకు సిద్ధమయ్యారు. అయితే ఆ రోజున సీఎం చంద్రబాబు నాయుడు నంద్యాల జిల్లాలో పర్యటిస్తుండటం, అది ఇన్‌చార్జ్ మంత్రి జిల్లా కావడంతో డీఆర్సీ వాయిదా పడింది. ఆ తర్వాత మంత్రులు, ఎమ్మెల్యేల వీలును పరిగణలోకి తీసుకొని బుధవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.


కరేడులో భూసేకరణ ప్రక్రియకు అడుగులు

రైతుల సమ్మతి కోసం రంగంలోకి ఇండోసోల్ ప్రతినిధులు

కరేడులో భూములున్న బయటి గ్రామాల రైతులపై దృష్టి

పునరావాస కాలనీలకు అనువైన స్థలం కోసం అన్వేషణ

కందుకూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ఇండోసోల్ సోలార్ పరిశ్రమ కోసం నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం కరేడులో భూసేకరణ జరిపి తీరాలన్న పట్టుదలతో అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు ప్రయత్నిస్తుండగా మరోవైపు ఇండోసోల్ ప్రతినిధులు ప్రత్యక్షంగా రంగంలోకి దిగి ఈ దిశగా చర్యలు ప్రారంభించారు. కరేడు పంచాయతీ పరిధిలో ఇండోసోల్ కోసం 8348 ఎకరాలను సేకరించాలని ప్రభుత్వం జీఓ జారీ చేసినా గ్రామస్థుల నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. తొలివిడత నోటిఫికేషన్ జారీచేసిన 4800 ఎకరాలను ఎట్టిపరిస్థితుల్లో సేకరించాలన్న పట్టుదలతో అధికార యంత్రాంగం రైతులను ఒప్పించే ప్రయత్నాలు ముమ్మరం చేయగా అధికార యంత్రాంగానికి సమాంతరంగా ఇండోసోల్ ప్రతినిధులు కూడా రంగంలోకి దిగి రైతులను ఒప్పించుకునేందుకు తమదైనశైలిలో ప్రయత్నాలు ప్రారంభించారు. భూములు ఇచ్చేందుకు అంగీకరిస్తే మెరుగైన ప్యాకేజీ ఇస్తామని రైతులతో సంప్రదింపులు జరుపుతుండటం విశేషం. ముఖ్యంగా కరేడు గ్రామంలో భూములు కలిగిఉన్న ఇతర గ్రామాల రైతులను తొలుత ఒప్పించే వ్యూహంతో ఇండోసోల్ ప్రతినిధులు రైతులను కలుస్తున్నారు. ప్రభుత్వం అధికారికంగా ప్రకటించిన ధరతోపాటు అనధికారికంగా తాము మరికొంత పరిహారంగా చెల్లిస్తామని రైతులకు ఆశ చూపిస్తున్నారు. ముఖ్యంగా పది ఎకరాలు, అంతకన్నా ఎక్కువ విస్తీర్ణం భూమి కలిగి ఉన్న రైతులకు ఆకర్షణీయమైన ప్యాకేజీ ఆశచూపుతున్నట్లు సమాచారం. ఆవిధంగా కొందరు రైతుల వద్ద నిరభ్యంతర పత్రాలు సేకరించి జిల్లా అధికారులకు అందజేసే ప్రక్రియకు ఇండోసోల్ సిబ్బంది శ్రీకారం చుట్టడమే గాక ఇప్పటికే కొందరు రైతులచేత మౌఖికంగా ఓకే అనిపించుకున్నట్లు చెబుతున్నారు. మరోవైపు



- మిగతా 7లో..

సోమశిలకు 3,856 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం జూలై 22 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి మంగళవారం 3,856 క్యూసెక్కుల వరద వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం డ్యాంలో 27.510 టీఎంసీల నీరు నిల్వ ఉండగా ఉత్తర కాలువకు 350, దక్షిణ కాలువకు 400, పెన్నాడెల్టాకు 4,300 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

కోవూరు షుగర్స్ సమస్యల పరిష్కారానికి కృషి

● రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్

కోవూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కోవూరు సహకార చక్కెర కర్మాగార సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. కోవూరు సహకార చక్కెర కర్మాగారాన్ని మంగళవారం ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. ఫ్యాక్టరీ ఆవరణలో పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేయాలని ఎమ్మెల్యే మంత్రిని కోరారు. ఏపీఐఐసీ సంస్థకు ఫ్యాక్టరీ ఆవరణను అప్పగించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాల్సిందిగా కోరారు. అనంతరం జరిగిన సభలో మంత్రి భరత్ మాట్లాడుతూ ఫ్యాక్టరీలో పని చేసిన కార్మికులకు, రైతులకు బకాయిలను వెంటనే చెల్లించేందుకు వేగవంతంగా కృషి చేస్తానని స్పష్టం చేశారు. అయితే, కొందరు కోర్టులో కేసులు వేసి స్టే తెచ్చినందువల్ల సమస్య పరిష్కరించడంలో ఆలస్యమవుతోందని చెప్పారు. స్టే పొందిన వ్యక్తులతో మాట్లాడి న్యాయసమస్యలు తలెత్తకుండా చూస్తానని అన్నారు. ఫ్యాక్టరీ ఆవరణలో హబ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని మంత్రి అన్నారు.

2న జడ్పీ స్థాయీ సంఘ సమావేశం

నెల్లూరు (జడ్పీ), జూలై 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆగస్టు 2వ తేదీన జడ్పీ స్థాయీ సంఘ సమావేశం జరుపుతున్నట్లు జడ్పీ సీఈవో మోహనరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటలకు ప్రణాళిక, ఆర్థిక పనుల విషయాలపై, మధ్యాహ్నం 12.30 గంటలకు గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ విషయాలపై, మధ్యాహ్నం 3 గంటలకు విద్య, వైద్య ఆరోగ్య విషయాలపై, సాయంత్రం 4 గంటలకు స్త్రీ శిశు సంక్షేమ, సాంఘిక సంక్షేమ విషయా లపై సంబంధిత శాఖలతో సమీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభ్యులు, జిల్లా స్థాయి అధికారులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

రెండు రోజులు.. 62 ప్రశ్నలు!

• అన్నిటికీ మాజీ మంత్రి కాకాణివి రెండే సమాధానాలు
• నాకు తెలియదు.. సంబంధం లేదు!
• ఎక్సైజ్ కేసులో ముగిసిన కస్టడీ.. జైలుకు తరలింపు

నెల్లూరు (క్రైం), జూలై 22 (ఆంధ్రజ్యోతి) : రెండు రోజులు.. 62 ప్రశ్నలు సంధించిన ఎక్సైజ్ పోలీసులకు మాజీ మంత్రి, కాకాణి గోవర్ధన్‌రెడ్డి నుంచి రెండే రెండు సమాధానాలు వచ్చాయి. 'నాకు తెలియదు.. నాకు సంబంధం లేదు.' ఇవి తప్ప కాకాణి నోటినుంచి మరేమాట రానట్లు సమాచారం. పొదలకూరు మండలం ఇరువూరు గ్రామంలోని మద్యం దుకాణం నుంచి మద్యం అక్రమంగా తరలించిన కేసులో కాకాణి గోవర్ధన్‌రెడ్డి పోలీసు కస్టడీ మంగళవారం ముగిసింది. కోర్టు ఆదేశాల మేరకు ఎక్సైజ్ పోలీసులు సోమవారం కాకాణిని కస్టడీకి తీసుకున్నారు. రెండు రోజులపాటు సాగిన విచారణలో ఎక్సైజ్ పోలీసులు 62 ప్రశ్నలు అడగ్గా ఒక్క ప్రశ్నకు కూడా కాకాణి స్పష్టమైన సమాధానం ఇవ్వనట్లు సమాచారం. ప్రధానంగా 2014లో కాకాణిపై గోవా మద్యానికి సంబంధించిన కేసులపై అనేక ప్రశ్నలు అడిగారు. ఆ కేసుల వివరాల గురించి గత ఎన్నికల అఫిడవిట్‌లో పొందుపరిచారా!? అని ప్రశ్నించగా పొందుపరిచినట్లు కాకాణి చెప్పినట్లు సమాచారం. ఇక ఇరువూరు గ్రామంలో మద్యం దుకాణంలో మద్యం బయటకు వచ్చిన కేసులో మీ అనుచరులు సురేష్ కుమార్‌రెడ్డి, మరో ఇద్దరు ఉన్నారని వారితో ఆ సమయంలో మీరు ఫోన్‌లో మాట్లాడారా!? లేదా!? అని ప్రశ్నించారు. ఎన్నికల సమయం కావడం, తమ పార్టీకి చెందిన వారు కావడంతో మాట్లాడి ఉంటానని మద్యం విషయం గురించి తనకు తెలియదని సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. మొత్తం మీద రెండు రోజులపాటు ఎక్సైజ్ పోలీసులు అడిగిన ప్రశ్నలకు కాకాణి మాత్రం నాకు తెలియదు... నాకు సంబంధం లేదు అన్న సమాధానాలే ఇచ్చినట్లు సమాచారం. మంగళవారం కస్టడీ ముగిశాక గూడూరు కోర్టులో ఎక్సైజ్ పోలీసుల కాకాణిని హాజరు పరిచి అక్కడ నుంచి నెల్లూరు కేంద్ర కారాగారానికి తరలించారు.



కాకాణి గోవర్ధన్‌రెడ్డి

రిజిస్ట్రేషన్ శాఖలో ఇన్‌చార్జులే దిక్కు!

• రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్ల కొరత
• ఆపై ఎస్ఏ, జేఏలూ లేక అవస్థలు
• ఉన్న వారిపై పనిభారం.. పనులకు ఆటంకం

నెల్లూరు (హరనాథపురం), జూలై 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చే శాఖలలో ప్రధానమైన రిజిస్ట్రేషన్ శాఖను అధికారులు, సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఈ ప్రభావం ఉన్నవారిపై పనిభారం పడటమేకాకుండా పనులు సక్రమంగా జరగడంలేదు. నెల్లూరులోని జాయింట్ సబ్ రిజిస్ట్రార్, కోవూరు సబ్ రిజిస్ట్రార్ పోస్టులకు ఇన్‌చార్జులు కొనసాగుతున్నారు. కోవూరు, ఉదయగిరిలలో సీనియర్ సహాయకులే ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్లుగా కొనసాగుతున్నారు. అదనపు బాధ్యతల వల్ల సీనియర్ సహాయకులు చూడాల్సిన పనులకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. సబ్ రిజిస్ట్రార్ ఉన్నప్పుడు సీనియర్ సహాయకులు వారికి చేదోడు వాదోడుగా పనులు సాగిస్తుంటారు. పనులు కూడా సత్వరమే పూర్తి చేయడానికి అవకాశం కలుగుతుంది. చిట్‌ఫండ్స్ వ్యవహారాలు చేసేందుకు ఒక సబ్ రిజిస్ట్రార్ పోస్టు నెల్లూరులో ఉంది. ఈ పోస్టులోనూ సీనియర్ సహాయకుడే ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. చిట్ ఫండ్ కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహించి అందులో జరిగే మోసాలను వెలుగులోకి అధికారులు తీసుకురావాల్సి ఉంది. కానీ అలాంటి పరిస్థితి ఇప్పుడు లేదు. ఇక రిజిస్ట్రేషన్ శాఖలో ప్రధాన అధికారి అయిన జిల్లా రిజిస్ట్రార్ పోస్టుకు కూడా ఇన్‌చార్జ్ కొనసాగడం విశేషం. నెల్లూరులో పని చేస్తుండిన జిల్లా రిజిస్ట్రార్‌ను ప్రకాశం జిల్లాకు ఆరు నెలల క్రితం బదిలీ చేశారు. అప్పటినుంచి ఎవరినీ నియమించలేదు. ఒంగోలుకు బదిలీ అయిన ప్రకాశం జిల్లా రిజిస్ట్రార్‌నే నెల్లూరుకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు.



నెల్లూరులో రిజిస్ట్రేషన్ల కోసం వేచి ఉన్న జనం

● **ఎస్ఏ, జేఏ పోస్టులు ఖాళీ..**

జిల్లాలోని 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సీనియర్, జూనియర్ ఖాళీలు ఉన్నాయి. సీనియర్ సహాయకుల్లో కొందరిని ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్లుగా నియమించారు. దీంతో రిజిస్ట్రేషన్ శాఖలో రిజిస్ట్రేషన్ వ్యవహారాలతోపాటు మార్కెట్ విలువలు దస్తావేజుల పరిశీలన సత్వర జారీ వంటి అంశాలకు తీవ్ర విఘాతం కలుగుతోంది. రిజిస్ట్రేషన్ శాఖలో స్లాట్ బుకింగ్ విధానం అమల్లోకి వచ్చిన తర్వాత సత్వరమే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతున్నా దస్తావేజులను రిజిస్ట్రేషన్‌దారుకు అప్పజెప్పడానికి వారం, పదిరోజులు పడుతోంది. అలాగే, రిజిస్ట్రేషన్ శాఖలో రిజిస్ట్రేషన్ చేసుకునే వారికి వచ్చే సందేహాలను అధికారులు, సిబ్బంది నివృత్తి చేయాల్సి ఉంటుంది. సిబ్బంది కొరత కారణంగా కొన్ని కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్‌దారులకు జవాబు చెప్పే వారే కరువయ్యారు. ఇదే అదునుగా దళారులు రంగ ప్రవేశం చేసి ప్రజల నుంచి నగదు డిమాండ్ చేస్తున్నారు.

● **త్వరలో పదోన్నతులు?**

జిల్లాలో జాయింట్ సబ్ రిజిస్ట్రార్లు రిజిస్ట్రార్లుగా, సీనియర్ సహాయకులకు సబ్ రిజిస్ట్రార్‌లుగా, జూనియర్ సహాయకులకు సీనియర్ సహాయకులుగా పదోన్నతి లభించనుంది. సీనియర్ సహాయకులకు పదోన్నతి లభిస్తే జిల్లాలో ఖాళీగా ఉన్న సబ్ రిజిస్ట్రార్ పోస్టులు భర్తీ అయ్యే అవకాశం ఉంది. అప్పటిదాకా ఇన్‌చార్జుల పాలనే ఆ శాఖలో కొనసాగనుంది.



క్రిటికల్ కేర్.. సిద్ధం

ఆగస్టు 15కల్లా జీజీహెచ్‌కు అప్పగింత

మొత్తం నిర్మాణానికి రూ.23.75 కోట్లు

రెండు అధునాతన ఆపరేషన్ థియేటర్లు

ఆధునిక వైద్య పరికరాలు

8లో..

యాక్సెస్ బ్యాంకుకు బాధితులు

నెల్లూరు(క్రైం), జూలై 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో యాక్సెస్ బ్యాంక్ కుంభకోణం రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో నగరంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న యాక్సెస్ బ్యాంకు నుంచి నోటీసులు అందుకున్న పలువురు బాధితులు మంగళవారం ఆ బ్యాంకుకు చేరుకున్నారు. తమకు నోటీసులు అందాయని, వాటి గురించి తెలియజేయాలని కోరగా నోటీసులు అందిన వారికి స్కామ్‌తో ఎలాంటి సంబంధం లేదని తెలిపినట్లు సమాచారం. దీంతో బ్యాంకులో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది కనుసైగల్లోనే స్కామ్ జరిగినట్లు పోలీసులు అంచనాకు వచ్చినట్లు తెలిసింది. ఆ కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

ఈపూరు దేవస్థానాలకు ఇక పూర్వవైభవం

ముత్తుకూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కృషితో ఈపూరులోని విరూపాక్ష, చెన్నకేశవ దేవస్థానాల అభివృద్ధికి భారీగా నిధులు మంజూరయ్యాయి. ఈపూరు శ్రీవిరూపాక్ష స్వామి దేవస్థానం జీర్ణోద్ధరణకు ఇప్పటికే మంత్రి నారాయణ రూ. 25 లక్షలు విరాళం ఇవ్వగా, దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మంగళవారం రూ. 45.34 లక్షలు ప్రకటించారు. శ్రీచెన్నకేశవ ఆలయానికి పలు రకాల నిధుల కింద రూ. 56.67లక్షలు, మరో రూ.1.13 కోట్లు మంజూరు చేశారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9564
వెండి కిలో ధర	రూ. 117600
వెండి ఒక గ్రాము	రూ. 120.60

లార్వా నాశనానికి గంబూసియా చేపపిల్లలు



చేపపిల్లలను వదులుతున్న అధికారులు

మనుబోలు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మురుగు నీటి కాలువల్లో పెరుగుతున్న లార్వాను అరికట్టేందుకు వైద్యసిబ్బంది మంగళవారం గంబూసియా చేప పిల్లలను వదిలిపెట్టారు. జాతీయ కీటక జనిత వ్యాధుల నివారణ కార్యక్రమం (ఎన్‌వీబీడీసీపీ) లో భాగంగా ప్రభుత్వం సరఫరా చేసిన 2వేల చేపపిల్లలను వదిలారు. మ నుబోలు, బద్దెవోలు, వెంకన్నపాళెం గ్రామా ల్లోని మురుగునీరు నిల్వఉన్న 5 గుంతల్లో (ఒక్కో గుంతల్లో 400) చేపపిల్లలను వది లిపెట్టినట్లు సీహెచ్‌వో రాజయ్య తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రమణ య్య, హెల్త్ అసిస్టెంట్లు విజయ్, చంద్రశే ఖర్, రమణా రెడ్డి పాల్గొన్నారు.

ముత్తుకూరు : జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారిణి దేవీకృప సూచించారు. ముత్తుకూరు ఎస్టీ కాలనీ, గురుకుల పాఠశాల వెనుక ప్రాంతం, నారికేళపల్లి వద్ద నీటి మడుగులలో ఈ గంబూసియా చేప పిల్లలు వదిలే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. దోమ తెరలు వాడటం, దోమల నివారణ చర్యలు చేపట్టడం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ. షకూర్, హెచ్‌వీ. నిర్మలమ్మ, ఆరోగ్య సహాయకులు బాలకృష్ణ, కళ్యాణ్ కుమార్, రాజగోపాల్‌నాయుడు, నవీన్ కుమార్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను సకాలంలో పరిష్కరించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ రమాదేవి

మనుబోలు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): గ్రీవెన్స్‌తో పాటు, మిగతా రోజుల్లో వచ్చే ప్రజా సమస్యలను సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ రమాదేవి సిబ్బందిని ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆమె వీఆర్‌వోలు, ఆర్‌ఐలు, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాలకు పంపవలసిన సర్వేలు, డాక్యుమెంట్లపైన నిర్లక్ష్యం చేయవద్దన్నారు. రైతుల నుంచి సాగునీటి శిస్తు వసూళ్లను వేగవంతం చేయాలన్నారు. రీసర్వే పనులు పూర్తి చేసేలా సర్వేయర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రదీప్, రీసర్వే డీటీ మంజుల తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా కాసా శ్రీనివాసులు



శ్రీనివాసులును సత్కరిస్తున్న నాయకులు

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 22(ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉన్న కాసా శ్రీనివాసులు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా చేనేత ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ బూదారపు బాలాజీ మంగళవారం ఆయనను పూలమాల, శాలువాతో సత్కరించారు. సహకరించిన ఆర్ఎస్ఎస్ నేతలకు, జిల్లా అధ్యక్షుడు సీపారెడ్డి వంశీధర్‌రెడ్డికి ధన్యవాదములు తెలియజేశారు. బీజేపీ నాయకులు సురేంద్ర, చేనేత ఐక్య వేదిక సభ్యులు గోపాల్, చంద్ర, వెంకటేశ్వర్లు, మాధవయ్య, సుబ్బయ్య పాల్గొన్నారు.

‘క్లిక్’ కాని క్లినిక్‌లు

- వైసీపీ హయాంలో ఆర్భాటం
- అంతంతమాత్రంగానే వైద్యసేవలు
- పర్యవేక్షణ, జవాబుదారీతనం ఏదీ?
- రెండుచోట్లే భవనాలు... మిగతావి అద్దెగదుల్లో...



అక్కంపేటలో నిర్మించిన వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్ భవనం

మనుబోలు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు మండలస్థాయిలో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ద్వారా వైద్య సేవలు అందించేవారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం వైద్యరంగంలో సరికొత్త మార్పులంటూ హంగామా చేసింది. ప్రతీ సచివాలయం పరిధిలో వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటు చేసింది. మీ గడపవద్దకే వైద్యం నడిచొస్తుందంటూ నమ్మించే ప్రయత్నం చేసింది. పీహెచ్ సీల్లోనే వైద్యులు, సిబ్బంది అంతం త మాత్రం ఉండగా, దీనికి భిన్నంగా కొత్తగా విలేజ్ క్లినిక్‌లలో అన్నీ సిద్ధం అన్నట్లు ఊదరగొట్టారు. అయితే వైసీపీ ప్రభుత్వం అనుకున్న స్థాయిలో విలేజ్‌క్లినిక్‌లు పెద్దగా ‘క్లిక్’ కాలేదన్న విషయం తెలిసిందే.

మండలంలోని 19 పంచాయతీల్లో 19 సచివాలయాలు ఏర్పాటు చేశారు. అప్పటి ప్రభుత్వ లెక్క ప్రకారం సచివాలయానికి ఒకటి చొప్పున 14 విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటు చేయాలి. అయితే మనుబోలు-2 సచివాలయ పరిధిలో పీహెచ్‌సీ ఉండడంతో అక్కడ మంజూరు చేయలేదు. 13 చోట్ల విలేజ్ క్లినిక్‌లు నిర్మించేందుకు ఉత్త ర్వులు ఇచ్చారు. మడమనూరు, అక్కంపేట సచివాల యాల్లో మాత్రమే వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్‌లకు కొత్త భవనాలు నిర్మించారు. మనుబోలు-1, చెర్లోపల్లి సచివాల యాల పరిధిలో పునాదుల్లోనే విలేజ్ క్లినిక్‌ల నిర్మాణాలు ఆగిపోయాయి. అంటే మండలంలో రెండుచోట్ల మినహా మిగి లిన 11 చోట్ల వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్‌లు అద్దె గదుల్లోనే నడుస్తున్నాయి. వీటి నిర్వహణ కూడా అంతం త మాత్రంగానే ఉంది.

ప్రస్తుతం ఈ క్లినిక్‌లు బీపీ, షుగర్, సాధారణ వ్యాధులను పరీక్షించి, మందులు ఇచ్చేందుకు మాత్రమే పరిమితమయ్యాయి. ఈ క్లినిక్‌ల నిర్వహణ కోసం ఎంఎల్‌హెచ్‌పీలను నియమించారు. వీరు క్లినిక్‌లలో మధ్యాహ్నం 12 గంటల వరకే ఓపీ సేవలు అందిస్తారు. తరువాత సర్వేల పేరుతో క్షేత్రస్థాయి సందర్శనకు వెళతుంటారు. వీరు వ్యక్తిగత, ఆరోగ్యపరమైన సమస్య లతో సెలవు పెడితే ఏఎన్ఎంలు ఈ క్లినిక్‌లను నడుపు తుంటారు. అది కూడా కేవలం రెండు గంటలు మాత్రమే.

వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్‌లపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఆసాంతం లోపించిందన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.. ఆరోగ్యశాఖాధికారులు ఆ క్లినిక్‌ల వైపు కన్నెత్తి చూడడం లేదని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. కేవలం పీహెచ్‌సీలకు రావడం, రికార్డులు తిరగేయడం, మీటింగ్‌లు పెట్టడం మినహా, గ్రామాల్లో విలేజ్ క్లినిక్‌లు ఎలా నడుస్తున్నాయి? అందులో ఎలాంటి వసతులు ఉన్నాయో ప్రజలనడిగి తెలుసుకున్న దాఖలాలు లేవు. అద్దెగదుల్లో నిర్వహిస్తున్న క్లినిక్‌లకు ప్రభుత్వం నెలకు రూ. 600 మాత్రమే ఇస్తుంది. అదికూడా ఏడాదికి ఒకసారి అద్దె చెల్లిస్తుంది. అలాంటప్పుడు విలేజ్ క్లినిక్‌ల నిర్వహణ ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

ఏడాది క్రితం కొత్తగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం విలేజ్ క్లినిక్‌లపై నేటికీ దృష్టి సారించనేలేదు. వీటిని కొనసాగిస్తుందో. లేదో ఉన్నతాధికారులు స్పష్టం చేయడం లేదు. కొత్త భవన నిర్మాణాలకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తారా? లేదా? అన్నది కూడా క్లారిటీ ఇవ్వడంలేదు. ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తే గ్రామాల్లో విలేజ్ క్లినిక్‌ల సేవలు అంతంతమాత్రమేనని తేటతెల్లం అవుతోంది.

11 సీట్లొచ్చినా బుద్ధి మారలేదు

రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్



మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్, వేదికపై ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి తదితరులు

కోవూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ పాలన అరాచకంగా సాగిందని, 11 సీట్లొచ్చినా ఆ పార్టీ నాయకుల బుద్ధి మారలేదని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. మండల పరిధిలోని పోతిరెడ్డిపాళెం గ్రామంలో మంగళవారం ‘సుపరిపాలనలో తొలి అడుగు’ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రజలు 11 సీట్లు ఎందుకిచ్చారో ఆలోచించకుండా నోటికి ఏది వస్తే అది మాట్లాడుతున్నారని విమర్శించారు. తల్లికీ, చెల్లికే న్యాయం చేయలేని జగన్ ఐదు కోట్లప్రజానీకానికి ఇక ఏం న్యాయం చేస్తాడని ఎద్దేవా చేశారు. చంద్రబాబు పాలనలో రాష్ట్రం మళ్లీ గాడిలో పడుతోందన్నారు. రాష్ట్రంలో తొమ్మిదన్నర లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు పలు సంస్థలు తరలివస్తున్నాయని చెప్పారు. ఏడాదిలో రాష్ట్రాభివృద్ధి కోసం 25 మంత్రివర్గ సమావేశాలు జరిగాయని చెప్పారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ గత 13 సంవత్సరాలుగా చక్కెర ఫ్యాక్టరీ కార్మికులు, చెరుకు రైతులు బకాయిల కోసం ఎదురు చూస్తున్నారని చెప్పారు. స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి చూపేందుకు ఫ్యాక్టరీ ఆవరణలో హబ్ ఏర్పాటు చేసి ఆదుకోవాలని మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ టీ పార్వతి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్ రెడ్డి , పెన్నా డెల్టా ఛైర్మన్ జెట్టి రాజగోపాలరెడ్డి, బుచ్చి ఛైర్‌పర్సన్ సుప్రజ, నాయకులు కోడూరు కమలాకరరెడ్డి, మల్లారెడ్డి, కొల్లారెడ్డి సుధాకర రెడ్డి, రాఘవేంద్ర, చప్పిడి శ్రీనివాసులురెడ్డి, తిరుమూరు అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి శ్రీవాణినగర్‌లో ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు.

సర్వేపల్లి సమగ్రాభివృద్ధే ఎమ్మెల్యే సోమిరెడ్డి లక్ష్యం



కరపత్రాలు పంచుతున్న రాజగోపాల్‌రెడ్డి, శ్రుతిరెడ్డి

వెంకటాచలం, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : సర్వేపల్లి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే ఎమ్మె ల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి లక్ష్యమని టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. మండలంలోని తిక్కవర ప్పాడులో మంగళవారం సాయం త్రం ‘సుపరిపాలనలో తొలిఅడుగు’ కార్యక్రమాన్ని ని ర్వహించారు. సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, శ్రుతి రెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి కరపత్రాలను అందజేశారు. సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతు న్నామన్నారు. టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తురిమెర్లకు నేడు ఎమ్మెల్యే రామకృష్ణ రాక

సైదాపురం, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని తురిమెర్లలో బుధవారం జరుగనున్న సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పాల్గొంటారని ఎంపీడీవో రవీంద్ర మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు మండల అధికారులు, సిబ్బంది పాల్గొనాలని తెలిపారు.

గ్రామాల్లో ‘సుపరిపాలనలో తొలిఅడుగు’



కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నేతలు

రాపూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆదూరుపల్లి, తుమాయి పంచాయతీల్లో టీడీపీ మండల అధ్యక్షుడు దందోలు వెంకటేశ్వర్లురెడ్డి, తిరుపతి పార్లమెంటు వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి టీఎన్.ప్రసాద్‌నాయుడు ఆధ్వర్యంలో మంగళవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాల గురించి వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ అధికార ప్రతినిధి నువ్వుల శివరామకృష్ణ, ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరి పచ్చిగళ్ల రత్నయ్య, అదూరుపల్లి సర్పంచు కొమ్మి జంగంనాయుడు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి కృషి

విడవలూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఎంతగానో కృషి చే స్తున్నారని ఈస్ట్రన్ చానల్ డీసీ ఛైర్మన్ పాశం శ్రీ హరిరెడ్డి తెలిపారు. చౌకి చర్ల, వావిళ్ల గ్రామాల్లో మంగళవారం ‘పొలం పిలు స్తోంది’ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రైతులు సుభిక్షంగా ఉంటే దేశం పాడిపంటలతో తులతూగుతుందన్న లక్ష్యంతో ప్రభుత్వం రాయితీలతో పచ్చిరొట్ట విత్తనాలను 50 శాతం రాయితీతో రైతులకు అందజేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి లక్ష్మీ, టీడీపీ నాయకులు కొమ్మిరెడ్డి మురళీరెడ్డి, ఈదూరు సురేష్, కొల్లు చిన్న వెంకయ్య, అరగల వినోద్ కొమ్మిరెడ్డి కోటారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై డేంజర్ బెల్స్!

- ట్రాఫిక్‌కు విరుద్ధంగా వాహనాల నిలుపుదల
- ప్రాణాలు కోల్పుతున్న వాహనచోదకులు
- హైవే అధికారులు, పోలీసుల నిర్లక్ష్యం

వెంకటాచలం, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి ప్రమాదాలకు సూచికగా మారింది. మండల పరిధిలోని పలు బ్యాంకుల వద్ద ఉన్న ఏటీఎం సెంటర్లు, దాబాలు, హోటళ్లు, కేఫ్‌లు వంటి ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు విరుద్ధంగా రహదారి పైనే లారీలు, ఇతర వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. ఈ ప్రాంతాల్లోనే ఎక్కువగా ప్రమాదాలు జరిగాయి. పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు. ట్రాఫిక్‌కు విరుద్ధంగా వాహనాలు నిలుపుదల చేయడం వల్ల ప్రమదాలు మెండుగా జరిగే అవకాశం ఉంది. జాతీయ రహదారిపై ఎప్పుడో తప్ప హైవే మొబైల్ జాడే కనిపించడం లేదు. అధికారులు నామమాత్రంగానే తనిఖీలు చేస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రహదారి మధ్యలో ఉన్న డివైడర్లల్లో మొక్కలు, పచ్చిగడ్డితో సుందరంగా ఏర్పాటు చేశారు. అయితే ఈ మొక్కలు, పచ్చిగడ్డి పర్యవేక్షణ ఎప్పటిప్పుడు చేయడంలో హైవే సిబ్బంది పూర్తిగా విఫలమైంది. హైవే పక్కనే ఉన్న గ్రామాల నుంచి పశువులు, గేదెలు, ఆవులు మేత కోసం రహదారిపైకి వస్తున్నాయి. అలాంటి సమయాల్లో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. డివైడర్లపై ఉన్న పచ్చిగడ్డి, మొక్కలను నెలకు ఒకసారి కాకుండా వారానికి ఒకసారి తొలగించినట్లయితే మూగజీవాలు రహదారిపై వచ్చే అవకాశం తక్కువగా ఉంటుంది. మూగజీవాలను రహదారిపై వదులుతున్న వారిని గుర్తించి కౌన్సిలింగ్ ఇవ్వాలని, మూగజీవాలను రహదారిపైకి వదలకుండా ఉంటారని వాహనచోదకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా నాలుగైదు ప్రాంతాల్లో ఎక్కువగా రహదారిపై రాంగ్‌రూట్‌లో రాకపోకలు సాగిస్తున్నారు. బురాన్‌పూర్-బుజబుజ నెల్లూరు, కియా కార్ల షోరూం నుంచి చెముడుగుంట క్రాస్ రోడ్డు, కాకుటూరు నుంచి వీఎస్‌యూ, వెంకటాచలం సర్వేపల్లి క్రాస్ రోడ్డు నుంచి జగనన్న కాలనీ, ఎర్రగుంట నుంచి టోల్‌ప్లాజా వరకు రహదారిపై రాంగ్ రూట్‌లలో రాకపోకలు సాగిస్తున్నాయి. వీటి కారణంగా తరుచూ రహదారిపై ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికే పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఇప్పటికైనా హైవే అధికారులు, పోలీసులు స్పందించి ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు.



రహదారిపై నిలిపి ఉన్న లారీలు

పొలం పిలుస్తోంది.. రైతులకు భరోసా ఇస్తోంది!



ఇందుకూరుపేట: సూచనలిస్తున్న అధికారులు



మనుబోలు: జీలుగల పంపిణీ



కోవూరు: చెర్లోపాళెంలో ‘పొలంపిలుస్తోంది’

ఇందుకూరుపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఇందుకూరు పేటలో మండల వ్యవసాయాధికారి రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ‘పొలం పిలుస్తోంది’ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో 50 శాతం రాయితీపై జీలగలు, జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జీలగలు ఎకరానికి 10 కేజీల చొప్పున, జనుములు ఎకరానికి 8 కేజీల చొప్పున వేసుకోవాలన్నారు. పూత దశకు వచ్చి తర్వాత రోటవేటర్ సాయంతో భూమిలో కలిపి దున్నుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ దయాన, గ్రామ రైతులు పాల్గొ న్నారు.

మనుబోలు: జీలగలు, జనుము, పిల్లి పెసర విత్తనాలు సాగుకు ముందు చల్లుకుంటే భూమిసారం పెరుగుతుందని మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణయ్య అన్నారు. కాగితాలపూరు, పిడూరు గ్రామాల్లో మంగళవారం ‘పొలం పిలుస్తోంది’ కార్యక్రమాన్ని నిర్వహించారు. డ్రాగన్‌ఫ్రూట్ తోటను పరిశీలించి, తగిన సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వీఏఏ తేజస్వి తదితరులు పాల్గొన్నారు.

కోవూరు : రైతులు యూరియా వాడకాన్ని తగ్గించాల్సిందిగా వ్యవసాయ సహాయ సంచాలకులు అనిత సూచించారు. చెర్లోపాళెం సమీపంలోని పొలంలో మంగళవారం ఏర్పాటు చేసిన ‘పొలం పిలుస్తోంది’ కార్యక్రమంలో ఆమె రైతులకు పలు సూచనలు ఇచ్చారు. ఎకరాకు రెండున్నర కట్టల యూరియా వాడాలన్నారు. కౌలు రైతులు వీఆర్వోలను సంప్రదించి కార్డుల్ని పొందాలన్నారు. వ్యవసాయాధికారిణి రజని, వీఏఏలు కళ్యాణి, మెహరున్నీసా పాల్గొ న్నారు.

సైదాపురం: కమ్మవారిపల్లిలో మండల వ్యవ సాయశాఖాధికారి హైమావతి ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. నిమ్మపంటలో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై వివరించారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల సిబ్బంది, రైతులు వెంకటేశ్వర్లు నాయుడు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

మద్యం దుకాణంలో చోరీ



చోరీ జరిగిన మద్యం దుకాణం

రాపూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి) : రాపూరు పట్టణంలోని ఓ మద్యం దుకాణంలో దొంగలు పడ్డారు. ఐదు మద్యం కేసులు అపహరించుకెళ్లారు. మద్యం దుకాణం యజమాని ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని కోటూరుపాడుకు వెళ్లే మార్గంలో ఉన్న మద్యం దుకాణంలో పని చేసే వ్యక్తి సోమవారం రాత్రి యధావిధిగా దుకాణం మూసుకొని వెళ్లిపోయాడు. మంగళవారం ఉదయం దుకాణానికి వచ్చి చూసే సరికి దుకాణం తాళాలు పగులగొట్టి ఉన్నాయి. వెంటనే దుకాణం యజమానికి సమాచారం చేరవేయగా ఆయన షాపు వద్దకు చేరుకుని పరిశీలించారు. సుమారు రూ.45వేల విలువ గల ఐదు మద్యం కేసులు, కొంత నగదు అపహరించుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.


అక్రమంగా జామాయిల్ చెట్ల నరికివేత



జామాయిల్ కర్రను తరలిస్తున్న లారీని స్వాధీనం చేసుకున్న రెవెన్యూ అధికారులు

దుత్తలూరు(ఉదయగిరి), జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తురకపల్లిలో అక్రమంగా ప్రభుత్వ భూమిలో సాగు చేసిన జామాయిల్ చెట్లను నరికి లారీలో తరలించేందుకు యత్నించగా, మంగళవారం అధికారులు పట్టుకున్నారు. వివరాల మేరకు.. గ్రామంలోని సర్వేనెంబర్ 367లో 4.57 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. గ్రామానికి చెందిన వల్లెం మల్లారెడ్డి గత కొన్నేళ్లు ఆ సర్వేనెంబర్‌లో 2.50 ఎకరాలను సాగు చేసుకుంటున్నాడు. ఇటీవల రెవెన్యూ అధికారులు అది ప్రభుత్వ భూమిగా హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. అయితే అదే గ్రామానికి చెందిన భోగిరెడ్డి ఓబులరెడ్డి ప్రభుత్వ భూమిలోగల జామాయిల్ చెట్లను అక్రమంగా నరికి లారీలో లోడ్ చేయిస్తున్నాడు. ఈ విషయమై తహసీల్దారు నాగరాజుకు గ్రామస్థులు సమాచారం అందించారు. దీంతో ఆయన రెవెన్యూ అధికారులను అక్కడికి పంపారు. వారు లారీ స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం అక్రమంగా జామాయిల్ చెట్లను నరికిన వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేసి, కేసు నమోదు చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



పొంగులూరు శ్రీహరి (ఫైల్)

అల్లూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందిన ఘటన అల్లూరు పట్టణ శివారులోని వ్యవసాయ గోదాముల సమీపంలో రాజుపాలెం-ఇస్కపల్లి రోడ్డులో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు. మండలంలోని పురిణి పంచాయతీ మందిరం గ్రామానికి చెందిన పొంగులూరు శ్రీహరి(28) నార్తుమోపూరు వైపు నుంచి అల్లూరుకు మోటారుసైకిల్‌పై వస్తూ అదే సమయంలో నార్తుమోపూరుకు చెందిన దంపతులు గోదాముల్లో వాకింగ్ చేసుకొని మోటారుసైకిల్‌పై రోడ్డుపైకి వచ్చిన వారిని ఢీకొని అదే స్పీడుతో ఎదురుగా వస్తున్న మరొక మోటారుసైకిల్‌ను ఢీకొన్నాడు. ఈ ఘటనలో శ్రీహరి చొక్కా ఆ వాహనానికి ఇరుక్కోవడంతో శ్రీహరి కిందపడడంతో శ్రీహరిని కొంత దూరం ఈడ్చుకెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. అయితే ఆ వాహనదారుడు అక్కడి నుంచి తప్పించుకుని వెళ్లిపోగా శ్రీహరికి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా అప్పటికే శ్రీహరి మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. ఏకైక కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులతోపాటు మృతుని కుటుంబ సభ్యులు గుండెలవిసేలలా రోదించారు. వివాహం చేయాలని సంబంధాలు చూస్తున్న తరుణంలో కుమారుడిని కోల్పోవడం ఆ తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోయారు.

కుటుంబ సభ్యులే మోసం చేశారని ఫిర్యాదు

నెల్లూరు(క్రైం), జూలై 22(ఆంధ్రజ్యోతి) : కుటుంబ సభ్యులే తనను నమ్మించి మోసం చేశారని ఓ మహిళ వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... పొదలకూరురోడ్డు నేతాజీ నగర్‌లో పందిపాటి శ్రీవాణి నివసిస్తున్నారు. 2009లో ఆమెకు నడ్డ జనార్దన్‌తో వివాహమైంది. ఆయనకు 2014లో అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వచ్చింది. 2015లో శ్రీవాణికి కూడా సాఫ్ట్‌వేర్ ఉద్యోగం రావడంతో అమెరికాకు వెళ్లింది. ఈ క్రమంలో ఆమె అమ్మ మంజులమ్మ, చెల్లెలు సుధా రాణి, చెల్లెలి భర్త రామరాఘవరెడ్డి శ్రీవాణితో నమ్మకంగా ప్రవర్తించారు. సంపాదనను వారికి ఇస్తే జాగ్రత్తగా దాచుతామని చెప్పడంతో తన భర్తకు తెలియకుండా కుటుంబ సభ్యులకు రూ.2 కోట్లు నగదు పంపింది. గతేడాది శ్రీవాణి తండ్రి అనారోగ్యంతో మరణించడంతో ఆమె నెల్లూరుకు వచ్చారు. మరణానంతర కార్యక్రమాలు పూర్తయిన తర్వాత తాను పంపిన రూ.2 కోట్ల నగదు గురించి కుటుంబ సభ్యు ల వద్ద ప్రస్తావించింది. తండ్రే నగదు లావాదేవీలు చూస్తుండే వాడని, తమకు సంబంధం లేదని బుకాయించారు. ఇదెక్కడి న్యాయం అని ప్రశ్నించగా మరోసారి డబ్బులు అడిగితే నీ సంగతి తేలుస్తామని బెదిరించారు. అప్పటి నుంచి బంధువుల ద్వారా చర్చలు జరిపినా ఫలితం లేకపోవడంతో మంగళవారం వేదాయపాళెం పోలీసులకు శ్రీవాణి ఫిర్యాదు చేసింది.

గుర్తుతెలియని వృద్ధుడి ఆత్మహత్య

నెల్లూరు(క్రైం), జూలై 22(ఆంధ్రజ్యోతి) : నెల్లూరులో సోమవారం రాత్రి రైలుకిందపడి గుర్తుతెలియని వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు సమాచారం మేరకు... 65 నుంచి 70 సంవత్సరాల మధ్య వయసు వృద్ధుడు మరణించాడు. మృతదేహంపై పసుపు రంగు ఫుల్‌హ్యాండ్స్ షర్ట్, అదేరంగు పంచె, కాషాయ రంగు టవల్ ఉన్నాయి. రైల్వే ఎస్ఐ హరిచందన మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్లకు గాలి తీయొద్దన్నందుకు దాడి

నెల్లూరు(క్రైం),(ఆంధ్రజ్యోతి) : ట్రాక్టర్లలో గాలిని తీస్తుంటే ప్రశ్నించినందుకు ఓ వ్యక్తిని బూతులు తిట్టి, దాడి చేసిన ఘటనపై చిన్న బజారు పోలీసులు పలువురిపై కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నేతాజీనగర్‌కు చెందిన కయ్యాల గోపి ట్రాక్టర్ ట్రాన్స్‌పోర్ట్ విభాగంలో పనిచేస్తున్నాడు. ఆయన ప్రతీ రోజు రెండు ట్రాక్టర్లను మునిసిపల్ వెహికల్ షెడ్‌లో పెడుతుంటారు. ప్రస్తుతం మున్సిపల్ వర్కర్ల ధర్నా జరుగుతుండటంతో ఆయన సోమవారం రాత్రి ట్రాక్టర్లను పుట్టా ఎస్టేట్‌లో పెట్టారు. మంగళవారం ఉదయం కార్మిక నాయకుడు కత్తి శ్రీనివాసులు మరికొందరు కలిసి ట్రాక్టర్లకు గాలి తీస్తుండటంతో గోపి అడ్డుపడి ప్రశ్నించాడు. దీంతో వారందరూ కలిసి గోపిపై దాడి చేసి బూతులు తిడుతూ టైర్లకు గాలి తీసేశారు. దీంతో బాధితుడు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు పలువురిపై కేసు నమోదు చేశారు.కాగా గోపి తనను కులం పేరుతో దూషించాడని మయూరి అనే మహిళ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేశారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	134
స్కిన్ చికెన్	240
స్కిన్‌లెస్	264

కోడిగుడ్ల ధర (100): 520



డ్రగ్స్ వద్దు బ్రో... పోలీసుల అవగాహన

నెల్లూరు(క్రైం), జూలై 22(ఆంధ్రజ్యోతి) : ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు నగరంలోని రావూస్ డిగ్రీ కళాశాలలో మంగళవారం చిన్నబజారు పోలీసులు 'డ్రగ్స్ వద్దు బ్రో..' పేరుతో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. గంజాయి, మాదక ద్రవ్యాల వాడకంతో కలిగే దుష్పరిణామాలు, శారీరక, మానసిక ఆరోగ్యంపై చూపు ప్రభావం, నేరచరిత్ర వంటి అంశాలను విద్యార్థులకు ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు క్షుణ్ణంగా వివరించారు. ఈగల్ క్లబ్ కార్యకలాపాలు, ఈగల్ టోల్ ఫ్రీ నంబర్ 1972పై అవగాహన కల్పించారు. డ్రగ్స్ వద్దు బ్రో... నినాదాన్ని విద్యార్థులతో పలికించారు.

అడవిలా ఆఖరి మజిలీ!

నగరంలోని బుజబుజ నెల్లూరులో శ్మశాన వాటిక చిట్టడివిని తలపిస్తోంది. సుమారు 10వేల మంది జనాభా ఉన్న ఈ ప్రాంతంలోని శ్మశానానికి పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో గ్రహణం పట్టింది. సమాధుల చుట్టూ ముళ్ల చెట్ల విపరీతంగా పెరిగిపోయాయి. శ్మశానానికి వెళ్లే దారి కూడా కంప చెట్లతో మూసుకుపోయింది. దీంతో ఆఖరి మజిలీ లోనూ అవస్థలేనా? అంటూ స్థానిక ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

- బుజబుజనెల్లూరు శ్మశాన వాటికకు గ్రహణం
- చెట్ల పొదలతో నిండిన దారులు
- నీటి సౌకర్యం కూడా లేని దుస్థితి
- పాలకులు, అధికారులు పట్టించుకోవాలి



పిచ్చి మొక్కలతో అడవిని తలపిస్తున్న బుజబుజ నెల్లూరు శ్మశాన వాటిక

నెల్లూరు(విద్య), జూలై 22 (ఆంధ్రజ్యోతి) : బుజబుజ నెల్లూరులోని శ్మశాన వాటికలో అనేక సమస్యలు తాండవి స్తున్నాయి. వాటికలోకి వెళ్లేందుకు కనీసం రహదారి కూడా లేకుండా పోయింది. దారంతా ముళ్ల పొదలతో నిండిపోయి నడవడానికి కూడా వీలు లేకుండా ఉంది. అంతేకాదు, శ్మశానాన్ని ఎవరూ పట్టించుకోకపోవడంతో ఈ ప్రాంతం వాహనాల నిలుపుదల కేంద్రంగా, మెకానిక్ షెడ్‌గా మారింది. పెద్ద సంఖ్యలో లారీలను వాటికకు ఎదురుగా నిలిపివేస్తున్నారు. వాటి రిపేర్లు, లోడింగ్, అన్‌లోడింగ్‌లు కూడా ఇక్కడే చేస్తున్నారు. దీంతో శవ యాత్ర సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనికితోడు శ్మశానం లో కనీస వసతులు కరువయ్యాయి. ఎవరైనా మరణిస్తే పూడ్చేందుకు స్థలం కూడా లేక ప్రజలు అవస్థ పడుతున్నారు. ముళ్ల చెట్లను దాటుకుని ఎలాగోలా అంత్యక్రియలు పూర్తి చేశాక స్నానం చేయాలన్నా, కనీసం కాళ్లు తడుపుకోవాలన్నా కూడా నీటి సౌకర్యం లేకపోవడంతో ఉసూరుమంటు న్నారు. ఈ సమస్యను ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఈ నేపథ్యంలో దూరమైనా సరే తప్పనిసరి పరిస్థితుల్లో పార్థివ దేహాలను నగరంలోని బోడిగాడితోటకు తీసుకువెళుతున్నారు.

● అభివృద్ధికి నోచుకోక...

బుజబుజ నెల్లూరు శ్మశాన వాటిక 1.5 ఎకరాల్లో ఉంది. గతంలో పంచాయతీ పాలనలో ఉండగా శ్మశానం విస్తీర్ణం ఇంకా ఉండేది. కొందరు ఆక్రమణలకు పాల్పడటంతో నాటి పంచాయతీ ప్రతినిధులు న్యాయ స్థానాన్ని ఆశ్రయించి మిగిలిన స్థలం కబ్జాకు గురికాకుండా అడ్డుకున్నారు. నాడు పంచాయతీ నిధులు రూ.2లక్షలతో శ్మశానానికి ప్రహరీ నిర్మాణం చేపట్టగా అది అసంపూర్తిగానే మిగిలిపోయింది. ప్రస్తుతం ఆ గోడ కూడా కూలిపోయింది. నగరపాలక సంస్థలో విలీనం చేశాక ఈ శ్మశానవాటిక, మరో డివిజన్‌లోని వాటికకు కలిపి అభివృద్ధికి కోటి రూపాయల నిధులు మంజూరు చేశారు. ఆ నిధులతో శ్మశానంలో గ్రావెల్‌తో లెవలింగ్ చేసి వదిలేశారు. ఆ తర్వాత ఎవరూ పట్టించుకోకపోవడంతో అడవిలా మారింది. వర్షాకాలంలో ఈ ప్రాంతం నీట మునిగిపోతోంది. చెత్తా చెదారం, ముళ్లపొదలు, బురద, డ్రైనేజీతో దుర్గంధభరితంగా మారుతోంది. ఆ సమయంలో అంత్య క్రియలకు స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. శ్మశాన వాటికలను పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తున్నామని ప్రగల్భాలు పలికే నాయకులకు తమ ప్రాంత శ్మశానం కనిపించడం లేదని బుజబుజనెల్లూరు వాసులు విచారం వ్యక్తం చేస్తున్నారు.



శ్మశానానికి వెళ్లే దారిలో నిలిపి ఉన్న లారీలు



వాటికలోకి వెళ్లే దారిని, సమాధులను కమ్మేసిన ముళ్ల చెట్లు

న్యూస్ బాక్స్

'సర్వోదయ' ఈవో హేమచంద్రరావు కన్నుమూత

నెల్లూరు(సాంస్కృతికం), జూలై 22(ఆంధ్రజ్యోతి) : నగరంలో దేవదాయ ధర్మదాయ శాఖ పరిధిలోని శ్రీ సర్వోదయ కళాశాల, ఆ విద్యా సంస్థల కార్యనిర్వహణ అధికారి, కరస్పాండెంట్ హేమచంద్రరావు సోమవారం రాత్రి అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయన 1992లో దేవదాయ శాఖలో గుమస్తాగా చేరారు. 2022లో ఈవోగా ఉద్యోగోన్నతి పొందారు. సర్వోదయ కళాశాలకు ఆదాయం పెంచేందుకు కళాశాల ప్రాంగణంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ అనుమతులకు తీవ్రంగా కృషి చేశారు. మంగళవారం ఆయన పార్థివ దేహాన్ని దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి, పలు ఆలయాల ఈవోలు, మాజీ సహాయ కమిషనర్ యానాదిశెట్టి తదితరులు సందర్శించి నివాళులు అర్పించారు.

జయభారత్ ఆసుపత్రిలో అన్నదానానికి ఏడాది

నెల్లూరు (వైద్యం), జూలై 22 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని జయభారత్ ఆసుపత్రి కి వచ్చే రోగులు, వారి సహాయకులకు అన్న వితరణ ప్రారంభించి ఏడాది పూర్తయిందని దాత, ఎస్‌బీఐ విశ్రాంత ఉద్యోగి వరదరాజులు తెలిపారు. మంగళవారం జరిగిన అన్నదానం సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన స్నేహితులతో కలిసి ఆసుపత్రిలో గతేడాది అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించామని చెప్పారు. ప్రతి రోజూ 150 మందికి ఆహారం అందించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ట్రస్ట్ సభ్యులు డాక్టర్ సీవీ సుబ్రహ్మణ్యం, గుర్రం సుధాకర్‌ను సత్కరించారు.

'డీహెచ్ఈవోగా లాగిన్‌లో మార్పు చేయండి'

నెల్లూరు (వైద్యం), జూలై 22 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ పోస్టును డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ అధికారిగా మార్పు చేశారని, ఈ మేరకు ఖజానా శాఖ లాగిన్‌లోనూ మార్చాలని ఆ శాఖ ఖజానా అధికారులను ఆఫీసర్స్ అసోసియేషన్ కోరిం ది. ఈ మేరకు మంగళగిరిలోని ఖజానా శాఖ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం జేడీ శ్రీనివాసులు నాయక్‌కు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రావు వినతి పత్రం ఇచ్చారు. ఎంసీహెచ్ ఏడీ డాక్టర్ అనిత్‌కుమార్, మెడికల్ ఎడ్యుకేషన్ డీడీ డాక్టర్ విజయలక్ష్మికి కూడా వినతులిచ్చారు.

'హరిహర వీరమల్లు' విజయవంతానికి పూజలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూలై 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నటించిన హరిహర వీరమల్లు సినిమా విజయవంతం కావాలని జనసేన పార్టీ నాయకుడు నూనె మల్లికార్జున యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం బీవీ నగర్‌లోని కృష్ణ మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. 101 టెంకాయలు కొట్టారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, నాయకులు సుందరరామిరెడ్డి, పావుజెన్ని చంద్రశేఖర్ రెడ్డి, కృష్ణారెడ్డి, వై రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

మనుమసిద్ధి నగర్‌లో అభివృద్ధి పనులు

నెల్లూరు రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం 41వ డివిజన్ పరిధిలోని మనుమసిద్ధి నగర్‌లో రూ.90 లక్షలతో నిర్వహించనున్న అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.

గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

గ్రామాల్లో తలెత్తుతున్న రెవెన్యూ పరమైన సమస్యలను అక్కడిక్కడే పరిష్కరించేందుకు రూరల్ మండలంలోని 18 గ్రామాల్లో 9 రోజులు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని గొల్లకందుకూరు, సజ్జాపురంలో మంగళవారం ఎంపీపీ బూడిద విజయకుమార్‌తో కలిసి సదస్సుల్లో పాల్గొన్నారు. మాజీ మేయర్ భానుశ్రీ, సర్పంచ్ దొరసానమ్మ, పొణక హరిప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్యే కార్యాలయ ఇన్‌చార్జులు వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, చక్రవర్ధన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులు అందుబాటులో ఉండాలి

నెల్లూరు(సిటీ), జూలై 22,(ఆంధ్రజ్యోతి) : నగరంలోని సచివాలయ ఉద్యోగులందరూ స్థానిక ప్రజలకు అందుబాటులో ఉండాలని కార్పొరేషన్ కమిషనర్ నందన్ సూచించారు. నెల్లూరు ఆర్డీవో అనూషతో కలిసి కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగులందరూ సమయపాలన పాటించాలని, పీజీఆర్ఎస్‌కు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. డివిజన్లలో మౌలిక సదుపాయాల కల్పనకు చొరవ తీసుకో వాలని, ప్రభుత్వ పథకాల్లో అర్హులకు స్థానం కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీ చెన్నుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులపై చలానాలు, పెనాల్టీలు రద్దు చేయాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

నెల్లూరు (వైద్యం), జూలై 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఆటో కార్మికులపై విధిస్తున్న ఈ-చలానాలు, పెనాల్టీలు వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టీవీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఆటో కార్మిక సంఘం నగర మహాసభ జరిగింది. ప్రసాద్, సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, రాజా మాట్లాడుతూ వాహన మిత్ర పథకం కింద రూ.15వేలు ఇస్తామని ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీని రాష్ట్ర ప్రభుత్వం నేటికీ నెరవేర్చలేదన్నారు. వాహనాల ఫిట్నెస్, అన్ని రకాల సేవలపై 100 శాతం ఫీజులు పెంచి ఆటో కార్మికుల నడ్డి విరుస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో టోల్‌గేట్ల వద్ద ఆటోలకూ ఫీజు వసూలుకు ప్రభుత్వం యోచిస్తోందని ఆరోపించారు. ఆటో కార్మికులపై కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెంబర్ 21, భారతీయ న్యాయ సంహిత 106/(1)(2) సెక్షన్లను రద్దు చేయాలని కోరారు. అనంతరం 31 మందితో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అత్తిమూరు శ్రీనివాసులు, నాగేశ్వర రావు, రవీంద్ర, బాబూరావు, కాయం శ్రీనివాసులు, మూలం ప్రసాద్, దయాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాల స్ఫూర్తి ప్రదాత అచ్యుతానందన్

- సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్

నెల్లూరు (వైద్యం), జూలై 22 (ఆంధ్రజ్యోతి) : మహోన్నత ఉద్యమాల స్ఫూర్తి ప్రదాత కేరళ మాజీ ముఖ్యమంత్రి అచ్యుతానందన్ అని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ కొనియాడారు. ఆయన మృతికి సంతాపం తెలుపుతూ మంగళవారం సీపీఎం జిల్లా కార్యాలయంలో అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ కేరళ రాష్ట్రాన్ని అచ్యుతానందన్ అభివృద్ధి చేశారన్నారు. కేరళ కమ్యూనిస్టు ఉద్యమంలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నారని చెప్పారు. ఆయన ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, గోగుల శ్రీనివాసులు, మూలి వెంగయ్య, మంగళం పుల్లయ్య, తిరకాల దయాకర్, నాగేశ్వరరావు, ప్రసాద్ అన్నపూర్ణమ్మ, చంద్ర రాజగోపాల్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



అచ్యుతానందన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



భక్తిశ్రద్ధలతో ప్రదోషకాల పూజలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూలై 22(ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలస్థానేశ్వర స్వామి ఆలయం, రాజరాజేశ్వరి ఆలయంలోని సుందరేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం ప్రదోషకాల పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. పరమేశ్వరుడికి, నందీశ్వరునికి విశేష అభిషేకాలు, పూజలు చేశారు. మూలస్థానేశ్వర ఆలయంలో చిన్న వెండి నంది వాహనంపై శివపార్వతులకు ప్రాకారోత్సవం జరిగింది.

రాష్ట్ర బేస్‌బాల్ పోటీల్లో కేపీసీ విద్యార్థినికి బంగారు పతకం

నెల్లూరు(విద్య), జూలై 22 (ఆంధ్రజ్యోతి) : అనంతపురంలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో నగరంలోని కేపీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని జీ పురందేశ్వరి ఉత్తమ ప్రతిభతో బంగారు పతకం సాధించిం ది. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసులు రెడ్డి ఆ విద్యార్థిని ని ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్‌లో జాతీయ పోటీల్లో కూడా సత్తా చాటాలని ఆ కాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ పాటూరు వేణుగోపాల్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థిని పురందేశ్వరిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసులు రెడ్డి

మా డిమాండ్లు నెరవేర్చాలి

- వాహనాల షెడ్డు వద్ద కార్మికుల ఆందోళన

నెల్లూరు(సిటీ), జూలై 22,(ఆంధ్రజ్యోతి) : తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ పారిశుధ్య కార్మికులు కార్పొరేషన్‌కు చెందిన వాహనాల షెడ్డు వద్ద ఆందోళనకు దిగారు. మంగళవారం ఆ షెడ్డు గేట్లకు ఎదుట నిరసన వ్యక్తం చేస్తు రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు పెంచల నరస య్య, కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ ఇంజనీరింగ్ విభాగంలోని పారిశుధ్య కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని కోరారు. ప్రజలకు మెరుగైన ఆరోగ్యం ఇచ్చే పారిశుధ్య కార్మికులు అనారోగ్యా ల పాలవుతున్నారని తెలిపారు. కొన్ని రోజులుగా పారిశుధ్య కార్మికులు కుటుంబాలకు దూరమై ఆందోళన బాటపట్టారని, ప్రభుత్వం కనికరం కూడా చూపడం లేదని విమర్శించారు. ఈ కార్యక్ర మంలో నాయకులు రెహనాబేగం, కొండా ప్రసాద్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.



వెహికల్ షెడ్డు వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

పాఠశాలలో ప్రమాద ఘంటిక

- కూలేందుకు సిద్ధంగా వాటర్ ట్యాంక్
- పెచ్చులూడుతున్నా పట్టించుకోరు
- కొత్త ట్యాంకు కట్టినా వాడకపోవడంతో నిరుపయోగం

నెల్లూరు(వెంకటేశ్వరపురం), జూలై 22 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వెంకటేశ్వరపురం పరిధిలో ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న వాటర్ హెడ్ ట్యాంకు కూలేందుకు సిద్ధంగా ఉంది. వందలాది చిన్నారులు చదువుకునే ఈ పాఠశాలలో ఆ ట్యాంకు ఏ క్షణంలోనైనా కూలేలా ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. దీంతో పిల్లలు, వారి తల్లితండ్రులు బిక్కు, బిక్కుమంటున్నారు. 40 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ ట్యాంకు నుంచి నిత్యం పెచ్చులూడి పడుతున్నాయి. ఇప్పటికే మెట్లు మొత్తం కూలిపోయి ట్యాంకుపైకి వెళ్లేందుకు వీలు లేకుండా ఉన్నది. వెంకటేశ్వరపురం పరిధిలోని వేలాది మందికి తాగునీరు అందించే ఈ ట్యాంకు జీవిత కాలం ముగియడంతో ఐదేళ్ల క్రితం అంబేడ్కర్‌కాలనీ ప్రాంతంలో రూ.లక్షలు వెచ్చించి నూతన ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మించారు. అయితే ఇంత వరకు ఆ కొత్త ట్యాంకును వాడుకలోకి తీసుకురాకపోవడం గమనార్హం. ప్రజారోగ్య శాఖ అధికారుల నిర్లక్ష్యంతో నూతన ట్యాంకు నిరుపయోగంగా మారింది.



నిరుపయోగంగా ఉన్న నూతన ట్యాంకు

● మురికినీరు సరఫరా

పెచ్చులూడుతూ కూలేందుకు సిద్ధంగా ఉన్న పాత ట్యాంకు నుంచే వెంకటేశ్వరపురం ప్రజలకు నీరు సరఫరా చేస్తున్నారు. మెట్ల లేకపోవడంతో ఈ ట్యాంకుని చాలాకాలంగా శుభ్రం చేయడం లేదు. అలాగే క్లోరినేషన్ జరపకుండానే నీరు సరఫరా చేస్తున్నారు. దీంతో కలుషిత నీరు సరఫరా అవడంతో వెంకటేశ్వరపురం ప్రజలకు ఆరోగ్య సమస్యలు ఎక్కువగా వస్తున్నాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో ట్యాంకు చుట్టూ నీరు చేరుతోంది. దీంతో ఏ క్షణంలో అయినా అది కూలిపోతుందని చుట్టుపక్కల వారు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా నగర పాలక సంస్థ, ప్రజారోగ్య శాఖ ఉన్నతాధికారులు స్పందించి నూతనంగా నిర్మించిన ట్యాంకును ప్రారంభించి పాత ట్యాంకును కూల్చేయాల్సి ఉంది.



కూలేందుకు సిద్ధంగా ఉన్న ట్యాంకు

ఫ్లోరోసిస్ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ఉదయగిరి, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఫ్లోరోసిస్ వ్యాధి బారినపడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకునేలా వైద్యఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించాలని జిల్లా ఫ్లోరోసిస్ నివారణ అధికారిణి డాక్టర్ దివ్య తెలిపారు. మంగళవారం పాత సీహెచ్‌సీలో గండిపాళెం పీహెచ్‌సీ సిబ్బందితో ఆమె సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ ఫ్లోరైడ్ నీటితో వండిన ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల ఫ్లోరోసిస్ వ్యాధి బారినపడతామన్నారు. అనంతరరం ఆర్లపడియ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఫ్లోరోసిస్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి శివకల్పన, సీహెచ్‌వో శివకుమారి, హెచ్ఈ వెంకటే శ్వర్లు, వైద్యఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మామిడి కొమ్మలు కత్తిరించాలి

- జిల్లా ఉద్యాన అధికారి సుబ్బారెడ్డి

కలువాయి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మామిడి తోటలు సాగు చేసిన రైతులంతా కోతలు పూర్తయిన తరువాత తప్పకుండా చెట్ల కొమ్మలు కత్తిరింపు ప్రక్రియ చేపట్టాలని జిల్లా ఉద్యానవనశాఖాధికారి ఎం వీ.సుబ్బారెడ్డి సూచించారు. మండలంలోని కొలవపల్లి సమీపంలో సాగులో ఉన్న పునాసరకం మామిడి చెట్లను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆగస్టు ఆఖరు నాటికి కొమ్మల కత్తిరింపులు పూర్తి చేసి ఎరువులు, నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. తద్వారా రైతులు మంచి దిగుబడులు సాధించేందుకు అవకాశం ఉందన్నారు. ఆయన వెంట మండల ఉద్యానవన శాఖాధికారి మిథాలి, రైతులు ఉన్నారు.

భూసేకరణ ప్రక్రియకు అడుగులు

(5వ పేజీ తరువాయి)

ఈ పనిలో ఉన్న ఇండోసోల్ సిబ్బంది వ్యూహాత్మకంగా ఇప్పటికే 600 ఎకరాల వరకు రైతుల సమ్మతి పత్రాలు పొందగలిగామని మీడియాకు లీకుల సమాచారం ఇస్తుండటం విశేషం. కలెక్టరేట్‌లోను కొందరు సిబ్బంది పనిలో పనిగా వెయ్యి ఎకరాల వరకు రైతుల సమ్మతి వచ్చినందున త్వరలోనే భూసేకరణ ప్రక్రియలో మలిదశ చర్యలు ప్రారంభిస్తామని, అంగీకారం తెలిపిన రైతుల ఖాతాలకు సొమ్ము జమచేయటం ద్వారా మరి కొందరు రైతులు ముందుకొచ్చేలా చూస్తామని చెబుతున్నట్లు సమాచారం.

● పునరావాస కాలనీల కోసం...

ఇండోసోల్ పరిశ్రమ ఏర్పాటు కోసం కరేడులో భూములు సేకరించటంతోపాటు జాతీయ రహదారికి సమీపంలో ఉన్న రామకృష్ణాపురం, ఉప్పరపాలెం, పొట్టేనిగుంట సంఘాలను ఖాళీ చేయించాలని నిర్ణయించిన విష యం తెలిసిందే. అయితే ఆ కాలనీల ప్రజలు విముఖత చూపుతుండటంతో సోమవారం కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు రామకృష్ణాపురం, ఉప్పరపాలెం గ్రామాలలో ప్రజలతో సమావేశాలు ఏర్పాటుచేసి మెరుగైన సౌకర్యాలతో పునరావాసం కల్పిస్తామని నామాట నమ్మి సహకరించాల ని విజ్ఞప్తి చేశారు. అయితే, గ్రామస్థులమంతా సమావేశమై అందరి అభిప్రాయాలతో నిర్ణయం తీసుకున్నాక మీకు చెబుతామని బదులిచ్చారు. మరోవైపు ఖాళీచేయాల్సిన మూడు గ్రామాలకు పునరావాస కాలనీల కోసం అనువైన స్థలాన్ని సేకరించేందుకు అధికార యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. జాతీయ రహదారి పక్కనే పునరావాస కాలనీలు ఏర్పాటుచేస్తే వారు అంగీకరిస్తారన్న ఆలోచనతో అనువైన స్థలం కోసం అన్వేషిస్తున్నారు. అందులో భాగంగా మూడురోజులక్రితం వేరువెంకటేశ్వరస్వామి ఆలయానికి, మన్నేరుకు మధ్యలో జాతీయ రహదారికి పడమరవైపు ఉన్న భూములను మూడురోజులక్రితం కందుకూరు సబ్ కలెక్టరు తిరుమాణి శ్రీపూజ పరిశీలించారు. ఆ భూముల యజమానులతో సంప్రదింపులు జరుపుతూనే ఇతర ప్రాంతాలలో కూడా భూములను పరిశీలన చేస్తున్నారు.



15 రోజులుగా మరమ్మతులకు గురైన విద్యుత్ మోటార్



నిరుపయోగంగా మారిన వాటర్ కూలరు

వైద్యశాలలో తాగునీటి కష్టాలు

ఉదయగిరి వైద్యశాలలో రోగులను, సిబ్బందిని తాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. ఇక్కడ రెండు విద్యుత్ మోటార్లు ఉన్నాయి. 15 రోజుల క్రితం ఓ మోటార్ మరమ్మతులకు గురైంది. మరో మోటార్‌లో నీరు అడుగంటింది. ఈ నేపథ్యంలో ఆసుపత్రి గదుల్లోని బేసిన్‌లు, వార్డులు, మరుగుదొడ్లలో నీరు రాకపోవడంతో అవస్థలు పడుతున్నారు. అలాగే తాగునీరు అందించే వాటర్‌కూలర్లు సైతం నిరుపయోగంగా మారాయి. దీంతో రోగులు బయట నగదు వెచ్చించి తాగునీరు కొనుగోలు చే స్తున్నారు. నీరు లేకపోతే ఇబ్బందులు ఎలా ఉంటాయో అధికారులకు తెలియదా ? అంటూ పలువురు రోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై డీడీవో ప్రశాంత్‌ను వివరణ కోరగా మోటార్ బాగు చేయించేందుకు నిధుల్లేవన్నారు. విషయాన్ని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన మోటార్ల మరమ్మతులకు చర్యలు చేపడతామని తెలిపారన్నారు.

-ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి)

పై అక్షరమాలగా విద్యార్థులు

అనంతసాగరం మండలం చిలకలమర్రి ఉన్నత పాఠశాలలో మంగళవారం గణితంలోని పై ఉజ్జాయింపు దినోత్సవం సందర్భంగా విద్యార్థులు పై అక్షరమాలగా ప్రత్యేక ప్రదర్శన నిర్వహించారు. ఉపాధ్యాయుడు చల్లా చంద్రశేఖ ర్‌రెడ్డి మాట్లాడుతూ గణితంలో పై స్థిరాంకానికి ఎంతో ప్రాధాన్యత ఉందని తెలిపారు. విద్యార్థి వికాసా నికి గణితం ఎంతో దోహదపడు తోందని పేర్కొన్నారు. కార్యక్రమం లో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

-అనంతసాగరం, ఆంధ్రజ్యోతి



కార్మికుల హక్కులు కాలరాసేందుకే లేబర్ కోడ్‌లు

ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కట్టా సుబ్రహ్మణ్యం



ఎస్‌డబ్ల్యూఎఫ్ నూతన కమిటీతో కట్టా సుబ్రహ్మణ్యం, సీనియర్ నేతలు

కావలి(టౌన్), జూలై 22(ఆంధ్రజ్యోతి) : కార్మికుల హక్కులు కాలరాసేందుకే కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్‌కోడ్‌లు తెచ్చిందని ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షులు కట్టా సుబ్రహ్మణ్యం ఆరోపించారు. మంగళవారం రెడ్‌క్రాస్ సమావేశ మందిరంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ 15వ మహాసభ జరిగింది. ముందుగా డిపో ప్రాంగణంలో సీనియర్ నాయకులు డీఆర్ రెడ్డి జెండా ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వాలు కార్మిక, ఉద్యోగుల హక్కులను కాలరాసి కార్పొరేట్ శక్తులకు ఎర్ర తివాచీలు పరుస్తున్నాయని ఆరోపించారు. 8గంటల పని దినాన్ని తుంగలో తొక్కి 12 గంటల పని విధానాన్ని ప్రవేశపెట్టి కార్మికుల శ్రమ దోపిడీకి పూనుకున్నారన్నారు. కార్మికులకు పోరాడే హక్కు లేదంటూ స్వేచ్ఛా స్వాతంత్రాలు హరిస్తున్నారన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా, పేదలకు ప్రభుత్వ విద్య, వైద్యం అందించకుండా ప్రజలను పక్కదారి పట్టించేందుకు మత విద్వేషాలు రెచ్చగొడుతూ లౌకిక వాదాన్ని దెబ్బతీస్తున్నారన్నారు. దేశంలో జరుగుతున్న కార్మిక వ్యతిరేక విధానాన్ని కార్మికులు పసిగట్టి ఐక్యంగా పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో కావలి శాఖ కార్యదర్శి వెంకటేశ్వర్లు, రీజినల్ నాయకుడు నాగేంద్రప్రసాద్, సీనియర్ నాయకుడు మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

● నూతన కమిటీ ఏకగ్రీవం

నూతన కమిటీని ఏకగ్రావంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడుగా ఎం వెంకయ్య, అధ్యక్షుడుగా వీవీ రెడ్డి, కార్యదర్శిగా సీహెచ్ వెంకటేశ్వర్లు, ప్రచార కార్యదర్శిగా అల్లాబక్షు, కోశాధికారిగా యు మధు, తదితరులు ఎన్నికయ్యారు.

క్రిటికల్ కేర్... సిద్ధం

- ఆగస్టు 15కల్లా జీజీహెచ్‌కు అప్పగింత
- మొత్తం నిర్మాణానికి రూ.23.75 కోట్లు
- రెండు అధునాతన ఆపరేషన్ థియేటర్లు
- ఆధునిక వైద్య పరికరాల ఏర్పాటు
- ఇప్పటికే 80 శాతం పరికరాల రాక

నెల్లూరు (వైద్యం), జూలై 22 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి(జీజీహెచ్)లో నిర్మాణంలో ఉన్న క్రిటికల్ కేర్ విభాగం పూర్తి కావస్తోంది. ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం కింద చేపడుతున్న ఈ నిర్మాణంతోపాటు ఆధునిక వైద్య పరికరాల కోసం రూ.23.75 కోట్లు విడుదల చేశారు. 51 వేల చదరపు అడుగుల స్థలంలో మూడు అంతస్తులుగా దీనిని నిర్మించారు. భవన నిర్మాణం పూర్తి కాగా లిఫ్ట్ నిర్మాణం జరుగుతోంది. ఆగస్టు 15వ తేదీ కల్లా ఈ అధునతన భవనాన్ని జీజీహెచ్‌కు అప్పగించనున్నారు. ఇందులో క్రిటికల్ కేర్ విభాగంతోపాటు అదనంగా అల్ట్రాసౌండ్ స్కానింగ్, ఎక్స్‌రే, రెండు పడకల తల్లీబిడ్డల గది, ఐదు పడకల ఎమర్జెన్సీ విభాగం, రెండు పడకల చిన్నపిల్లల విభాగాలు ఏర్పాటు చేస్తారు. అలాగే 30 పడకల సాధారణ రోగుల వార్డు, 10 పడకల ఐసీయూను ఏర్పాటు చేయనున్నారు. రెండవ అంతస్తులో స్టెరిలైజేషన్‌తో పాటు రెండు ఆధునాతన ఆపరేషన్ థియేటర్లు నిర్మించారు.



క్రిటికల్ కేర్ భవనం

● వైసీపీ హయాంలో నిర్లక్ష్యం

క్రిటికల్ కేర్ భవన నిర్మాణానికి మూడేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. కేంద్రం 60 శాతం నిధులు విడుదల చేయగా మిగిలిన 40 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేయాల్సి ఉంది. అయితే అప్పటి వైసీపీ ప్రభుత్వం ఈ నిర్మాణంపై నిర్లక్ష్యం ప్రదర్శించింది. తన వాటా నిధుల విడుదలలో జాప్యం చేయడంతో మొదట్లో నిర్మాణం ఆగి పోయింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధులు వెనక్కు పోతాయ న్న ఆలోచనతో 2023 మార్చి నెలలో కేంద్రం నిధులతో పనులు ప్రారంభించింది. అయితే చేసిన పనులకు కాంట్రాక్టర్‌కు నిధులు విడుదల చేయక పోవటంతో నిర్మాణంలో జాప్యం జరిగింది. ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడ్డాక నిధులను విడుదల చేయటంతో నిర్మాణం పూర్తయింది. ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎంఎస్ ఐడీసీ) నిర్మాణ బాధ్యతలను నిర్వహిస్తోంది. జీజీహెచ్‌లో గతంలో రహదారులు నిర్మించిన కాంట్రాక్టు సంస్థే క్రిటికల్ కేర్ భవన నిర్మాణ టెండర్లు దక్కించుకుంది.

● ఆధునిక పరికరాలు

నూతన క్రిటికల్ కేర్ విభాగానికి కావాల్సిన ఆధునిక పరికరాలలో 80 శాతం ఇప్పటికే చేరుకున్నట్లు వైద్యాధికారులు చెబుతున్నారు. వచ్చే నెలలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి క్రిటికల్ కేర్ భవనం అప్పగిస్తే వెంటనే దానిని అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లా మంత్రులతోగానీ, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ చేతుల మీదుగాగానీ ప్రారంభింపజేయాలని యోచిస్తున్నారు. నూతన భవనం అందుబాటులోకి వస్తే రోగులకు అత్యాధునిక వైద్య సేవలు అందుతాయి. ఇప్పటికే జీజీహెచ్‌లో 750 పడకలుఉండగా మరో 50 పడకలు కొత్తగా రానున్నాయి.

నిర్మాణం పూర్తి కావస్తోంది



ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో క్రిటికల్ కేర్ భవనం పూర్తి కావస్తోంది. ప్రస్తుతం లిఫ్ట్ మాత్రమే పెండింగ్‌లో ఉండటంతో ఆగస్టు 15కల్లా ఈ నిర్మాణన్ని అందుబాటులోకి తీసుకు వస్తాము. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిధుల భాగస్వామ్యంతో నిర్మాణం చేపడుతున్నాం. ఇందులో ఆధునిక ఆపరేషన్ థియేటర్‌తోపాటు అవసరమైన వైద్య పరికరాలు అందుబాటులోకి వస్తాయి.

- నిర్మల్ కుమార్, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ

ఇష్టంతో కష్టపడి చదివితే ఉన్నతి

ఏపీ సాంఘిక సంక్షేమశాఖ సొసైటీ డీపీసీ ప్రభావతి



ప్రిన్సిపాల్, అధ్యాపకులతో సమీక్షిస్తున్న డీపీసీ ప్రభావతి

లింగసముద్రం, జూలై 22(ఆంధ్రజ్యోతి) : బాలికలు ఇష్టంగా కష్టపడి చదివితేనే ఉన్నతస్థితికి చేరుకోగలరని ఏపీ సాంఘిక సంక్షేమశాఖ సొసైటీ జిల్లా ప్రాజెక్టు కోఆర్డినేటర్ (డీపీసీ) సీ.ప్రభావతి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పెదపవనిలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలను జిల్లా సమగ్ర శిక్షా అభియాన్ అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ డీ.వెంకట సుబ్బయ్య, ఇతర అధికారులతో కలిసి ఆమె సందర్శించారు. పలు రికార్డులు పరిశీలించారు. మెస్‌ను తనిఖీ చేసి, బాలికలకు మెనూ ప్రకారం రుచి శుచిగా మంచి భోజనం అందించాలని ప్రిన్సిపాల్ పీ రుక్మిణీదేవికి సూచించారు. బాలికలు, అధ్యాపకులతో మాట్లాడారు. 10వ తరగతి, ఇంటర్మీడియేట్‌లో బాలికలు ఇంకా మెరుగైన ఫలితాలు సాధించాలని పేర్కొన్నారు.

పీఎంశ్రీ పథకం పనులు పూర్తి చేయండి

గురుకుల పాఠశాలలో పీఎంశ్రీ పథకం కింద పాఠశాలకు ఎంపికైన ఫిజిక్స్, కెమిస్ట్రీ ల్యాబొరేటరీలు, కిచెన్ గార్డెన్, ప్లే గ్రౌండ్, బాతు రూం, నీటినిల్వ నిర్మాణాల పనులను త్వరగా పూర్తి చేయించాలని సమగ్ర శిక్షా అభియాన్ ఏపీసీ డీ.వెంకట సుబ్బయ్య అన్నారు. అనంతరం ఆయన స్థానిక శ్రీ భోగేరావు ఉన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. అలాగే నాడు-నేడు పనులను పరిశీలించి కొన్ని సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో సుధీర్‌బాబు, ఏఈ వేణు, వైస్ ప్రిన్సిపాల్ స్నేహలత, ఏంఈవో-2 ఎంవీ శివకుమార్, సీఆర్ఎంటీలు పీ.పురుషోత్తం, బీ.నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

లేటరల్ ఎంట్రీ అడ్మిషన్ల గడువు నెలాఖరు వరకు పొడిగింపు

వెంకటాచలం, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి యూనివర్సిటీ వివిధ కోర్సుల్లో లేటరల్ ఎంట్రీ కోసం అడ్మిషన్ల గడువును జూలై 31 వరకు పొడిగిస్తున్నట్లు డీవోఏ డైరెక్టర్ డాక్టర్ ఎం హనుమారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ నాలుగేళ్ల హానర్స్, హానర్స్ విత్ రీసెర్చ్ కోర్సులను పూర్తి చేసిన విద్యార్థులు ఈ లేటరల్ ఎంట్రీకి అర్హులన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాల కోసం వీఎస్‌యూ అధికారిక వెబ్‌సైట్‌నుగానీ, లేదా వీఎస్‌యూలోని డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ (డీఓఏ) కార్యాలయంలో గానీ సంప్రదించాలన్నారు.

108 పొగాకు బేళ్లు తిరస్కరణ

కలిగిరి, (ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి మంగళవారం రైతులు మొత్తం 541 పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 10కంపెనీల ప్రతినిధులు పాల్గొని 433 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-88, ఆర్‌ఆర్-5, సీఆర్-12, జంపింగ్‌లాట్స్-3 కారణాలతో 108 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.160గా ఉంది.

ఇంటింటికి వెళ్లి తల్లీబిడ్డ ఆరోగ్యాన్ని పరిశీలించాలి

● జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుజాత



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సుజాత

నెల్లూరు (వైద్యం), జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ఆశా కార్యకర్తలు ప్రతీ ఇంటికి తిరిగి తల్లీ, బిడ్డ ఆరోగ్య స్థితిని పరిశీలించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుజాత ఆదేశించారు. మంగళవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఆశా నోడల్ అధికారులతో సమీక్ష జరిపారు. 3 నుంచి 15 నెలల బిడ్డలను సందర్శించి విరేచనాలు, శ్వాసకోశ సమస్యలు, వ్యక్తిగత పరిశుభ్రతకు సంబంధించిన సమస్యలు ఉంటే గుర్తించాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, పిల్లలు రక్తహీనతతో బాధపడకుండా ఐరన్ మాత్రలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. డీఐవో డాక్టర్ ఉమామహేశ్వరి మాట్లాడుతూ గర్భిణులను గుర్తించి వివరాలు రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి మాట్లాడుతూ టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా క్షయ వ్యాధిగ్రస్తులకు తక్షణం చికిత్స అందేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమీవేశంలో డీపీఎంవో డాక్టర్ రమేష్, నరసింహారావు, బ్రిజిత మార్గరేట్, సునీత తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన సేవలపై దృష్టి పెట్టండి

విద్యుత్ శాఖ అధికారులతో ఎస్ఈ విజయన్



ప్రసంగిస్తున్న విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్

నెల్లూరు (జడ్పీ), జూలై 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పాజిటివ్ పబ్లిక్ పరసెప్షన్ కార్యక్రమం కింద ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్ అధికారులు, సిబ్బందికి సూచించారు. నెల్లూరులోని ఎలక్ట్రిసిటీ రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం నెల్లూరు టౌన్ ఈఈ ఎం శ్రీధర్ అధ్యక్షతన డివిజన్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఈ మాట్లాడుతూ వినియోగదారుల నుంచి వచ్చిన ప్రతికూల ఫీడ్‌బ్యాక్‌పై దృష్టి సారించాలన్నారు. మూడు అంశాల్లో లోపాలుంటే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకో వాల్సి వస్తుందని హెచ్చరించారు. స్మార్ట్ మీటర్ల వ్యవహారంలో ప్రజల్లో నెలకొన్న అపోహలను తొలగించాలని సూచించారు. వీటి బిగింపు వల్ల వినియోగదారులకు ఎటువంటి అదనపు భారం ఉండదని స్పష్టం చేశారు. కరెంటు పోయిందని వినియోగదారుల నుంచి ఫిర్యాదులు వస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ విద్యుత్ లైన్లలో లోపాలుంటే ముందస్తుగానే గుర్తించాలన్నారు. వినియోగదారులు విద్యుత్ అంతరాయాలు, సమస్యలపై టోల్‌ఫ్రీ నెంబరు 1912, 1800425155333లకు ఫోన్ చేయాలని, అలాగే 9133331912 నెంబర్‌కు వాట్సాప్ చాట్ ద్వారా అధికారుల దృష్టికి తీసుకువచ్చి త్వరితగతిన సమస్యను పరిష్కరించుకోవచ్చని చెప్పారు. ఈ సమావేశంలో సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి, డీఈలు అశోక్, సునీల్, కిరణ్, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్లు బొబ్బిలి సురేఖ, ఆశాలత పాల్గొన్నారు.

ఎకరాకు మూడు బస్తాల యూరియానే వాడండి

● డీఏవో సత్యవాణి




రాయితీపై జీలుగలను రైతులకు అందిస్తున్న సత్యవాణి

నెల్లూరు రూరల్, జూలై 22,(ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత ఎడగారు వ్యవసాయ సీజన్‌లో వరి సాగు చేస్తున్న రైతులు ఎకరాకు మూడు బస్తాల యూరియాను మాత్రమే వాడాలని జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి సూచించారు. మంగళవారం రూరల్ మండలంలోని కొండ్లపూడి, దేవరపాళెం గ్రామాల్లో ఆమె రైతులతో కలిసి పంట పొలాలను పరిశీలించారు. అనంతరం రాయితీపై జీలుగలను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మితిమీరిన యూరియా వాడకం అనర్థమ న్నారు. దీని వల్ల భూమి సహజత్వాన్ని కోల్పోతుందని తెలిపారు. ఒక దఫా యూరియాను తగ్గించుకుని ఆ స్థానంలో నానో యూరియాను పిచికారీ చేస్తే మేలు జరుగుతుందని సూచించారు. అన్నదాత సుఖీభవ పథకం జాబితాలో ఎవరైనా రైతుల పేర్లు లేకపోతే వెంటనే వ్యవసాయ శాఖను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఏలు నర్సోజీ, శ్రీదేవి, ఏవో నాగమోహన్, ఇన్సో మేనేజర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సెప్టెంబరు 13న జాతీయ లోక్ అదాలత్

● జిల్లా ప్రధాన న్యాయాధికారి శ్రీనివాస్



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి శ్రీనివాస్

నెల్లూరు (లీగల్), జూలై 22 (ఆంధ్రజ్యోతి) : జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా సెప్టెంబరు 13వ తారీఖున జిల్లా వ్యాప్తంగా లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయాధికారి జీ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం జిల్లా కోర్టులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లోక్ అదాలత్‌ను కక్షిదారులు వినియోగించుకుని సుహృద్భావ వాతావరణంలో కేసులు రాజీ చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మూడవ అదనపు జిల్లా జడ్జి యల్ తేజోవతి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ కే వాణి, మునిసిపల్ కమిషనర్ నందన్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్ రెడ్డి, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జల్లి పద్మాకర్, న్యాయవాది వీ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

రూ.3 కోట్లతో నూతన హాస్టల్ భవన నిర్మాణం

● హాస్టళ్లలో విద్యార్థుల సంఖ్య పెంచాలి : సాంఘిక సంక్షేమ శాఖ డీడీ శోభారాణి



మనుబోలు ఎస్సీ బాలికల వసతి గృహాన్ని పరిశీలిస్తున్న డీడి శోభారాణి

మనుబోలు, జూలై 22(ఆంధ్రజ్యోతి): శిథిలావస్థలో ఉన్న ఎస్సీ బాలికల వసతి గృహం స్థానంలో నూతన హాస్టల్ భవనం నిర్మించేందుకు ప్రభుత్వం రూ. 3 కోట్లు మంజూరు చేసిందని సాంఘిక సంక్షేమశాఖ డీడీ శోభారాణి తెలిపారు. స్థానిక ఎస్సీ బాలుర, బాలికల వసతిగృహాలను మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా? రుచికరంగా ఉందా? అని పిల్లలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలతో కలిసి ఆమె అల్పాహారం తీసుకున్నారు. అనంతరం పిల్లలు తయారుచేసిన క్రాఫ్ట్‌లను పరిశీలించి అభినందించారు. బాలుర హాస్టల్‌లో మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరలోనే బాలికల హాస్టల్ పనులు ప్రారంభం అవుతాయన్నారు. హాస్టళ్లలో విద్యార్థుల సంఖ్య పెంచాలన్నారు. మెరుగైన వసతులు, నాణ్యమైన భోజనం అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ హాస్టళ్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూవో సుహాసిని, మ్యాట్రిన్‌లు మహేశ్వరి, అనిత తదితరులు పాల్గొన్నారు.


నిబద్ధత.. నిజాయితీ...సేవా తత్పరతతో

విధులు నిర్వహించండి : రేంజ్ ఐజీ త్రిపాఠి

గుంటూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : నిబద్ధత.. నిజాయితీ... అంకితభావం సేవా తత్పరతతో విధులు నిర్వహించాలని గుంటూరు రేంజ్ ఐజి సర్వ శ్రేష్ఠ త్రిపాఠి సూచించారు. ఈ మేరకు మంగళవారం తనను మర్యాదపూర్వకంగా కలిసిన శిక్షణ పూర్తి చేసుకున్న ప్రొబేషనరీ ఎస్‌ఐలకు దిశా నిర్దేశం చేశారు. గుంటూరు రేంజి పరిధిలో మొత్తం 53 మంది ఎస్‌ఐలు శిక్షణ పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. వీరిలో గుంటూరు జిల్లా నుంచి 23 మంది, పల్నాడు నుంచి 13, బాపట్ల నుంచి 10, ప్రకాశం నుంచి ఒకరు, నెల్లూరు, తిరుపతి నుంచి ముగ్గురు చొప్పున ఎంపికైన ఎస్‌ఐలు శిక్షణ పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి ఐజి త్రిపాఠి మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ, నేర పరిశోధన, సాంకేతిక పరిజ్ఞానం, పోలీసింగ్‌లో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనే దిశగా ఎప్పటికప్పుడు అవగాహన పెంపొందించుకోవాలన్నారు. పోలీస్ స్టేషన్లలో నిర్వహించే విధానాలు, రికార్డులు, స్థానిక చట్టాలు, భౌగోళిక పరిస్థితులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. సహచర ఉద్యోగులు, ప్రజలతో విశ్వాసపూర్వక సంబంధాలు కలిగి ఉన్నప్పుడే సమర్థవంతమైన పోలీసింగ్ సాధ్యమవు తుందన్నారు. ఈ సందర్భంగా శిక్షణలో వారు అభ్యసించిన అంశాలపై ప్రశ్నలు అడిగి, వారి సేవా దృక్పథాన్ని గమనించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా ఏఆర్ డిఎస్పీ ఏడుకొండల రెడ్డి, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

'యాక్సిస్' కుంభకోణంపై విచారణ జరపండి

● ఏఎస్పీకి యానాదుల సంక్షేమ సంఘం ఫిర్యాదు



ఏఎస్పీ సౌజన్యకు వినతి పత్రం ఇస్తున్న యానాదుల సంఘం నాయకులు

నెల్లూరు(క్రైం), జూలై 22(ఆంధ్రజ్యోతి) : ఫేక్ కంపెనీలను సృష్టించి ఎస్సీ, ఎస్టీలను సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా చూపి మోసం చేసిన యాక్సిస్ బ్యాంకు కుంభకోణంపై విచారణ జరపాలని యానాదుల సంక్షేమ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏఎస్పీ సౌజన్యకు వినతి పత్రం ఇచ్చారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య మాట్లాడుతూ ఈ కుంభకోణంపై కేసు నమోదు చేసి ఎనిమిది నెలలైనా ఎలాంటి చర్యలు లేవని, దీని వెనుక కొంత మంది బ్యాంకు సిబ్బంది పాత్ర ఉందన్నారు. నిందితులు జాలే వాసుదేవనాయుడు, అల్లాభక్షు, శివ, వెంకట్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై రెండు రోజుల్లో డీజీపీని కలుస్తామని, బాధితు లకు న్యాయం చేయకపోతే ఆగస్టు 1వ తేదీ నుంచి పోరాటానికి దిగుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా చైర్మన్ రాపూరు కృష్ణయ్య, అధ్యక్షుడు మానికల మురళి, మహిళా అధ్యక్షురాలు చెంబేటి ఉష నాగరాజు, కొప్పల రఘు, బాధితులు చలంచర్ల లక్ష్మీనారాయణ, మేకా తనూజ, వాసు తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాలువలో పూడికతీత

ఉదయగిరి, జూలై 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దిలావర్‌భాయ్‌వీధి పాఠశాల సమీపంలో ఉన్న మురుగు కాలువలో మంగళవారం పంచాయతీ అధికారులు ఎక్స్‌కవేటర్ సాయంతో పూడికతీత చేపట్టారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఇక్కడకు వచ్చిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు ఆ ప్రాంత ప్రజలు కాలువలో పూడిక తీయించాలని కోరారు. స్పందించిన ఆయన పూడిక తీయించాలని అధికారులను ఆదేశించారు. దీంతో కాలువలో పూడిక తీయించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పాములూరి సామ్రాజ్యం, ఉప సర్పంచి ముర్తుజా, డిప్యూటీ ఎంపీడీవో కరీముల్లా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9564
వెండి కిలో ధర	రూ. 117600
వెండి ఒక గ్రాము	రూ. 120.60

అంతా మా ఇష్టం.. అడిగేదెవరు!?

● రహదారికి అడ్డంగా నిలిపి అన్‌లోడు ● వాహన రాకపోకలకు ఆటంకం ● పట్టించుకోని పోలీసులు

సంగం, జూలై 22(ఆంధ్రజ్యోతి): అంతా మా ఇష్టం... మమ్మల్ని అడిగేదెవరన్నట్లు కొందరు బరితెగిస్తున్నారు. అందుకు నిదర్శనమే మంగళవారం సంగంలో ఫర్టిలైజర్స్, సిమెంట్ దుకాణదారులు లారీలను రహదారికి అడ్డంగా నిలిపి వాహన రాకపోకలకు ఆటంకం కలిగిస్తూ బస్తాలను అన్‌లోడు చేయడం. దీంతో రహదారిపై వాహనరాకపోకలకు ఆటంకం ఏర్పడుతోంది. ట్రాఫిక్ స్తంభిస్తుంది. సంగంలో బస్టాండ్ నుంచి ఎస్సీ హాస్టల్ వరకు పలు ఫర్టిలైజర్స్ (ఎరువులు), సిమెంట్ దుకాణాలు ఉన్నాయి. ఈ దుకాణాలకు వచ్చే సిమెంట్, ఎరువుల లారీలను రోడ్డుకు ఒక పక్కన నిలిపి అన్‌లోడ్ చేసుకోకుండా కూలీలకు అనుకూలంగా లారీని రహదారికి అడ్డంగా నిలిపి అన్‌లోడు చేస్తున్నారు. నిత్యం బస్సులు, ఆటోల రాకపోకలతో రద్దీగా ఉండే సంగం రహదారికి అడ్డంగా లారీలను నిలపడంవల్ల వాహన రాకపోకలు ఆటంకం ఏర్పడి ట్రాఫిక్ స్తంభిస్తుంది. పోలీసులు స్పందించి లారీలను రహదారికి అడ్డంగా నిలిపి అన్‌లోడు చేయకుండా చూడాలని ప్రయాణికులు, స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.


రహదారికి అడ్డంగా లారీని నిలిపి అన్‌లోడు చేస్తున్న కూలీలు

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), జూలై 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులను మంగళవారం ఘనంగా సన్మానించారు. హెచ్ఎం వీరభద్రయ్య ఆధ్వర్యంలో వీడ్కోలు పలుకుతూ బదిలీపై వెళ్లిన హిందీ, సోషల్ ఉపాధ్యాయులు పీ.వేణుగోపాల్, షేక్ మౌలాలీ లను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


సన్మానం అందుకుంటున్న బదిలీ ఉపాధ్యాయులు

● సచివాలయ ఉద్యోగులకు సన్మానం

ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని శకునాలపల్లి సచివాలయంలో పనిచేస్తూ ఇటీవల ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లిన ఉద్యోగులను సహచర ఉద్యోగులు మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అప్పాజీ, డిప్యూటీ ఎంపీడీవో కరీముల్లా, సర్పంచిలు కల్లూరి వెంకటేశ్వరరెడ్డి, కల్లూరి కృష్ణారెడ్డి, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.


సచివాలయ ఉద్యోగులను సన్మానించిన ఎంపీడీవో, సర్పంచులు, సహచర ఉద్యోగులు

మాతా పరమేశ్వరికి చందనాలంకారం



సంగం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక చెక్‌పోస్టు కాలనీలో వెలసి ఉన్న మాతా పరమేశ్వరి జాతరలో భాగంగా మూడోరోజు మంగళవారం అమ్మవారు చందనాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మూలవిరాట్‌కు చందనాలంకారం చేసి పూలతో అలంకరించారు. అనంతరం సాయంత్రం పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించారు.

ఫ్లోరోసిస్ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ దివ్య

ఉదయగిరి, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఫ్లోరోసిస్ వ్యాధి బారినపడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకునేలా వైద్యఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించాలని జిల్లా ఫ్లోరోసిస్ నివారణ అధికారిణి డాక్టర్ దివ్య తెలిపారు. మంగళవారం పాత సీహెచ్‌సీలో గండిపాళెం పీహెచ్‌సీ సిబ్బందితో ఆమె సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ ఫ్లోరైడ్ నీటితో వండిన ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల ఫ్లోరోసిస్ వ్యాధి బారినపడతామన్నారు. అనంతరం ఆర్లపడియ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఫ్లోరోసిస్ పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి శివకల్పన, సీహెచ్‌వో శివకుమారి, హెచ్‌ఈ వెంకటేశ్వర్లు, వైద్యఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఆధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి


ఆత్మకూరు : రైతులతో కలిసి వరి పైరును పరిశీలిస్తున్న ఎంఏవో కిశోర్‌బాబు

ఆత్మకూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): రైతులు ఆధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి కె కిషోర్‌బాబు తెలిపారు. మండలంలోని కరటంపాడు, బోయిళ్లచిరువెళ్ల గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సబ్సిడీపై జీలుగలు, జనుము విత్తనాలు కావాల్సిన రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. అనంతరం రైతులతో కలిసి వరి పంట సాగులో ఉన్న పొలాలను పరిశీలించి రైతులకు తగు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ ఉపాధ్యక్షుడు గార్లపాటి వేణుగోపాల్‌నాయుడు, మాజీ సర్పంచు మంతు యానాదిరెడ్డి, వీఏఏలు ఎస్ మంజుల, లక్ష్మీల హరి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవకు నేడు చివరి రోజు

కలువాయి : పొలం ఉండి అన్నదాత సుఖీభవ అర్హుల జాబితాలో పేర్లు లేనటువంటి రైతులు గ్రీవెన్స్‌లో దరఖాస్తు చేసుకునేందుకు గడువు బుధవారంతో ముగుస్తుందని మండల వ్యవసాయాధికారి చల్లా కళారాణి తెలిపారు. కుల్లూరులో మంగళవారం ఆమె పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో పంట సాగు చేసిన రైతులు పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. యూరియా అవసరమైన రైతులు తమను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుల్లూరు వ్యవసాయ సహాయకులు నాగేంద్ర పాల్గొన్నారు.

ఈ పంట నమోదు చేయించుకోండి

సంగం : వరి సాగు చేసిన రైతులు ఈ పంట నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారి వీ. శశిధర్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మండలంలోని వంగల్లు, మర్రిపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో వరి పొలాలను పరిశీలించారు. అనంతరం ఆర్‌ఎస్‌కేలో సమావేశం నిర్వహించారు. ఈ పంట నమోదు చేయించుకుంటేనే కొనుగోలు కేంద్రాల్లో పంట దిగుబడులను విక్రయించుకోవచ్చునని తెలిపారు. అన్నదాత సుఖీభవ జాబితాలో పేర్లులేని రైతులు ఆర్‌ఎస్‌కేలో సంప్రదించాలన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే టీడీపీ లక్ష్యం


కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ మండల నాయకులు

సీతారామపురం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా టీడీపీ పనిచేస్తున్నదని మండల టీడీపీ మైనార్టీ నాయకుడు షేక్ బాబు అన్నారు. క్లస్టర్ ఇన్‌చార్జి జాషువా, మండల నాయకులు పసుపులేటి వికాష్ బాబు ఆధ్వర్యంలో మంగళవారం మండలకేంద్రంలోని తోటవీధి, కురవ వీధి, బస్టాండ్ సెంటర్‌లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇజ్రాయిల్, తోట నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

మామిడి కొమ్మలు కత్తిరించాలి

● జిల్లా ఉద్యాన అధికారి సుబ్బారెడ్డి

కలువాయి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మామిడి తోటలు సాగు చేసిన రైతులంతా కోతలు పూర్తయిన తరువాత తప్పకుండా చెట్ల కొమ్మలు కత్తిరింపు ప్రక్రియ చేపట్టాలని జిల్లా ఉద్యానవనశాఖాధికారి ఎంవీ.సుబ్బారెడ్డి సూచించారు. మండలంలోని కొలవపల్లి సమీపంలో సాగులో ఉన్న పునాసరకం మామిడి చెట్లను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆగస్టు ఆఖరు నాటికి కొమ్మల కత్తిరింపులు పూర్తి చేసి ఎరువులు, నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. తద్వారా రైతులు మంచి దిగుబడులు సాధించేందుకు అవకాశం ఉందన్నారు. ఆయన వెంట మండల ఉద్యానవనశాఖాధికారి మిథాలి, రైతులు ఉన్నారు.


మామిడి చెట్లను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన అధికారి సుబ్బారెడ్డి

విద్యుత్ వృథా అవుతున్నా పట్టదా...?

ఉదయగిరి రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యవైఖరి కారణంగా గ్రామాల్లో రాత్రీపగలు నిరంతరాయంగా వీధి దీపాలు వెలుగుతున్నాయి.దీంతో విద్యుత్ వృథా అవుతుంది. విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని ఉపన్యాసాలు చెప్పే అధికారులు క్షేత్ర స్థాయిలో ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇందుకు నిదర్శనమే సున్నంవారిచింతలలో పగలే వెలుగుతున్న వీధి దీపాలు. ప్రధాన రహదారితోపాటు గ్రామంలోనూ నిరంతరం ఈ పరిస్థితి కొనసాగుతున్నది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ వృథాను అరికట్టాలి.


సున్నంవారిచింతల గ్రామంలో పగలే వెలుగుతున్న వీధి దీపం


ఖాళీ స్థలంలో నిల్వ చేరిన మురుగు నీరు

మురికి కూపాలుగా ఖాళీ ప్రదేశాలు

ఉదయగిరి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలాజీనగర్‌లో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో నివాసాల్లో నుంచి వృథా నీరంతా ఖాళీ ప్రదేశాల్లో చేరి మురికి కూపాలుగా మారుతున్నాయి. రోజులు తరబడి నీరు అక్కడే నిల్వ చేరి ఉండడంతో దుర్వాసనతో పాటు దోమలకు ఉత్పత్తి కేంద్రాలుగా మారి వ్యాధులు ప్రబలుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. ప్రధానంగా హోలీఏంజెల్స్ పాఠశాల సమీపంలో మురుగు గుంత ప్రమాదకరంగా ఉంది. అలాగే పలు నివాసాలకు సమీపంలో ఉన్న ఖాళీ ప్రదేశాలు మురుగు కూపాలుగా మారాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చాలని పలువురు కోరుతున్నారు.

బీజేపీ జిల్లా కార్యదర్శిగా సుధాకర్



ఆత్మకూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి) : బీజేపీ జిల్లా కార్యదర్శిగా ఆత్మకూరుకు చెందిన సీనియర్ నాయకుడు కరటంపాటి సుధాకర్ నియమితులయ్యారు. ఆయన గతంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడుగా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి వంశీధర్‌రెడ్డికి, ఆత్మకూరు బీజేపీ నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ పార్టీ పటిష్టతకు మరింతగా కృషి చేయడంతో పాటు ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

ఎస్‌ఆర్ పురం ఎంపీడీవోగా సాయిప్రసాద్

సీతారామపురం, జూలై 22(ఆంధ్రజ్యోతి) :ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు మండల అభివృద్ధి అధికారి(ఎంపీడీవో)గా సాయి ప్రసాద్ నియమితులయ్యారు. మర్రిపాడు మండల డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. త్వరలో ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్యనందించాలి


విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్న ఎంఈవో

ఉదయగిరి, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విద్యార్థులకు క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యనందించాలని ఎంఈవో2-తోట శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని గంగిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా తరగతుల వారీగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. అనంతరం విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లు పరిశీలించి, మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వలంటీనా జ్యోతి, పలువురు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఏడీఏ బాధ్యతల స్వీకరణ


ఏడీఏకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మండల వ్యవసాయాధికారులు

ఉదయగిరి, జూలై 22(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్ సహాయ సంచాలకురాలిగా జీ.లక్ష్మీమాధవి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. జిల్లా వనరుల కేంద్రంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్‌గా పనిచేస్తున్న ఆమె ఉన్నతాధికారులు ఉదయగిరికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా సబ్ డివిజన్ పరిధిలోని వ్యవసాయ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం వ్యవసాయాధికారులు, ఏఈవోలు, సిబ్బంది ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు చెన్నారెడ్డి, సునీల్, కవిత, మదన్, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ సరుకులు సకాలంలో అందచేయాలి


మాట్లాడుతున్న తహసీల్దారు రామ్మోహన్

ఉదయగిరి, జూలై 22(ఆంధ్రజ్యోతి): చౌక దుకాణాల డీలర్లు కార్డుదారులకు సకాలంలో సరుకులు పంపిణీ చేయాలని తహసీల్దారు ఎల్.రామ్మోహన్ పేర్కొన్నారు. మంగళవారం తహసీల్దారు కార్యాలయంలో చౌక దుకాణాల డీలర్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చౌక దుకాణాల పరిధిలోని దివ్యాంగులు, వృద్ధులకు డీలర్లు ఇంటికెళ్లి సరుకులు అందజేయాలన్నారు. డీడీలు సకాలంలో చెల్లించి, ప్రతినెలా 1 నుంచి 15 వరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు దుకాణాలు తెరిచి ఉంచాలన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీటీ షాజియా, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

చర్చికి విరాళం

సీతారామపురం , జూలై 22 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ పరిధిలోని మరియపురంలో కొత్తగా నిర్మించిన చర్చికి మండల జనసేన నాయకుడు భోగినేని కాశీరత్తయ్య ఆధ్వర్యంలో మంగళవారం రూ.5వేలను విరాళంగా అందజేశారు. ఈకార్యక్రమంలో తోట నవీన్, కొత్త జగదీష్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా శ్రీనివాస్

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఇన్‌చార్జి ఎంపీడీవోగా జీ. గోపి శ్రీనివాస్‌ను నియమిస్తున్నట్లు మంగళవారం ఉన్నతాధికారుల నుంచి కార్యాలయానికి ఉత్తర్వులు అందాయి. గతంలో ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్న కార్యాలయ ఏవో వేణుగోపాల్‌రావు పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో వింజమూరు ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కాగా ప్రస్తుతం పూర్తి స్థాయి బాధ్యతలు అప్పగిస్తూ వింజమూరు మండల డిప్యూటీ ఎంపీడీవో గోపి శ్రీనివాస్‌ను నియమించారు.

ఉదయగిరిలో గంధోత్సవం ప్రారంభం

ఉదయగిరి, జూలై 22(ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో ఉన్న హజరత్ ఖ్వాజాషా సయ్యద్ అబ్దుల్ ఖాదర్ ఖాన్‌సాహెబ్ ఖాదరీ ఔలియా వారి 220వ గంధమహోత్సవం మంగళవారం వైభవంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా దర్గా కమిటీ నిర్వాహకులు, భక్తులు దర్గాలో భక్తిశ్రద్ధలతో సందల్‌మాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



మద్యం దుకాణంలో చోరీ


చోరీ జరిగిన మద్యం దుకాణం

రాపూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి) : రాపూరు పట్టణంలోని ఓ మద్యం దుకాణంలో దొంగలు పడ్డారు. ఐదు మద్యం కేసులు అపహరించుకెళ్లారు. మద్యం దుకాణం యజమాని ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని కోటూరుపాడుకు వెళ్లే మార్గంలో ఉన్న మద్యం దుకాణంలో పని చేసే వ్యక్తి సోమవారం రాత్రి యధావిధిగా దుకాణం మూసుకొని వెళ్లిపోయాడు. మంగళవారం ఉదయం దుకాణానికి వచ్చి చూసే సరికి దుకాణం తాళాలు పగులగొట్టి ఉన్నాయి. వెంటనే దుకాణం యజమానికి సమాచారం చేరవేయగా ఆయన షాపు వద్దకు చేరుకుని పరిశీలించారు. సుమారు రూ.45వేల విలువ గల ఐదు మద్యం కేసులు, కొంత నగదు అపహరించుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

అక్రమంగా జామాయిల్ చెట్ల నరికివేత


జామాయిల్ కర్రను తరలిస్తున్న లారీని స్వాధీనం చేసుకున్న రెవెన్యూ అధికారులు

దుత్తలూరు(ఉదయగిరి), జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తురకపల్లిలో అక్రమంగా ప్రభుత్వ భూమిలో సాగు చేసిన జామాయిల్ చెట్లను నరికి లారీలో తరలించేందుకు యత్నించగా, మంగళవారం అధికారులు పట్టుకున్నారు. వివరాల మేరకు.. గ్రామంలోని సర్వేనెంబర్ 367లో 4.57 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. గ్రామానికి చెందిన వల్లెం మల్లారెడ్డి గత కొన్నేళ్లు ఆ సర్వేనెంబర్‌లో 2.50 ఎకరాలను సాగు చేసుకుంటున్నాడు. ఇటీవల రెవెన్యూ అధికారులు అది ప్రభుత్వ భూమిగా హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. అయితే అదే గ్రామానికి చెందిన భోగిరెడ్డి ఓబులరెడ్డి ప్రభుత్వ భూమిలోగల జామాయిల్ చెట్లను అక్రమంగా నరికి లారీలో లోడ్ చేయిస్తున్నాడు. ఈ విషయమై తహసీల్దారు నాగరాజుకు గ్రామస్థులు సమాచారం అందించారు. దీంతో ఆయన రెవెన్యూ అధికారులను అక్కడికి పంపారు. వారు లారీ స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం అక్రమంగా జామాయిల్ చెట్లను నరికిన వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేసి, కేసు నమోదు చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


పొంగులూరు శ్రీహరి (ఫైల్)

అల్లూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందిన ఘటన అల్లూరు పట్టణ శివారులోని వ్యవసాయ గోదాముల సమీపంలో రాజుపాలెం-ఇస్కపల్లి రోడ్డులో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు. మండలంలోని పురిణి పంచాయతీ మందిరం గ్రామానికి చెందిన పొంగులూరు శ్రీహరి(28) నార్తుమోపూరు వైపు నుంచి అల్లూరుకు మోటారుసైకిల్‌పై వస్తూ అదే సమయంలో నార్తుమోపూరుకు చెందిన దంపతులు గోదాముల్లో వాకింగ్ చేసుకొని మోటారుసైకిల్‌పై రోడ్డుపైకి వచ్చిన వారిని ఢీకొని అదే స్పీడుతో ఎదురుగా వస్తున్న మరొక మోటారుసైకిల్‌ను ఢీకొన్నాడు. ఈ ఘటనలో శ్రీహరి చొక్కా ఆ వాహనానికి ఇరుక్కోవడంతో శ్రీహరి కిందపడడంతో శ్రీహరిని కొంత దూరం ఈడ్చుకెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. అయితే ఆ వాహనదారుడు అక్కడి నుంచి తప్పించుకుని వెళ్లిపోగా శ్రీహరికి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా అప్పటికే శ్రీహరి మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ శ్రీనివాసులురెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఏకైక కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులతోపాటు మృతుని కుటుంబ సభ్యులు గుండెలవిసేలలా రోదించారు. వివాహం చేయాలని సంబంధాలు చూస్తున్న తరుణంలో కుమారుడిని కోల్పోవడం ఆ తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోయారు.

కుటుంబ సభ్యులే మోసం చేశారని ఫిర్యాదు

నెల్లూరు(క్రైం), జూలై 22(ఆంధ్రజ్యోతి) : కుటుంబ సభ్యులే తనను నమ్మించి మోసం చేశారని ఓ మహిళ వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... పొదలకూరురోడ్డు నేతాజీ నగర్‌లో పందిపాటి శ్రీవాణి నివసిస్తున్నారు. 2009లో ఆమెకు నడ్డ జనార్దన్‌తో వివాహమైంది. ఆయనకు 2014లో అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వచ్చింది. 2015లో శ్రీవాణికి కూడా సాఫ్ట్‌వేర్ ఉద్యోగం రావడంతో అమెరికాకు వెళ్లింది. ఈ క్రమంలో ఆమె అమ్మ మంజులమ్మ, చెల్లెలు సుధా రాణి, చెల్లెలి భర్త రామరాఘవరెడ్డి శ్రీవాణితో నమ్మకంగా ప్రవర్తించారు. సంపాదనను వారికి ఇస్తే జాగ్రత్తగా దాచుతామని చెప్పడంతో తన భర్తకు తెలియకుండా కుటుంబ సభ్యులకు రూ.2 కోట్ల నగదు పంపింది. గతేడాది శ్రీవాణి తండ్రి అనారోగ్యంతో మరణించడంతో ఆమె నెల్లూరుకు వచ్చారు. మరణానంతర కార్యక్రమాలు పూర్తయిన తర్వాత తాను పంపిన రూ.2 కోట్ల నగదు గురించి కుటుంబ సభ్యులవద్ద ప్రస్తావించింది. తండ్రే నగదు లావాదేవీలు చూస్తుండే వాడని, తమకు సంబంధం లేదని బుకాయించారు. ఇదెక్కడి న్యాయం అని ప్రశ్నించగా మరోసారి డబ్బులు అడిగితే నీ సంగతి తేలుస్తామని బెదిరించారు. అప్పటి నుంచి బంధువుల ద్వారా చర్చలు జరిపినా ఫలితం లేకపోవడంతో మంగళవారం వేదాయపాళెం పోలీసులకు శ్రీవాణి ఫిర్యాదు చేసింది.

గుర్తుతెలియని వృద్ధుడి ఆత్మహత్య

నెల్లూరు(క్రైం), జూలై 22(ఆంధ్రజ్యోతి) : నెల్లూరులో సోమవారం రాత్రి రైలుకిందపడి గుర్తుతెలియని వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు సమాచారం మేరకు... 65 నుంచి 70 సంవత్సరాల మధ్య వయసు వృద్ధుడు మరణించాడు. మృతదేహంపై పసుపు రంగు ఫుల్‌హ్యాండ్స్ షర్ట్, అదేరంగు పంచె, కాషాయ రంగు టవల్ ఉన్నాయి. రైల్వే ఎస్‌ఐ హరిచందన మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్లకు గాలి తీయొద్దన్నందుకు దాడి

నెల్లూరు(క్రైం),(ఆంధ్రజ్యోతి) : ట్రాక్టర్లలో గాలిని తీస్తుంటే ప్రశ్నించినందుకు ఓ వ్యక్తిని బూతులు తిట్టి, దాడి చేసిన ఘటనపై చిన్న బజారు పోలీసులు పలువురిపై కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నేతాజీనగర్‌కు చెందిన కయ్యాల గోపి ట్రాక్టర్ ట్రాన్స్‌పోర్ట్ విభాగంలో పనిచేస్తున్నాడు. ఆయన ప్రతీ రోజు రెండు ట్రాక్టర్లను మునిసిపల్ వెహికల్ షెడ్‌లో పెడుతుంటారు. ప్రస్తుతం మున్సిపల్ వర్కర్ల ధర్నా జరుగుతుండటంతో ఆయన సోమవారం రాత్రి ట్రాక్టర్లను పుట్టా ఎస్టేట్‌లో పెట్టారు. మంగళవారం ఉదయం కార్మిక నాయకుడు కత్తి శ్రీనివాసులు మరికొందరు కలిసి ట్రాక్టర్లకు గాలి తీస్తుండటంతో గోపి అడ్డుపడి ప్రశ్నించాడు. దీంతో వారందరూ కలిసి గోపిపై దాడి చేసి బూతులు తిడుతూ టైర్లకు గాలి తీసేశారు. దీంతో బాధితుడు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు పలువురిపై కేసు నమోదు చేశారు.కాగా గోపి తనను కులం పేరుతో దూషించాడని మయూరి అనే మహిళ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేశారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	134
స్కిన్ చికెన్	240
స్కిన్‌లెస్	264

కోడిగుడ్ల ధర (100): 520

పక్కా గృహాల డబ్బులు ఇవ్వడం లేదు సారూ...

బిట్రగుంట, జూలై 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మంజూరు చేసిన పక్కా గృహాల నిర్మాణానికి బ్యాంకర్లు డబ్బులు ఇవ్వడం లేదు సారూ.. అంటూ యానాదులు ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి విన్నవించుకున్నారు. బోగోలు మండలం ఎస్సీపాలెం పంచాయతీ వెంకటేశ్వరపురం గిరిజన కాలనీకి చెందిన యానాదులు మంగళవారం కావలి ఎమ్మెల్యేని కలిసి తమ ఆవేదనను తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారుల వద్దకు తీసుకుపొమ్మని స్థానిక టీడీపీ నేతలు ఆదిశేషయ్య, తిరుపతిలతో చెప్పారు. ఈ విషయమై బాధితులు మాటాడుతూ పక్కాగృహాల నిర్మాణానికి విడుదలైన నగదు పొదుపు రుణం కింద పట్టుకున్నారని తెలిపారు. అయితే తాము పొదుపు రుణాల నుంచి ఎలాంటి డబ్బులు తీసుకోలేదని తెలిపారు. అయినా తమను ఇబ్బందులు పెడుతున్నారని వాపోయారు.

న్యూస్ బాక్స్

భక్తిశ్రద్ధలతో అంకమ్మకు పొంగళ్లు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కావలి రూరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రకోటలో అంకమ్మ తిరునాళ్లలో భాగంగా మంగళవారం మహిళలు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భగా ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పచ్చతోరణాలతో ముస్తాబు చేశారు. అమ్మవారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకుంది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కాగా ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకటకృష్ణారెడ్డి గ్రామస్థుల ఆహ్వానం మేరకు అమ్మవారిని దర్శించుకున్నారు. పలువురి ఇళ్లకు వెళ్లిన వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు.

డ్రగ్స్ రహిత సమాజానికి యువత సహకరించాలి

అల్లూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి) : డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు యువత సహకరించాలని ఎస్ఐ పీ.శ్రీనివాసులురెడ్డి అన్నారు. మండలంలోని నార్తుమోపూరులోని శ్రీచైతన్య విద్యాసంస్థల్లో విద్యార్థులకు డ్రగ్స్ వినియోగంతో ఏర్పడే దుష్ఫలితాలు, చట్టపరమైన చర్యలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అంశాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, విద్యాసంస్థల కరస్పాండెంట్ శివకుమార్, డైరెక్టర్ ఖాజారంతుల్లా, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలకు పంట నమోదు ప్రామాణికం

వలేటివారిపాలెం, జూలై 22(ఆంధ్రజ్యోతి) : ఈ క్రాప్ నమోదు చేసుకున్న రైతులకే ప్రభుత్వ రాయితీ పథకాలు అందుతాయని ఏవో శేషారెడ్డి తెలిపారు. మండలంలోని పోలినేనిపాలెం, వలేటివారిపాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పంటలు సాగుకు ముందు విత్తనశుద్ధి చేసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. పంట మార్పిడితో భూములు సారవంతం అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జీఆర్పీ ఎస్ఐ వెంకట్రావు బాధ్యతల స్వీకరణ



కావలి రూరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): కావలి జీఆర్పీ ఎస్ఐగా కె.వెంకట్రావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఒంగోలులో పనిచేస్తున్న ఆయన బదిలీపై కావలి రాగా కావలి జీఆర్పీ ఎస్ఐగా పనిచేసిన రమాదేవి గుంటూరు రేంజ్‌కు బదిలీపై వెళ్లారు.

అన్నదాత సుఖీభవ నమోదుకు నేటితో ఆఖరు

వలేటివారిపాలెం, జూలై 22(ఆంధ్రజ్యోతి) : అన్నదాత సుఖీభవ పథకంలో అర్హులైన రైతులు తమ పేర్లు నమోదుకు బుధవారంతో గడువు ముగుస్తోంది. ఇప్పటి వరకు మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో 6,261 మంది రైతులను అధికారులు గుర్తించారు. ఈ మేరకు సచివాలయాల వారీగా రైతుల జాబితాను అధికారులు రూపొందించారు. అయితే గత వైసీపీలో జరిగిన రీసర్వేలో తప్పులు జరగడంతో చాలా మంది అర్హులు పేర్లు ఈ జాబితాలో కనిపించలేదు. దీంతో కొంతమేర ఆందోళన నెలకొంది. అలాంటి వారు ఎవరైనా ఉంటే ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని అధికారులు అంటున్నారు.

4వ సెమిస్టర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

కందుకూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఆంధ్రకేసరి యూనివర్సిటీ మంగళవారం ప్రకటించిన నాల్గవ సెమిస్టర్ పరీక్ష ఫలితాలలో శ్రీగాయత్రీ డిగ్రీ కళాశాల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారని కళాశాల కరస్పాండెంట్ సీహెచ్ రామకృష్ణారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినీ విద్యార్థులను కళాశాల డైరెక్టర్ సీహెచ్ భరద్వాజ, ప్రిన్సిపాల్ పీగీతా శ్రీనివాస్‌లు అభినందించారు.

పిల్లర్ల దశ దాటని చెత్తతో సంపద కేంద్రం

వలేటివారిపాలెం, జూలై 22(ఆంధ్రజ్యోతి) : మండలంలోని అయ్యవారిపల్లెలో చెత్తతో సంపద కేంద్రం పిల్లర్ల దశలోనే నిలిచిపోయింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.8లక్షలతో పనులు కాంట్రాక్టర్ పిల్లర్ల దశ వరకు పనులు చేపట్టారు. అంతలోనే సాధారణ ఎన్నికలు రావడం, వైసీపీ ప్రభుత్వం ఓడిపోయి కూటమి ప్రభుత్వ అధికారంలోకి రావడంతో కాంట్రాక్టర్ నిర్మాణ పనులు అసంపూర్తిగానే నిలిపేశారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో గ్రామంలోని వీధుల్లో చెత్త పేరుకపోయి అంటువ్యాధులు ప్రబలుతున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అర్ధాంతరంగా నిలిచిపోయిన చెత్తతో సంపద కేంద్రం పనులను పునఃప్రారంభించి త్వరితగతిన పనులు పూర్తిచేయాలని కోరుతున్నారు. వీధుల్లో చెత్తను సంపద కేంద్రానికి తరలించి ఎరువులు తయారీ చేసి, ఆ ఎరువులను రైతులకు తక్కువ ధరకు విక్రయించి వచ్చిన ఆదాయంలో పంచాయతీని అభివృద్ధి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



అయ్యవారిపల్లెలో పిల్లర్ల దశలోనే నిలిచిపోయిన చెత్తతో సంపద కేంద్రం

సాగు, తాగునీటికి సోమశిల జలాలు రప్పిస్తా

● ఎమ్మెల్యే కాకర్ల సురేష్



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

కలిగిరి, జూలై 22(ఆంధ్రజ్యోతి): సాగు, తా గునీటికి సోమశిల జలాలు తీసుకొచ్చి ప్రజలు, రైతుల కష్టాలు తీరుస్తానని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ హామీ ఇచ్చారు. మంగళవారం మంగళవారం మండలంలోని నాగసముద్రం పంచాయతీ అంబటివారిపాలెంలో జరిగిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అమలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. ఈ సందరగా రైతులు, మహిళలు తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. నాగసముద్రం పంచాయతీ సమీపంలో ఉన్న సోమశిల ఉత్తరకాలువ నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందిస్తే ఐదుగ్రామాల భూములకు ఉపయోగకరంగా ఉంటుందని రైతులు కోరారు. తాగునీటికోసం పక్క గ్రామానికి వెళ్లి మినరల్‌వాటర్ కొనుగోలు చేసి తాగాల్సి వస్తుందని మహిళలు తెలిపారు. స్పందించిన ఆయన ఈ ప్రాంతవాసులకు సోమశిల జలాలు తెస్తానని అభయమిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం వెంకట కృష్ణారెడ్డి, మాజీ కన్వీనర్ చీమల తాతయ్య, నాయకులు యర్రగుంట రమణారెడ్డి, బాపతి చినమాలకొండయ్య, యర్రగుంట రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'సుపరిపాలనలో తొలిఅడుగు'తో సత్ఫలితాలు

● 4వ క్లస్టర్‌లో సంబరాలు ● కేక్ కట్ చేసిన ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలి, జూలై 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సుపరిపాలనలో తొలి అడుగుతో నియోజకవర్గంలో సత్ఫలితాలు వస్తున్నాయని ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. పట్టణంలోని 4వ క్లస్టర్‌లో డోర్‌టూడోర్ కార్యక్రమం సోమవారంతో దిగ్విజయంగా పూర్తి అయిన సందర్భంగా ఆ క్లస్టర్ బాధ్యులు మంగళవారం సంబరాలు జరుపుకున్నారు. టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యేతో కేక్ కట్‌చేపించారు. అనుకున్న సమయానికన్నా ముందుగానే కార్యక్రమం పూర్తి చేసినందుకు ఆ క్లస్టర్ బాధ్యులకు ఊహించని గిఫ్ట్‌తో కూడిన ఒక కవర్ ఇచ్చి ఆ సొమ్ముతో క్లస్టర్‌లో కష్టపడ్డ వారంతా ఎంజాయ్ చేసుకోమని ఎమ్మెల్యే చెప్పారు. తీరా ఆకవర్ తెరచి చూస్తే దానిలో రూ.50 వేల ఉండటంతో కష్టేఫలి అన్నట్లుగా కష్టపడ్డ వారికి ఎప్పటికైనా గుర్తింపు ఉంటుందని ఆనందపడ్డారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏడాదికి రెండు పర్యాయాలు పార్టీ ఏదో ఒక కార్యక్రమం బాధ్యత అప్పచెపుతోందని దానిని మనం సిన్సియర్‌గా చేసి గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. అధిష్ఠానం పార్టీ నేతల కదలికలను నిత్యం గమనిస్తూ సూచనలిస్తుంటుందని, పార్టీ అప్పచెప్పిన కార్యక్రమాలను అందరం సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుత్తికొండ కిషోర్ బాబు, జ్యోతి బాబూరావు, 4వ క్లస్టర్ ఇన్‌చార్జి కండ్లగుంట మధుబాబు నాయుడు, కో ఇన్‌చార్జి షేక్ హజరత్, నేతలు అన్నదాత మణి, యేగూరి చంద్రశేఖర్, శానం హరి, గంగినేని వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

బలవంతపు భూసేకరణ విరమించుకోవాలి

● రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి ● కరేడులో సేకరించనున్న భూముల పరిశీలన



మాట్లాడుతున్న రైతు సంఘం నేత ప్రభాకర్‌రెడ్డి

ఉలవపాడు, జూలై 22(ఆంధ్రజ్యోతి) : కరేడులో బలవంతపు భూముల సేకరణను ప్రభుత్వం మానుకోవాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ప్రభాకర్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఏపీ రైతు సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు, సీపీఎం నాయకులు కరేడులోని భూసేకరణ ప్రాంతాల్లో పర్యటించారు. అనంతరం ఉలవపాడులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో జరిగిన విలేకరుల సమావేశంలో ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ నాడు వైసీపీ, నేడు టీడీపీ రెండు ప్రభుత్వాలు కార్పొరేట్ కంపెనీల అభివృద్ధి కోసమే రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కుంటున్నాయన్నారు. గతంలో చేవూరు, రావూరు మాదిరిగానే ఇప్పుడు కరేడు భూముల వంతు అయిందన్నారు. కరేడు ప్రజలు చేస్తున్న పోరాటంలో అపూర్వమైన ఐక్యత ఉందని, ఐక్యతను చెడగొట్టేందుకు ప్రయత్నించకుండా మీకు చేతనైన సహాయం రైతులకు, రైతుకూలీలకు చేయాలన్నారు. రైతుల పోరాటానికి రాష్ట్ర రైతు సంఘం సంపూర్ణ మద్దతు ఇస్తుందని పేర్కొన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం పబ్లిక్ హియరింగ్ జరపకుండా ప్రభుత్వం భూసేకరణ చేపట్టడానికే ముందుకెళుతుందన్నారు. దీనిపై రైతులు, బాధితులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మూలే వెంగయ్య, సీపీఎం నాయకులు మూలం రమేష్, జీ వెంకటేశ్వర్లు, జీవీబీ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పీ-4లో భాగస్వాములు కావాలి



ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన పీ-4 సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఆదినారాయణరావు

కొండాపురం, జూలై 22(ఆంధ్రజ్యోతి): సమాజంలో పేదరికాన్ని నిర్మూలించేందుకు ప్రభుత్వం రూపొందించిన పీ-4 కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని ఎంపీడీవో ఆదినారాయణరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంపై మండలస్థాయిలోని అన్ని శాఖల అధికారులు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, వీవోఏలకు అవగాహన సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 8,500 కుటుంబాలుండగా అందులో 20 శాతం 1700 బంగారు కుటుంబాలను గుర్తించాలని ప్రభుత్వం నిర్దేశించగా ఇప్పటి వరకు 1100 కుటుంబాలను గుర్తించామన్నారు. ఎంపిక చేసిన బంగారు కుటుంబాలలో ఒక్కొక్కరు కనీసం 10 కుటుంబాలకు మార్గదర్శకులుగా ఉండాలన్నారు. కాగా మండలానికి నూతనంగా వచ్చిన డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ పీ-4 కార్యక్రమంలో భాగంగా మండలపరిధిలో ఎంపికచేసిన బంగారుకుటుంబంలో ఒక విద్యార్థి విద్యాభ్యాసానికి అయ్యే ఖర్చులు భరిస్తానని చెప్పడం గమనార్హం. అలాగే పదవ తరగతి తర్వాత విద్యాభ్యాసం కొనసాగకుండా ఆపివేసిన విద్యార్థులను గుర్తించి ఓపెన్ పాఠశాలల్లో చేర్పించాలని మండల విద్యాశాఖాధికారులు రవికుమార్, ఆనందరావులు కోరారు. ఈకార్యక్రమంలో ఏపీఎం కాంతారావు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వెలుగు వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్ బషీర్‌కు సత్కారం

కావలి, జూలై 22(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ప్లాస్టిక్ భూతం వేషధారణతో ప్రజలకు అవగాహన కల్పించడం, ప్లాస్టిక్ భూతం వేషధారణపై ఈనెల 19న తిరుపతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి చేతుల మీదుగా అవార్డు అందుకున్న మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎండీ బషీర్‌ను మంగళవారం మున్సిపల్ అధికారులు సత్కరించారు. ముందుగా ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డిని ఆయన కార్యాయంలో కలవడంతో ఎమ్మెల్యే ఆయనను అభినందించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బందిని బషీర్‌కు శాలువ కప్పి సత్కరించి అభినందించారు. అలాగే స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్రలో కావలి మున్సిపాలిటీకి 12వ స్థానం రావడంతో మున్సిపల్ కమిషనర్ జీ శ్రావణ్‌కుమార్‌ను కూడా మున్సిపల్ ఉద్యోగులు సత్కరించా రు. ఈ కార్యక్రమంలో మేనేజరు ఫణీంద్ర, డీఈ సాయిరాం, టీపీవో వివేకానంద్, తదితరులు పాల్గొన్నారు.



శానిటరీ ఇన్‌స్పెక్టర్ బషీర్‌ను సత్కరిస్తున్న మున్సిపల్ అధికారులు, సిబ్బంది

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య



● జీ.సురేష్, ఎంఈవో, కలిగిరి

ఈ ఇంటర్వ్యూ

కలిగిరి, జూలై 22(ఆంధ్రజ్యోతి): కక ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా చర్యలు తీసుకొంటున్నాం. దీంతోపాటు, ఉచిత పాఠ్య, నోటు పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజన సౌకర్యాలు కల్పిస్తూ వారి విద్యాభివృద్ధికి ప్రభుత్వం తోడ్పడునందిస్తోంది. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తి సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందని కలిగిరి ఎంఈవో జీసురేష్ తెలిపారు.

? మండలంలో ఎన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి

! మండలంలో 69 ప్రభుత్వ, 10 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి.

? ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పూర్తస్థాయిలో యూనిఫాం, పుస్తకాలు అందాయా.

! ప్రభుత్వ పాఠశాలల్లో 95 శాతం మంది విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం అందజేశాం.

? విద్యార్థులందరికీ తల్లికి వందనం అందిందా.

! తల్లికి వందనం 85 శాతం మేర విద్యార్థులకు జమ అయింది. 10 శాతం అధికంగా పొలాలు, ఉద్యోగులు, ఐటీ రిటర్న్స్ ఉన్నవారు, 5శాతం అర్హులైనప్పటికీ వారి ఆధార్ నెంబరు బ్యాంకు ఖాతాకు, మొబైల్ నెంబర్లు లింక్ కాని కారణాలతో జమ కాలేదు.

? మధ్యాహ్న భోజనం అమలు ఎలా జరుగుతుంది.

! మండలంలో మొత్తం 4,780 మంది విద్యార్థులకు సన్నబియ్యంతో మధ్యాహ్న భోజన పథకం ద్వారా ఆహారం అందుతుంది.

? పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు తీసుకుంటున్న చర్యలు ఏమిటి.

! మండలంలో 35 పాఠశాలలకు మౌలిక వసతులు, ప్రహరీ నిర్మాణాలకు తీర్మానాలు పంపి ఉన్నాం. నిధులు మంజూరు కాగానే పనులు చేపడుతాం.

మున్సిపల్ కార్మికుల సమ్మె తాత్కాలిక విరమణ



కామ్రేడ్ వీఎస్ అచ్యుతానందన్ మృతికి సంతాపం తెలుపుతున్న కార్మికులు

కావలి(టౌన్), జూలై 22(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా గత ఆరు రోజుల నుంచి మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మెకు మంగళవారం తాత్కాలిక విరమణ పలికారు. రాష్ట్ర ప్రభుత్వం సమ్మె పట్ల సానుకూలంగా స్పందించి కొన్ని డిమాండ్లకు పరిష్కారం చూపడం, మరికొన్ని డిమాండ్లపై నెలాఖరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో చర్చించి పరిష్కరిస్తామని సంబంధిత మంత్రులు రాష్ట్ర సీఐటీయూ, సీపీఎం నేతలకు హామీ ఇవ్వడంతో రాష్ట్రవ్యాప్తంగా సమ్మెను తాత్కాలికంగా విరమించినట్లు సీఐటీయు పట్టణ కార్యదర్శి వై కృష్ణమోహన్ తెలిపారు. కాగా కామ్రేడ్ అచ్యుతానందన్ మృతికి సమ్మె శిబిరంలో కార్మికులు, సీఐటీయూ నేతలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. సీపీఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ అచ్యుతానందన్ 17 ఏళ్ల వయస్సులోనే ప్రజా కార్మిక ఉద్యమాల పట్ల ఆకర్షితులై జీవించివున్న 102 ఏళ్ల వరకు ప్రజల పక్షాన ఉద్యమ కెరటమై పోరాడారన్నారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు కృష్ణయ్య, మధుసూదన్‌రావు, పోలయ్య, షాన్వాజ్, యూనియన్ నేతలు శీనయ్య, రమేష్, మహేష్, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

బదిలీ అయిన సచివాలయ ఉద్యోగులకు సన్మానం



సచివాలయ ఉద్యోగులను సన్మానిస్తున్న సహచరులు

బిట్రగుంట, జూలై 22(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కోవూరుపల్లి గ్రామ చివాలయంలో పని చేసి బదిలీ అయిన ఉద్యోగలును మంగళవారం గ్రామస్థులు శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. సన్మానం పొందిన వారిలో మహిళా పోలీస్ కే.మౌనిక, అగ్రికల్చర్ అసిస్టెంట్ పీ.సుధీర్, ఏఎన్ఎం డి.అనిత, సహాయక సర్వేర్ కే.సురేష్‌లు ఉన్నారు. స్థానిక టీడీపీ నేత ఐ.రాంమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజగోపాల్, డిజిటల్ అసిస్టెంట్ శ్యాంసుధాకర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ టీ.భారతి, కృపామై తదితరులు పాల్గొన్నారు.

పందలపాడులో 'సుపరిపాలనలో తొలిఅడుగు'

కందుకూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని మంగళవారం మండలంలోని పందలపాడులో నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నెల్లూరు పార్లమెంటు అధికారప్రతినిధి గోచిపాతల మోషే, టీడీపీ గ్రామ అధ్యక్షుడు కూనం లక్ష్మీనారాయణరెడ్డి, నాయకులు కంజుల రామచంద్రారెడ్డి, వర్ల జోసెఫ్‌కిషోర్, గౌడపేరు నరసింహారావు, వర్ల యాకోబు, ఇస్సాకు, కందుకూరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

● **లింగసముద్రం** : మండలంలోని పెదపవనిలో మంగళవారం టీడీపీ నాయకులు సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధిని కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు గొర్రెపాటి సాంబయ్య, మాజీ సర్పంచు సయ్యద్ నాయబ్‌రసూల్, నాయకులు ఎస్డీ రఫీ, కొండయ్య, పఠాన్ హిదయతుల్లా, ఖాదర్‌బాషా, టంకం హజరత్తయ్య పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు పొంగళ్లు



గ్రామ దేవతలకు చీర,సారె తీసుకెళుతున్న మహిళలు

ఉలవపాడు, జూలై 22(ఆంధ్రజ్యోతి): గ్రామం పచ్చని పంటపొలాలు, పశుపక్షాదులతో చల్లగా ఉండాలని, గ్రామస్థులు సత్సంబంధాలు కలిగి అన్యోన్యంగా ఉండాలనే తలంపుతో మంగళవారం కరేడు ఆడపడుచులు గ్రామదేవతలకు పొంగళ్లు పెట్టుకొని చీర సారెలను సమర్పించారు. గ్రామంలోని ఓరుగంటరెడ్లు కులదేవత ఓరుగంటమ్మకు పొంగళ్లు నిర్వహించి నైవేద్యం, పసుపుకుంకుమ్మ, చీర, జాకెట్టు, గాజులు సమర్పించారు. అనంతరం తప్పెట్లు, మేళతాళాలతో ఆడపడుచులు గ్రామంలోని 11 మంది గ్రామదేవతలకు నైవేద్యం, సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

భూసేకరణ ప్రక్రియకు అడుగులు

(5వ పేజీ తరువాయి)


ఈ పనిలో ఉన్న ఇండోసోల్ సిబ్బంది వ్యూహాత్మకంగా ఇప్పటికే 600 ఎకరాల వరకు రైతుల సమ్మతి పత్రాలు పొందగలిగామని మీడియాకు లీకుల సమాచారం ఇస్తుండటం విశేషం. కలెక్టరేట్‌లోను కొందరు సిబ్బంది పనిలో పనిగా వెయ్యి ఎకరాల వరకు రైతుల సమ్మతి వచ్చినందున త్వరలోనే భూసేకరణ ప్రక్రియలో మలిదశ చర్య లు ప్రారంభిస్తామని, అంగీకారం తెలిపిన రైతుల ఖాతాలకు సొమ్ము జమచేయటం ద్వారా మరికొందరు రైతులు ముందుకొచ్చేలా చూస్తామని చెబుతున్నట్లు సమాచారం.

● **పునరావాస కాలనీల కోసం...**

ఇండోసోల్ పరిశ్రమ ఏర్పాటు కోసం కరేడులో భూములు సేకరించటంతోపాటు జాతీయ రహదారికి సమీపంలో ఉన్న రామకృష్ణాపురం, ఉప్పరపాలెం, పొట్టేనిగుంట సంఘాలను ఖాళీ చేయించాలని నిర్ణయించిన విష యం తెలిసిందే. అయితే ఆ కాలనీల ప్రజలు విముఖత చూపుతుండటంతో సోమవారం కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు రామకృష్ణాపురం, ఉప్పరపాలెం గ్రామాలలో ప్రజలతో సమావేశాలు ఏర్పాటుచేసి మెరుగైన సౌకర్యాలతో పునరావాసం కల్పిస్తామని నామాట నమ్మి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అయితే, గ్రామస్థులమంతా సమావేశమై అందరి అభిప్రాయాలతో నిర్ణయం తీసుకున్నాక మీకు చెబుతామని బదులిచ్చారు. మరోవైపు ఖాళీచేయాల్సిన మూడు గ్రామాలకు పునరావాస కాలనీల కోసం అనువైన స్థలాన్ని సేకరించేందుకు అధికార యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. జాతీయ రహదారి పక్కనే పునరావాస కాలనీలు ఏర్పాటుచేస్తే వారు అంగీకరిస్తారన్న ఆలోచనతో అనువైన స్థలం కోసం అన్వేషిస్తున్నారు. అందులో భాగంగా మూడురోజుల క్రితం వేరువెంకటేశ్వరస్వామి ఆలయానికి, మన్నేరుకు మధ్యలో జాతీయ రహదారికి పడమరవైపు ఉన్న భూములను మూడురోజులక్రితం కందుకూరు సబ్ కలెక్టరు తిరుమాణి శ్రీపూజ పరిశీలించారు. ఆ భూముల యజమానులతో సంప్రదింపులు జరుపుతూనే ఇతర ప్రాంతాలలో కూడా భూములను పరిశీలన చేస్తున్నారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5

తిరుపతి
జిల్లా వార్తలు
బుధవారం 23 జూలై 2025



వాడిన మాల తొలగించారు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

తిరుమల మొదటి ఘాట్, అలిపిరి నడకమార్గంలోని ప్రసన్న ఆంజనేయస్వామికి ఉన్న వాడిన మాలను తొలగించారు. హనుమజ్జయంతి సందర్భంగా మే నెలలో ఆంజనేయస్వామికి వేసిన ఆకు, పూలమాలలు వాడిపోయినా తొలగించలేదు. దీనిపై 'మాల వాడిపోయింది గోవిందా' శీర్షికన ఆంధ్రజ్యోతిలో మంగళవారం ప్రచురితమైన వార్తకు ఉన్నతాధికారులు వెంటనే స్పందించారు. వీరి ఆదేశాలతో వాడిపోయిన మాలలను తొలగించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



జగన్ పీ4 ఏంటంటే..

చంద్రబాబు తీసుకొచ్చే పీ4 అంటే పబ్లిక్, ప్రైవేట్ పీపుల్, పార్టనర్‌షిప్. పేదరిక నిర్మూలనకు ఉద్దేశించిన ఈ కార్యక్రమం కోసం సీఎం శ్రమిస్తున్నారు. అదే జగన్ పీ4 అంటే.. ప్రాఫిట్, ప్యాలెస్, పులివెందుల, పర్సనల్ ఎజెండా. దీనికోసమే సీఎంగా ఐదేళ్లపాటు ఆయన పనిచేశారు.

- మంత్రి అనగాని సత్యప్రసాద్

ఆచూకీ చెబితే రూ.5లక్షలు

తమిళనాడు రాష్ట్రం ఆరంబాకంలో బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడి ఆచూకీ తెలిపిన వారికి రూ.5లక్షలు నజరానా ఇస్తామని గుమ్మిడిపూడి డీఎస్పీ జయశ్రీ తెలిపారు. నిందితుడి గాలింపు చర్యల్లో భాగంగా సత్యవేడు, వరదయ్యపాళెం, తడ మండలాల్లో మంగళవారం డీఎస్పీ పర్యటించారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని గుర్తించామన్నారు. నాలుగు బృందాలు నిందితుడి కోసం గాలిస్తున్నట్లు ఆమె తెలిపారు.

- వరదయ్యపాళెం, ఆంధ్రజ్యోతి




లిక్కర్ స్కాం..

- అధిష్ఠానం ఆదేశాలతో మూడో రోజు నామమాత్రపు నిరసనలు
- పెద్దిరెడ్డిపై పార్టీలోనూ అసంతృప్తే కారణమా?

వైసీపీ నీరసం

మిథున్‌రెడ్డి అరెస్టుపై స్పందన అంతంతే!

రెండు రోజులు ప్రకటనలకే పరిమితమైన వైసీపీ నేతలు



చిత్తూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టుపై ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వైసీపీ స్పందన, ఆ పార్టీ జిల్లాలో ఎంత బలహీనంగా మిగిలిందో వెల్లడిస్తోంది. రాజకీయంగా ఉమ్మడి జిల్లాను శాసించిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుమారుడు, జగన్‌కి అత్యంత సన్నిహితుడైన ప్రస్తుత ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు పట్ల జనంలో వ్యతిరేకత లేకపోయినా, కనీసం పార్టీలో అయినా తగినంత స్పందన లేకపోవడం ఏమిటని.. వైసీపీ నేతలో ఆశ్చర్యపోతున్నారు. చాలా మంది నాయకులు మీడియా మీట్‌లూ, ప్రకటనలకే పరిమితం కావడం, అక్కడక్కడా చిన్నపాటి నిరసనలతో సరిపెట్టుకోవడం వారిని ఆందోళన పెడుతోంది. పెద్దిరెడ్డి రాజ్యంగా విలసిల్లిన పుంగనూరు నియోజకవర్గంలోనూ నీరసంగానే నిరసన సాగడం విశేషం.

మద్యం కుంభకోణం విషయంలో మిథున్‌రెడ్డిని శనివారం ఏడు గంటలపాటు విచారించిన సిట్, అదే రోజు రాత్రి అరెస్టు చేసింది. శని, ఆదివారాల్లో వైసీపీ నాయకులు జిల్లాలో ఎక్కడా నిరసనలు చేయలేదు. పత్రికా ప్రకటనల్ని మాత్రమే విడుదల చేశారు. సోమవారం వైసీపీ అధిష్ఠానం ఆదేశించడంతో, కొన్నిచోట్ల నామమాత్రంగా నిరసనలు చేశారు. చిత్తూరు, పుంగనూరు, పలమనేరు ప్రాంతాలతో పాటు మిథున్‌రెడ్డి సొంత ప్రాంతం సదుంలో సుమారు 100-150 మందితో నిరసనలు తెలిపారు. మిగిలిన ప్రాంతాల్లో కాసేపు రోడ్ల మీద ప్లకార్డులతో నిలబడి వెళ్లిపోయారు. ఈ తీరుపై వైసీపీలోనే కాదు ప్రజల్లోనూ తీవ్ర చర్చ నడుస్తోంది.

జనంలో సానుభూతి కరువు

జగన్ అధికారంలో ఉన్నప్పుడు మద్యం ధరలు విపరీతంగా ఉండడం, ఊరూ పేరూ లేని కొత్త బ్రాండ్లు మాత్రమే అమ్మడం, వాటి వల్ల తీవ్ర అనారోగ్యానికి గురవడం వంటి కారణాల వల్ల ప్రజల్లో వ్యతిరేకత బలంగా ఉందని భావిస్తున్నారు. దీనికి కారకులైన వారిపట్ల కనీస సానుభూతి కూడా ఇందువల్లే కరువైందని అంటున్నారు. పైగా వేల కోట్ల సొమ్ములు దోచుకున్న తీరు మీడియాలో కథనాలుగా వస్తుండంతో ఇంతకు తెగించారా అని ప్రజలు నోళ్లు వెళ్లబెడుతున్నారు. అందుకే అధికారంలో ఉన్న ఐదేళ్లూ ప్రతి పండక్కీ పబ్బానికీ వందల కోట్లు ఖర్చు పెట్టి బట్టలు, కానుకలూ, మిఠాయిలూ పంపినా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వంటివారి పట్ల కూడా చంద్రగిరి నియోజకవర్గంలో సైతం సానుభూతి లేదని జనంలో చర్చ నడుస్తోంది. జనంలో సానుభూతి లేకపోవడం వల్లే వైసీపీ నాయకులు కూడా వారి తరహా బలప్రదర్శనతో కూడిన నిరసనలకు ధైర్యం చేయలేకపోతున్నారని అంటున్నారు.

వైసీపీలోనూ వ్యతిరేకత

పెద్దిరెడ్డి కుటుంబంపై జిల్లా వైసీపీ శ్రేణుల్లోనూ తీవ్ర అసంతృప్తి ఉండడంతోనే అరెస్టుపై అనుకున్నంత స్పందన లేదని తెలుస్తోంది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ప్రతి నియోజకవర్గంలోనూ ఎమ్మెల్యేలకు వ్యతిరేక వర్గాలను ఏర్పాటు చేసి ప్రోత్సహించడం.. మైన్, వైన్, సాండ్, ల్యాండ్ వంటి అన్నింట్లోనూ ద్వితీయ శ్రేణి నాయకులకు అందకుండా తనే నడపడం.. వంటి కారణాలతో ఆ కుటుంబంపై జిల్లా వైసీపీ నాయకుల్లో వ్యతిరేకత ఉందనే విషయం ఇప్పుడు వెల్లడవుతోందని ఆ పార్టీ వర్గాల్లోనే చర్చ నడుస్తోంది.

ఇదీ పెద్దిరెడ్డి ఘనత

జిల్లాలో అనేక నియోజకవర్గాల్లో పెద్దిరెడ్డి చక్రం తిప్పిన తీరును గుర్తు చేసుకుంటున్నారు. 2019 ఎన్నికల సమయంలో పూతలపట్టు సిట్టింగ్ ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌ను కాదని ఎంఎస్‌బాబును తెరపైకి తెచ్చారు.2024లో మళ్లీ ఎంఎస్‌బాబును ఇబ్బంది పెట్టారు. సునీల్‌కుమార్ అప్పట్లో జగన్ ఇంటి ఎదుట రోజంతా నిలబడినా అపాయింట్‌మెంట్ ఇవ్వని వీడియో దళిత సంఘాల్లో ఆగ్రహాన్ని రగిల్చింది. 2024లో ఎంఎస్‌బాబుతో పాటు సత్యవేడు ఆదిమూలానికీ టికెట్ రాకుండా చేయడంతో ఇద్దరూ పెద్దిరెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. పెనుమూరుకు చెందిన మాజీ ఎంపీ జ్ఞానేందర్‌రెడ్డిని ప్రోత్సహించి డిప్యూటీ సీఎంగా ఉన్న నారాయణస్వామిని ఇబ్బంది పెట్టారనే ఆరోపణలున్నాయి. నగరిలో రోజాను ఇబ్బంది పెట్టేందుకు చక్రపాణిరెడ్డి, కేజే కుమార్ వంటివారిని ప్రోత్సహించారు. చిత్తూరులో అటు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసుల్ని, ఇటు విజయానందరెడ్డినీ ఎదగనీయకుండా పావులు కదిపేవారు. ఎన్నికల సమయంలో విజయానందరెడ్డితో బాగుంటూనే ఆయనకు టికెట్ రాకుండా తీవ్ర ప్రయత్నాలు చేశారని ఆరోపణలున్నాయి. జనసేనలోకి ఆరణి వెళ్లిపోయేలా చేశారు. ఈ ఇద్దర్ని కాకుండా మూడో వ్యక్తి కోసం ప్రయత్నించినట్లు సమాచారం. పలమనేరులో వెంకటేగౌడకు చెక్ పెట్టేందుకు బైరెడ్డిపల్లె కృష్ణమూర్తిని విపరీతంగా ప్రోత్సహించారనే ఆరోపణలున్నాయి. అధికారులు కూడా కృష్ణమూర్తికి ప్రాధాన్యతనిచ్చేవారు. కుప్పంలో ఎమ్మెల్సీ భరత్‌ను పక్కన పెట్టుకుంటూనే సెంథిల్‌కుమార్‌ను వ్యతిరేక వర్గంగా మార్చారు. మదనపల్లెలోనూ సిట్టింగ్ ఎమ్మెల్యే నవాజ్‌బాషాకు 2024లో టికెట్ రాకుండా చేశారు. అత్యంత సీనియర్ ఎమ్మెల్యే అయినటువంటి పీలేరు చింతల రామచంద్రారెడ్డికి టీటీడీ బోర్డు మెంబర్ పదవి రాకుండా చేసి తమ అనుచరుడు పోకల అశోక్‌కుమార్‌కు వచ్చేలా చేశారు. తిరుపతి,చంద్రగిరిల్లోనూ ఆయన చాపకింద నీరులా వ్యవహరించేవారని అంటారు. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి జగన్‌కు సన్నిహితంగా ఉండడం ఆయనకు మింగుడు పడేది కాదంటారు. చెవిరెడ్డి కూడా కొన్ని సందర్భాల్లో తన ప్రత్యర్థి పట్ల పెద్దిరెడ్డి ఎన్నడూ వ్యతిరేకంగా లేరని అనేవారు. తిరుపతి జిల్లాలో కూడా తనకు ప్రొటోకాల్ ఉండాలని తన నియోజకవర్గంలోని రొంపిచెర్ల,పులిచెర్ల మండలాలను తిరుపతిలో కలిపేందుకు పెద్దిరెడ్డి చేసిన ప్రయత్నాలను చెవిరెడ్డి అడ్డుకున్నారని అంటారు. తిరుపతిలోనే నివాసం ఉండే పెద్దిరెడ్డి తిరుపతి నగరంలోనూ, చుట్టుపక్కలా భూవ్యవహారాల్లో జోక్యం చేసుకునేవారు. సిటింగ్ ఎమ్మెల్యేకి ఇది ఇబ్బందిగా ఉన్నా జగన్‌తో వారికున్న పలుకుబడి వల్ల మౌనంగా భరించేవారని చెప్పుకుంటారు. మొత్తానికి ప్రతి నియోజకవర్గంలోనూ రాజకీయ పెత్తనం సాగించినందునే పెద్దిరెడ్డి కుమారుడు అరెస్టు పట్ల ఎక్కడా బలమైన నిరసనలు లేవని భావిస్తున్నారు.



బోర్డు సమావేశంలో పాల్గొన్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, సభ్యులు, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి

తిరుమలలోనూ

టీటీడీ పరిపాలనభవనం

- 142 మంది కాంట్రాక్ట్ డ్రైవర్ల క్రమబద్ధీకరణ
- బోర్డు నిర్ణయాలను వెల్లడించిన టీటీడీ చైర్మన్, ఈవో

తిరుమల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో కొత్తగా పరిపాలన భవనం నిర్మించాలని టీటీడీ నిర్ణయించింది. తిరుమలలో ప్రస్తుతం వివిధ ప్రాంతాల్లో ఉన్న వివిధ విభాగాలను ఒకే తావులోకి తీసుకురావడం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్టు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు మంగళవారం తెలిపారు. అలాగే ఏపీ హైకోర్టు తీర్పు మేరకు టీటీడీలో కాంట్రాక్ట్ డ్రైవర్లుగా పనిచేస్తున్న 142 మందిని క్రమబద్ధీకరించేందుకు తీర్మానం చేశామనీ, దీనిని ప్రభుత్వ ఆమోదం కోసం పంపుతామని చెప్పారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో మంగళవారం జరిగిన ధర్మకర్తల మండలి సమావేశం వివరాలను ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులతో కలిసి చైర్మన్ మీడియాకు వివరించారు. బోర్డు నిర్ణయాల్లో కొన్ని ఇవీ..

- ఒంటిమిట్టలోని భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు అందించేందుకు రూ.4.35 కోట్లు కేటాయింపు.
- శ్రీవారిమెట్టు, అలిపిరి నడకమార్గాల్లో లైటింగ్, భద్రత పెంపు. ఆధ్యాత్మిక ఆహ్లాదకర వాతావరణం ఏర్పాటు.
- శిలాతోరణం, చక్రతీర్థం ప్రాంతాలను మరింత అభివృద్ధి చేసేందుకు మాస్టర్ ప్లాన్, డీపీఆర్ రూపొందించాలని ఆదేశం.
- వివిధ దేశాల్లో శ్రీవారి ఆలయాల నిర్మాణానికి నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదిక పై టీటీడీ సబ్ కమిటీ ఏర్పాటు. ఆ కమిటీ నివేదిక ప్రకారం తదుపరి చర్యలు.
- శ్రీవారిసేవను మరింత పటిష్టంగా అమలుచేసేందుకు కాంట్రాక్టు విధానంలో 4 కోఆర్డినేటర్ పోస్టుల భర్తీ.
- కల్యాణకట్టల్లో మరింత మెరుగైన వసతుల కోసం నిపుణులను సంప్రదించి కార్యాచరణ ప్రణాళిక.
- తిరుమలలో పాతబడి హెచ్‌వీడీసీలోని ఆరు బ్లాకులు, బాలాజీ విశ్రాంతి భవనం, ఆంధ్రా గెస్ట్‌హౌస్, అన్నపూర్ణ క్యాంటీన్, కల్యాణి సత్రాలను ఐఐటీ నిపుణుల సూచనల మేరకు తొలగించాలని నిర్ణయం.
- వేదపారాయణం స్కీం ద్వారా ఇప్పటికే 1,430 మందికి ఏటా రూ.36 కోట్ల గౌరవ వేతనం ఇస్తున్నారు. తాజాగా మరో 700 మందికీ ఇవ్వాలని నిర్ణయం. దీనివల్ల టీటీడీకి అదనంగా రూ.18 కోట్ల భారం పడుతుంది. రాష్ట్రంలోని వారికే తొలి ప్రాధాన్యం.
- కడపలోని పురాతనమైన శివాలయం అభివృద్ధి.
- తాళ్లపాకలో పలు అభివృద్ధి కార్యక్రమాలు.

సెప్టెంబరు 14, 15 తేదీల్లో మహిళా ప్రజాప్రతినిధుల జాతీయ సదస్సు

నేడు కలెక్టరేట్‌లో అధికారులతో స్పీకర్ సమీక్ష

తిరుపతి(కలెక్టరేట్), జూలై 22(ఆంధ్రజ్యోతి): తిరుపతి వేదికగా చట్టసభల జాతీయ మహిళ సాధికార సభ్యుల సదస్సు సెప్టెంబరు 14, 15 తేదీల్లో జరగనుంది. ఈ సదస్సుకు వివిధరాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన మహిళా ప్రజాప్రతినిదులు హాజరు కానున్నారు. ఈ సదస్సు నిర్వహణ ఏర్పాట్లపై కలెక్టరేట్‌లో బుధవారం ఉదయం 10గంటలకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ సమీక్షించనున్నారు. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, ఇతర అధికారులు పాల్గొననున్నారు. జాతీయ మహిళా సాధికార సభ్యుల సదస్సు కోసం తాజ్‌హోటల్‌ను వేదికగా ఎంచుకున్నట్టు సమాచారం. దాదాపు 500మంది ఎంపవర్మెంట్ ఆఫ్ ఉమెన్ కమిటీ సభ్యులు అన్ని రాష్ట్రాల నుంచి పాల్గొంటున్నారు.

నేను సైతం..!

గూడూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కష్టాల్లో ఉన్న ఆమెకు అండగా నిలబడ్డారు. ఇల్లు కట్టించారు. ఆ తర్వాత ఇంటికొచ్చి మరీ ఎలా ఉన్నారంటూ పలకరించారు. ఇలా నేను సైతం.. అంటూ బాధితురాలికి ఆసరాగా నిలిచారు నటి మంచు లక్ష్మి. గూడూరు పట్టణం ఎస్‌కేఆర్ ప్రభుత్వ కళాశాల సమీపంలోని ఉష ఇంటికి మంగళవారం మంచు లక్ష్మి వచ్చారు. 'ఎనిమిదేళ్ల కిందట నేను ఓ టెలివిజన్ షో నిర్వహించా. ఆ సమయంలో గూడూరుకు చెందిన ఉష తన భర్త చనిపోవడంతో కుటుంబాన్ని పోషించుకునేందుకు ఓ ప్రైవేటు కర్మాగారంలో పనులకు వెళ్లేది. ఓ రోజు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని ఆమెకు కాలు తీసేశారు. నా కార్యక్రమంలో పాల్గొన్న ఆమె.. సమస్యను చెప్పింది. ఆమెకు ఆసరాగా నిలిచేందుకు ఇంటి నిర్మాణానికి అవసరమైన ఖర్చులను నేను భరించా. ప్రస్తుతం ఉష ఎలా ఉన్నారో తెలుసుకునేందుకు వాళ్లింటికి వచ్చా'నని లక్ష్మి చెప్పారు. ప్రస్తుతం పేదలు చదివే పాఠశాలలను దత్తత తీసుకుని మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ సేవా గుణాన్ని పెంపొందించుకోవాలని కోరారు. ఆమెతో పాటు రవీంద్రరెడ్డి, వీరుబోయిన గోపాల కృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ఉషతో మాట్లాడుతున్న మంచు లక్ష్మి

'జీరో వేస్ట్' జిల్లాగా మారుద్దాం

- కమిషనర్ కృషి, పారిశుధ్య కార్మికుల శ్రమతోనే తిరుపతికి సర్వేక్షణ్ అవార్డు
- స్వచ్ఛత విజయోత్సవ సభలో మంత్రి అనగాని

తిరుపతి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): గార్బేజ్‌లో 'జీరో వేస్ట్' జిల్లాగా తిరుపతిని మారుద్దామని ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ పిలుపునిచ్చారు. తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో మంగళవారం సాయంత్రం జరిగిన స్వచ్ఛత విజయోత్సవ సభలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఏటా అందించే స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుకు తిరుపతి నగరపాలక సంస్థ ఎంపికకావడం ఆనందంగా ఉందన్నారు. మన పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యం బాగుంటుందన్నారు. దేశంలోనే స్వచ్ఛతలో భాగంగా రాష్ట్రానికి విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం, రాజమండ్రి, తిరుపతి మునిసిపాలిటీలకు స్వచ్ఛ అవార్డు రావడానికి పారిశుధ్య కార్మికులు చాలా కష్టపడ్డారని ప్రశంసించారు. తిరుపతిని అభివృద్ధి పథంలో తీసుకురావాలని కమిషనర్ మౌర్యకి సూచించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో నగరంలో పారిశుధ్యం పడకేసిందని అటువంటి పరిస్థితి నుంచి ఇవాళ అవార్డు పొందటంలో కమిషనర్, సిబ్బంది కృషి ఎంతో ఉందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. యూడీఎస్ నిర్మాణంతోపాటు కార్పొరేషన్ పరిపాలన భవనాన్ని పూర్తి చేసేందుకు సహకరించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. దేశంలోనే పుణ్యక్షేత్రమైన తిరుపతిని ఉత్తమ స్థానంలో నిలపడమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు కమిషనర్ మౌర్య తెలిపారు. సూపర్ స్వచ్ఛ లీగ్‌లో తిరుపతి రావడం గర్వకారణంగా ఉందన్నారు. పారిశుధ్యంపై ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారన్నారు. తిరుపతి నగరంలో పోగుపడే 250 టన్నుల చెత్తను నిర్వహణ చేసి జీరో వేస్ట్ సిటీగా మార్చుతామన్నారు. గార్బేజ్ ఫ్రీ సిటీలో 7 స్టార్ రేటింగ్ సాధించేందుకు కృషిచేస్తామన్నారు. ఈ సందర్భంగా అధికారులు, పారిశుధ్య కార్మికులను సత్కరించారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, కలెక్టర్ వెంకటేశ్వర్, కమిషనర్ మౌర్య, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువంశీ, ఏపీ జీబీసీ చైర్‌పర్సన్ సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, హస్త కళా నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, డిప్యూటీ మేయర్లు ఆర్సీ మునికృష్ణ, ముద్ర నారాయణ, నాయీ బ్రాహ్మణ చైర్మన్ రుద్రకోటి సదాశివం, వూకా విజయకుమార్, కార్పొరేటర్లు నరసింహాచారి, నరేంద్ర, అనిత, రుద్రరాజు శ్రీదేవితో పాటు కుమారమ్మ, కరాటే చంద్ర, ఏడీసీ చరణ్ తేజ్ రెడ్డి, డీసీ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్, ఆర్వో సేతుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.



సన్మానం అందుకున్న పారిశుధ్య కార్మికులతో మంత్రి అనగాని, ప్రజాప్రతినిధులు, నేతలు, అధికారులు

ఆహార నాణ్యత పరీక్ష పరిశోధనశాల ప్రారంభం

తిరుమల, జూలై22(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఏర్పాటు చేసిన ఆహార నాణ్యత పరీక్ష పరిశోధనశాలను మంగళవారం సాయంత్రం టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు,ఈవో శ్యామలరావు ప్రారంభించారు. 'గతంలో స్వామి ప్రసాదాలు, నెయ్యి వంటి వస్తువుల నాణ్యతను పరీక్షించేందుకు ఇతర రాష్ట్రాలకు నమూనాలను పంపాల్సి వచ్చేది. ఇప్పుడు తిరుమలలోనే అత్యాధునిక పరికరాలతో నేరుగా పరీక్షలు నిర్వహించగలిగేలా ల్యాబ్‌ను తీర్చిదిద్దాం' అని చైర్మన్ తెలిపారు. ఈవో మాట్లాడుతూ నెయ్యిలో కల్తీ.. నాణ్యత శాతాన్ని తక్షణమే విశ్లేషించే సామర్థ్యంతో కూడిన జీసీ(గ్యాస్ క్రోమోటోగ్రాఫీ), హెచ్‌పీఎల్‌సీ(హై పెర్ఫామెన్స్ లిక్విడ్ క్రోమోటోగ్రాఫీ) వంటి పరికరాలు ఏర్పాటు చేశామన్నారు. రూ.75 లక్షలు విలువైన ఈ పరికరాలను గుజరాత్‌లోని నేషనల్ డెయిరీ డెవలప్మెంట్ బోర్డు(ఎన్‌డీడీబీ) విరాళంగా అందజేసిందన్నారు. ల్యాబ్ సిబ్బంది, పోటు కార్మికులు మైసూరులోని సీఎఫ్‌టీఆర్ఐలో ప్రత్యేక శిక్షణ పొందారని,ఇకపై స్వామివారి ప్రసాదాల నాణ్యతను ఇదే ల్యాబ్‌లో పరిశీలించి వెంటనే ఫలితాలు అందించేలా ఏర్పాట్లు చేసినట్టు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు శాంతారామ్,సదాశివరావు, నరేష్, సీతఈ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఒక క్లిక్

- రూ.3.51 లక్షలు హాంఫట్
- సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త

తిరుపతి(నేరవిభాగం), జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఏపీకే ఫైల్‌పై చేసిన ఒకే క్లిక్.. బ్యాంకు ఖాతాల్లోని రూ.3.51 లక్షలను ఖాళీ చేసేసింది. తిరుపతి రూరల్ మండలం పేరూరు పంచాయతీకి చెందిన న్యాయవాది బాధితుడిగా మారారు. రూరల్ సీఐ చిన్నగోవిందు తెలిపిన ప్రకారం.. ఆ న్యాయవాదికి గత నెల 19వ తేదీన 8640086400 నెంబరు నుంచి వాట్సాప్ కాల్ వచ్చింది. ఆ తర్వాత ఈయన సెల్‌ఫోనుకు ఏపీకే ఫైల్‌ను పంపారు. దీంతో ఏపీకే ఫైల్‌ను న్యాయవాది క్లిక్ చేశారు. అంతే.. అతడి మూడు బ్యాంకు ఖాతాల్లోని రూ.3.51 లక్షలను సైబర్ నేరగాళ్లు.. తమ ఎనిమిది అకౌంట్లకు ట్రాన్స్‌ఫర్ చేసుకున్నారు. దీంతో న్యాయవాది ఫోను బ్లాక్ అయింది. వీటిపై మంగళవారం ఆయన తిరుపతి రూరల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, సీఐ కేసు నమోదు చేశారు. సైబర్ నేరాలపై పోలీసులు ఎంత అవగాహన కల్పిస్తున్నా తెలిసీ తెలియక ఇలా ఎందరో మోసపోతున్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి - ప్రమోదదేవి, కృష్ణదత్త చామరాజ్ వడియార్ - స్వప్న దత్

తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వేకువజాము సుప్రభాత సేవలో రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి శ్రీవారిని దర్శించుకోగా, ఉదయం వీఐపీ బ్రేక్‌లో దర్శనం చేసుకున్నవారిలో మైసూరు సంస్థానం రాజమాత ప్రమోదదేవి, మహారాజు యదువీర్ కృష్ణదత్త చామరాజ్ వడియార్, సినీ నిర్మాత స్వప్న దత్, తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి, తెలంగాణ ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, ధన్‌పాల్ సూర్యనారాయణ ఉన్నారు. దర్శనం అనంతరం మైసూరు సంస్థానం రాజమాత ప్రమోదదేవి, మహారాజు కృష్ణదత్త మీడియాతో మాట్లాడుతూ.. పల్లవోత్సవం సందర్భంగా తిరుమలకు వచ్చి స్వామిని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. తరతరాలుగా తమ వంశీకులందరూ స్వామి సేవలో తరిస్తున్నారని చెప్పారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

'దండోరా' చేస్తున్నా: నందు



తిరుమల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): నటుడు శివాజీతో కలిసి 'దండోరా' అనే చిత్రంలో నటిస్తున్నట్లు హీరో నందు తెలిపారు. శివాజీ తన తండ్రి పాత్రలో నటిస్తున్నారని వెల్లడించారు. తిరుమల శ్రీవారిని ఆయన మంగళవారం దర్శించుకున్న అనంతరం మీడియాతో మాట్లాడుతూ 'అగ్లీ స్టోరీ' అనే మరో చిత్రంలోనూ నటిస్తున్నట్లు చెప్పారు. నిర్మాతగా తాను తీయబోతున్న చిత్రంలో పెద్ద హీరో నటిస్తున్నారని, ఆగస్టు మొదటి లేదా రెండవ వారంలో ఆ చిత్రానికి సంబంధించిన వివరాలు వెల్లడిస్తామన్నారు.


సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని తొమ్మిదిషెడ్లు నిండిపోయి క్యూలైన్ కృష్ణతేజ విశ్రాంతి భవనం వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.3.96 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 77,481

తలనీలాలు సమర్పించినవారు: 30,612



'నిసార్' సిద్ధం



ఇస్రో-నాసా సంయుక్తంగా రూపొందించిన 'నిసార్' ఉపగ్రహం షార్ నుంచి జీఎస్ఎల్వీ-ఎఫ్ 16 రాకెట్ ద్వారా ఈ నెల 30న ఎగిరేందుకు సిద్ధమైంది. రెండు రోజుల క్రితం షార్‌లోని శాటిలైట్ ప్రిపరేషన్ బిల్డింగ్ నుంచి ఉపగ్రహాన్ని షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ పచ్చజెండా ఊపి రెండో ప్రయోగ వేదిక వద్దనున్న వ్యాబ్‌కు తరలించారు. అక్కడ రాకెట్ మూడు దశల అనుసంధాన పనులు, రాకెట్ శిఖర భాగాన ఉపగ్రహాన్ని అమర్చే ప్రక్రియను శాస్త్రవేత్తలు పూర్తి చేశారు. ఈ ఫొటోలను ఇస్రో మంగళవారం విడుదల చేసింది. మరో రెండు రోజుల్లో వ్యాబ్ నుంచి రెండో ప్రయోగ వేదికకు రాకెట్‌ను తరలించేందుకు శాస్త్రవేత్తలు సన్నాహాలు చేస్తున్నారు.

- సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి



వాణిజ్య పన్నుల శాఖ
సర్కిల్ కార్యాలయం తరలింపునకు అనుమతి

తిరుపతి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య పన్నుల శాఖ శ్రీకాళహస్తి సర్కిల్ కార్యాలయాన్ని పుత్తూరు నుంచీ శ్రీకాళహస్తికి తరలించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. శ్రీకాళహస్తి కేంద్రంగా పనిచేయాల్సిన సర్కిల్ కార్యాలయం పాలనా కారణాలతో పుత్తూరులో నడుస్తోంది. అక్కడి నుంచీ శ్రీకాళహస్తి పానగల్ ప్రాంతానికి కార్యాలయాన్ని తరలించేందుకు అనుమతి కోరుతూ శాఖ చీఫ్ కమిషనర్ ఈ ఏడాది ఫిబ్రవరి 28న లేఖ రాశారు. దానిపై స్పందించిన శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ కార్యాలయం తరలించేందుకు అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

కమనీయం కుమారస్వామి కల్యాణం



గజవాహనంపై ఊరేగుతున్న శ్రీవల్లీ, దేవసేన సమేత కుమారస్వామి

శ్రీకాళహస్తి, జూలై 22(ఆంధ్రజ్యోతి): శ్రీవల్లీ దేవసేన సమేత కుమారస్వామి కల్యాణం మంగళవారం రాత్రి కమనీయంగా సాగింది. శ్రీకాళహస్తి పట్టణంలోని విజ్ఞానగిరిపై వెలసిన కుమారస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా కుమారస్వామికి, శ్రీవల్లీ, దేవసేనకు కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. మొదట అలంకార మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించారు. అక్కడ నుంచి మంగళ వాయిద్యాలు, మేళతాళాల మధ్య కుమారస్వామి ఆలయం వద్దకు తీసుకొచ్చారు. అక్కడ వేద పండితులు మంత్రోచ్చరణల మధ్య కల్యాణం జరిపించారు. అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను గజ వాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. ఈ వేడుకలను తిలకించడానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు కార్యాలయంలో డిజిటల్ ఫైళ్లు

తిరుపతి(నేరవిభాగం), జూలై 22(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో ఫైళ్ళ నిర్వహణకు సంబంధించి పారదర్శకత ఎస్పీ హర్షవర్ధన రాజు డిజిటల్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. దీంతో పోలీసు అధికారులు, పోలీసులు, సిబ్బందికి అవసరమైన పనులు ఎప్పటికప్పుడు సత్వరం పరిష్కరించడానికి అవకాశాలు ఏర్పడ్డాయి. ఈ విధానం ద్వారా పోలీసు సిబ్బంది వారి వ్యక్తిగత ఫైళ్ళ పురోగతిని సులభంగా తెలుసుకోవడానికి ప్రత్యేకంగా 9440900737 మొబైల్ నెంబరు ఏర్పాటు చేశారు. పారదర్శకత, దక్షత, ఫైళ్ల పరిష్కారంలో వేగవంతం కోసం ఈ వ్యవస్థను రూపొందించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు ఇంక్రిమెంట్లు, లీవులు, లీవు రెగ్యులరైజేషన్, జీపీఎఫ్ రుణాలు, అరియర్లు, ట్రాన్స్‌ఫర్లు, డెప్యుటేషన్లు, మెడికల్ రీఎంబర్సుమెంటు, భద్రత రుణాల మంజూరు తదితర విషయాల్లో తమకు సంబంధించిన ఫైళ్ళు ఎలా కదులుతున్నాయి? అనే సమాచారం సిబ్బందికి తెలియకపోవడం వల్ల సమస్యలు ఎదురవుతున్నాయి. డిజిటల్ వ్యవస్థతో ఫైల్ ప్రతి దశలో పురోగతిపై సమాచారం వాట్సాప్ ద్వారా ఆయా ఉద్యోగులకు అందుతుంది. అధికారులు, సిబ్బంది తమకున్న సమస్యలు, అభ్యంతరాలను మొబైల్ నెంబరుకు వాట్సాప్ ద్వారా పంపొచ్చు. ఈ ప్రక్రియ మొత్తం జిల్లా పోలీసు అధికారి పర్యవేక్షణలో జరుగుతుంది.

ఆగస్టు 15నాటికి లక్ష్యాన్ని చేరుకోవాలి

- పీ4 సర్వేపై అధికారులకు కలెక్టర్ దిశా నిర్దేశం



తిరుపతి(కలెక్టరేట్), జూలై 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పీ4 తీసుకువచ్చారని వచ్చే 15కల్లా జిల్లాలో ఇచ్చిన లక్ష్యాని చేరుకోవాలని అధికారులకు కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో వర్చువల్ విధానంలో పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గించేలా ప్రభుత్వం పీ4ను తీసుకువచ్చిందని వివరించారు. ఆదాయంలో అట్టడుగున ఉన్న 20 శాతం కుటుంబాలను గుర్తించాలన్నారు. వీరిని ఆర్థికంగా ఉన్నత స్థాయిలో ఉన్నవారు దత్తత తీసుకునే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగిందన్నారు. పేదలకు సహాయ సహకారాలు అందించేందుకు మార్గదర్శకులుగా పేరు పెట్టడం జరిగిందన్నారు. ఆగస్టు 15 నాటికి జిల్లాలో పి4 సర్వే పూర్తి కావాలన్నారు. బంగారు కుటుంబాలను దత్తత తీసుకునే మార్గదర్శకులను గుర్తించాలన్నారు. ఇక పీజీఆర్ఎస్‌కు వచ్చే ప్రతి అర్జీకూడా గడువులోగా పరిష్కరించాలని అర్జీదారులకు స్పష్టత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఓఎల్ఎక్స్‌లో ఫోను పెడితే చాలు..!

- కొంటానంటూ వస్తాడు
- సోదరుడికి ఫోను చూపిస్తానంటూ పారిపోతాడు
- మళ్లీ ఫోను అమ్మకానికి పెట్టి పట్టుకున్న బాధితుడు

తిరుపతి(నేరవిభాగం), జూలై 22(ఆంధ్రజ్యోతి): ఓఎల్ఎక్స్ యాప్‌లో ఖరీదైన ఫోనును అమ్మకానికి పెడితే చాలు. నేను కొంటానంటూ ఫోను చేస్తాడు. నేరుగా కలిశాక మాయమాటలు చెప్పి.. ఇంట్లో చూపించి వస్తానంటూ ఆ ఫోనుతో పారిపోతాడు. అలాంటి మోసగాడిని.. ఓ బాధితుడే తన స్నేహితులతో కలిసి రెండు రోజుల కిందట పట్టుకున్నారు. ఇందులో బాధితుడు తిరుపతికి చెందిన సోని అయితే నిందితుడు విజయవాడవాసి సుబ్రహ్మణ్యం. వివరాలిలా ఉన్నాయి. విజయవాడకు చెందిన సుబ్రహ్మణ్యం తిరుపతిలో ఉంటూ మోసాలకు పాల్పడుతున్నాడు. పది రోజుల కిందట పద్మావతినగర్‌కు చెందిన సోని తన యాపిల్ ఫోన్‌ను విక్రయించడానికి ఓఎల్ఎక్స్ యాప్‌లో పెట్టారు. ఓఎల్ఎక్స్‌లో చూసిన సుబ్రహ్మణ్యం.. ఆ నెంబరుకు ఫోను చేశాడు. యాపిల్ ఫోన్ మొత్తం క్లియర్ చేసుకుని.. కొరమేనుగుంట వద్ద ఉన్న తన వద్దకు తీసుకొస్తే మాట్లాడి కొనుక్కొంటానని చెప్పాడు. ఆ ప్రకారం మొబైల్ ఫోన్ తీసుకుని సోని వెళ్లారు. ఈ ఫోన్ చూసిన సుబ్రహ్మణ్యం.. ఇదే అపార్టుమెంటులో ఉంటున్న తన సోదరుడికి చూపించి తీసుకొస్తానని చెప్పి వెళ్లాడు.రెండు గంటలైనా రాక పోయే సరికి అతడికి ఫోన్ చేశారు.తాను ఇక్కడే ఉన్నానని, వస్తానంటూ చెప్పి ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు. చివరకు మోసపోయానని గుర్తించిన బాధితుడు.. తిరుపతి ఈస్ట్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



నిందితుడిని అదుపులోకి తీసుకున్న యువకులు

ఎలాగైనా నిందితుడ్ని పట్టుకోవాలని..

ఖరీదైన ఫోన్ లాక్కెళ్లిన ఆ మోసగాడిని వదిలేయకూడదని సోని, అతడి స్నేహితులు భావించారు. అతడిని పట్టుకునేందుకు పథకం పన్నారు. మళ్లీ ఓఎల్ఎక్స్ యాప్‌లో యాపిల్ ఫోన్ విక్రయానికి ఉంచారు. దీనిపైనా స్పందించిన సుబ్రహ్మణ్యం.. ఆ ఫోన్ కొంటానంటూ ఆ నెంబరుకు సంప్రదించాడు. తాను ఓ కారు షోరూము వద్ద ఉన్నానని, అక్కడికి ఫోన్ తీసుకొస్తే చూసి కొనుక్కుంటానని చెప్పాడు. రెండు రోజుల కిందట సోనితో పాటు అతడి స్నేహితులు దాదాపు 10 మంది అక్కడకు వెళ్లారు. సోని దూరంగా ఉండగా.. మిగతా స్నేహితులు కథ నడిపారు. వీరి వద్ద ఫోను చూసి ధర ఎంత అని సుబ్రహ్మణ్యం అడగ్గా.. వారు రూ.1.5 లక్షలని చెప్పారు. దీనికి సరేనన్న సుబ్రహ్మణ్యం.. ఫోను ఇస్తే సోదరుడికి చూపించి వస్తానన్నాడు. ఆ వెంటనే వీరంతా మోసగాడిని పట్టుకున్నారు. తమ వాహనంలో తీసుకొచ్చి తిరుపతి ఈస్ట్ సీఐ శ్రీనివాసులుకు అప్పగించారు. పోలీసుల విచారణలో సోని ఫోను ఎక్కడ అమ్మింది చెప్పాడు. ఆ ప్రకారం ఓ మొబైల్ షాపు వద్దకు వెళ్లి ఆ యాపిల్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడ్ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఇలా, దాదాపు 20 నుంచి 30 ఐ ఫోన్లు లాక్కొని పరారైనట్లు సమాచారం.

9 లక్షల ఉద్యోగాల కల్పనకు చర్యలు

- రూ.10 లక్షల కోట్లతో ఎంవోయూలు చేసుకున్నామన్న మంత్రి అనగాని

రేణిగుంట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తమ ప్రభుత్వం రూ.పది లక్షల కోట్ల పెట్టుబడులతో 9 లక్షల ఉద్యోగాల కల్పనకు ఒప్పందాలు చేసుకున్నామని రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. మంగళవారం సాయంత్రం రేణిగుంటలోని అంబేడ్కర్ కూడలిలో జరిగిన 'సుపరిపాలనకు తొలి అడుగు' కార్యక్రమంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఏడాదిలో ప్రభుత్వం చేసిన మంచి పనులను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. యువతకు ఉపాధి కల్పించే దిశగా తమ ప్రభుత్వం అడుగులేస్తోందన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలన్న ప్రణాళికతో ఎమ్మెల్యే సుధీర్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చి తాగునీటి సమస్యను పరిష్కరించారని అభినందిస్తూ, ఇక్కడ సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు, మురుగునీటి కాలువలు కావాలని కోరారన్నారు. ఈ సమస్యలను మున్సిపల్ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి పనులు పూర్తయ్యేలా చేస్తానని హామీ ఇచ్చారు. గత పాలనలో ప్రజలకు ఏమి చేయకుండానే కూటమి మేనిఫెస్టోపై బురదజల్లేలా వైసీపీ ప్రచారం చేస్తోందని విమర్శించారు. గత పాలనలోలాగా రౌడీయిజం, అరాచకాలు లేకపోవడంతో శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజలు ప్రశాంతంగా నిద్రపోతున్నారని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో మండల, పట్టణ టీడీపీ అధ్యక్షులు ముని చంద్రారెడ్డి, మహబూబ్ బాషా, నేతలు సుబ్రహ్మణ్యం రెడ్డి, మునిస్వామి నాయుడు, నాదముని రెడ్డి, బుజ్జి నాయుడు, వెంకట మునిరెడ్డి, పుష్పనాదం, సుబ్రహ్మణ్యం, కన్నన్ రెడ్డి, రవి, రాజేష్ రెడ్డి, మేరీ, భాస్కర్ రెడ్డి, భాస్కర్ యాదవ్, నవాబ్, మురళి తదితరులు పాల్గొన్నారు.



పండ్లు విక్రయిస్తున్న మహిళ సమస్యను తెలుసుకుంటున్న మంత్రి, ఎమ్మెల్యే

'సమన్వయం'తో ముందుకెళతాం: ఎమ్మెల్యే

వరదయ్యపాళెం, జూలై 22(ఆంధ్రజ్యోతి): కూటమిప్రభుత్వంలో అంద రూ కలిసిఉండి నియోజకవర్గ సమన్వయకర్త శంకర్ రెడ్డితో సమన్వయం చేసుకుంటూ నియోజకవర్గాన్ని అభివృద్ధివైపు నడిపిస్తామని ఎమ్మెల్యేకోనేటి ఆదిమూలం అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కోఆర్డినేటర్ శంకర్‌రెడ్డి కూడా అందరినీ విచారణచేసి కలుపుకొని వెళ్లమని చెప్పానే తప్ప ఆయనపై వ్యతిరేకత లేదన్నారు. వైసీపీ నాయకులకు, కార్యకర్తలకు ఎక్కడైనా పని ఇచ్చినా, ప్రోత్సహించినా విచారించి చర్యలు తీసుకోవచ్చన్నారు. 17 నెలలుగా ప్రతిరోజు తనను మానసిక క్షోభకు గురిచేస్తున్నారన్నారు. అన్ని అవమానాలను తట్టుకుని పార్టీ కోసం నిబద్ధదతో పనిచేస్తున్నట్లు తెలిపారు. సత్యవేడు మండలంలో ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన ఒకరు వానెల్లూరు పంచాయతీ సమీపంలో ర్యాంప్ ఏర్పాటు చేసి ఏడాదిగా రాత్రిసమయంలో క్వారీల ముసుగులో శ్రీసిటీ పోలీస్‌స్టేషన్ మీదుగా ఇసుక రవాణా చేస్తున్నట్లు సామాజిక మాధ్యమాల్లో వచ్చిందన్నారు. వాటిపై విచారించకుండా అనుమానాస్పదంగా కేసు కడుతున్నారన్నారు. ఆ అధికారి ఎంతకు దిగజారాడో తెలుస్తోందన్నారు.



గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

సైదాపురం పూర్వపు ఎంపీడీవోపై వేటు

- ఉపాధి హామీ పథకంలో అవినీతే కారణం
- ప్రస్తుతం కోట మండల పరిషత్ ఏవో

సైదాపురం/కోట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సైదాపురం పూర్వపు ఎంపీడీవో.. ప్రస్తుతం కోట మండల పరిషత్ కార్యాలయ ఏవోగా పనిచేస్తున్న పి.శివకుమార్‌ను సస్పెండ్ చేసినట్లు జడ్పీ సీఈవో మోహన్ రావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సైదాపురం ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న సమయంలో మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం సిబ్బంది వద్ద నగదు వసూలు చేసినట్లు ఫిర్యాదులు అందాయి. ఈ మేరకు పూర్తిస్థాయిలో విచారించిన ఉన్నతాధికారులు వాస్తవమని తేలడంతో అయ న్ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

- 247 నుంచి 358కి

తిరుపతిలో పెరగనున్న పోలింగ్ కేంద్రాలు

తిరుపతి అర్బన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎన్నిక కమిషన్ మార్గదర్శకాలనుసారం తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో పోలింగ్ కేంద్రాలు పెరగనున్నాయి. ఇప్పటి వరకు 109 ప్రాంతాల్లో 274 పోలింగ్ కేంద్రాలు ఉండగా... 126 ప్రాంతాల్లో 358కి కేంద్రాలు పెంచేలా చర్యలు చేపట్టామని అర్బన్ తహసీల్దారు సురేష్‌బాబు మంగళవారం మీడియాకు తెలిపారు. ఒక పోలింగ్ కేంద్రంలో 1,200ఓట్లకే పరిమితం చేశామన్నారు. అనివార్య కారణాల దృష్ట్యా 13ప్రదేశాలు మార్పు జరిగిందని, 2 పోలింగ్‌స్టేషన్ల పేర్లు సవరణ చేశామన్నారు. ఈ నివేదికను 25న కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. త్వరలోనే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ డోర్ టూ డోర్ సర్వే చేపడుతామన్నారు. తద్వారా కుటుంబ సభ్యులందరు ఒకే పీఎస్‌లో ఓటు వేసేందుకు సౌకర్యంగా ఉంటుందన్నారు.

శ్రీవాణి ట్రస్టు భక్తులకు నూతన భవనం



కౌంటర్లు ప్రారంభిస్తున్న టీటీడీ చైర్మన్, ఈవో, అధికారులు

తిరుమల, జూలై22(ఆంధ్రజ్యోతి): శ్రీవాణి దర్శన టికెట్లు జారీ చేసేందుకు తిరుమల అన్నమయ్య భవనం ఎదురుగా ఉన్న నూతన కేంద్రాన్ని మంగళవారం టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు ప్రారంభించారు. ప్రత్యేక పూజలు నిర్వహించాక కొందరు భక్తులకు టికెట్లను జారీ చేశారు. అనంతరం చైర్మన్ మీడియాతో మాట్లాడుతూ.. శ్రీవాణి టికెట్ల కోసం భక్తులు ఉదయం 5 గంటల నుంచే క్యూలైన్‌లో నిలబడుతున్నారని, ఈ నేపథ్యంలో భక్తులకు సులభతరంగా టికెట్లు జారీ చేసేందుకు రూ.60 లక్షలతో నూతన కౌంటర్లను నిర్మించామన్నారు. బుధవారం నుంచి ఈ కౌంటర్ల ద్వారా భక్తులకు టికెట్లు జారీ చేస్తామన్నారు. అనంతరం హెచ్‌వీసీ, ఏఎస్సీ ప్రాంతాల్లో ఆధునీకీకరించిన ఉప విచారణ కార్యాలయాలను టీటీడీ చైర్మన్ ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో బోర్డు సభ్యులు సుచిత్ర ఎల్లా, జంగా కృష్ణమూర్తి, భానుప్రకాష్‌రెడ్డి, శాంతారామ్, నరేష్, సదాశివరావు, నర్సిరెడ్డి, జానకీదేవి, అదనపు ఈవో వెంకయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యే లక్ష్యం

- టీచ్ ఫర్ చేంజ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ మంచు లక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న మంచు లక్ష్మి

నాయుడుపేట టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందించేందుకు టీచ్ ఫర్ చేంజ్ ఫౌండేషన్ కృషి చేస్తోందని ఫౌండేషన్ చైర్‌పర్సన్, సినీ నటి మంచులక్ష్మి పేర్కొన్నారు. నాయుడుపేట పట్టణం రాజగోపాలపురం ప్రభుత్వ పాఠశాలలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డిజిటల్ క్లాస్ రూంను మంగళవారం మంచు లక్ష్మి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలన్న లక్ష్యంతో టీచ్ ఫర్ చేంజ్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటి వరకు ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల్లో 320 డిజిటల్ క్లాస్ రూంలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తమ అమ్మమ్మ ఊరైన నాయుడుపేట ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ రూంను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. అంతకుముందు నాయుడుపేటలో ఉన్న తన తల్లి సమాధి వద్ద పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో డీవైఈవో సనత్‌కుమార్, ఎంఈవో మునిరత్నం, ప్రధానోపాధ్యాయుడు జనార్దనరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ, మాజీ కౌన్సిలర్ శేషం మునిగోపి, టీడీపీ నాయకులు పెసల కిషోర్‌బాబు, నానాబాల సుబ్బారావు, అవధానం సుధీర్, సాయి, సురేష్, మస్తాన్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఫలించిన ఆరేళ్ల ఎదురుచూపు

- వెటర్నరీ వర్సిటీ అధ్యాపకులకు బకాయిల విడుదల

తిరుపతిరూరల్, జూలై22(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీవెటర్నరీ వర్సిటీ పరిధిలోని అధ్యాపకుల ఆరేళ్ల ఎదురుచూపు ఫలించింది. యూజీసీ అరియర్స్ విడుదలయ్యాయి. ఈ మేరకు యూజీసీ-2016 రివైజ్డ్ పే స్కేల్ అరియర్స్‌లో రాష్ట్రప్రభుత్వ వాటా 50శాతానికి సంబంధించిన రూ.12.78కోట్లను విడుదల చేస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ అదనపు బడ్జెట్‌లో యూజీసీ రెగ్యులర్ అధ్యాపకులకు రాష్ట్రప్రభుత్వ 50శాతం, పెన్షనర్స్‌కి వందశాతం మంజూరు చేశారు. వివరాల్లోకి వెళ్లితే.. యూజీసీ ఆర్పీఎస్ -2016 ప్రకారం అప్పట్లో అధ్యాపకులకు పెరిగిన వేతనాలను రాష్ట్రంలో 2019 ఏప్రిల్‌నెల నుంచి ఇంప్లిమెంట్ చేశారు. దీనికి సంబంధించి 2016జనవరి1 నుంచి 2019మార్చి 31వరకూ వర్సిటీ అధ్యాపకులకు బకాయిలు చెల్లించని పరిస్థితి. దీనిలో రాష్ట్రప్రభుత్వ వాటా 50శాతానికి ఐసీఏఆర్ మ్యాచింగ్‌గ్రాంట్ 50శాతం వాటా కలుపుకుని అధ్యాపకులకు వందశాతం అరియర్స్‌ని చెల్లించాలి. అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వ 50శాతం వాటాన్ని వర్సిటీ బడ్జెట్‌లో చూపిన తర్వాతనే మ్యాచింగ్ గ్రాంట్ 50శాతాన్ని విడుదల చేస్తామని ఐసీఏఆర్ అధికారులు సూచించారని సమాచారం. ఆ క్రమంలో రాష్ట్రప్రభుత్వ వాటాకి సంబంధించి వర్సిటీలో బడ్జెట్‌లో నిధులులేని కారణంగా ఐసీఏఆర్ మ్యాచింగ్ గ్రాంట్ వాటా నిధులు ఇవ్వకుండా ఇన్నేళ్లు తాత్సారం చేశారని అధ్యాపకవర్గాలు అంటున్నాయి. గతవైసీపీ ప్రభుత్వ పాలకుల అనాలోచిత నిర్ణయాలతో ఆరేళ్లుగా అరియర్స్ కోసం ఎదురుచూడాల్సి వచ్చిందని అంటున్నారు. ఇక ఐసీఏఆర్ మ్యాచింగ్‌గ్రాంట్ నిధులను తెచ్చుకోవాల్సి ఉందని అంటున్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు హెల్మెట్ల పంపిణీ



హెల్మెట్లు పంపిణీ చేస్తున్న మౌనిక రెడ్డి

డక్కిలి, జులై 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీసుల స్టేషన్‌లో ఎస్‌ఐ శివశంకర్, తహసీల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగులకు మౌనిక చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ మౌనిక రెడ్డి ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరు నెలల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తన సోదరుడు శ్రీనివాసులురెడ్డి తలకు బలమైన గాయం తగలడం వల్ల చనిపోయారని చెప్పారు. హెల్మెట్ ఉంటే తప్పకుండా ప్రాణాపాయం తప్పేదని వైద్యులు చెప్పారని తెలిపారు. తన సోదరుడి జ్ఞాపకార్థ ప్రభుత్వ ఉద్యోగులకు హెల్మెట్లు పంపిణీ చేశామని, త్వరలో ఇతరులకు కూడా అందచేస్తామని తెలిపారు. ఎస్‌ఐ శివశంకర్ మాట్లాడుతూ హెల్మెట్ ధరించాలని వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్నా మార్పు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే కేసులు పెడుతున్నట్లు వివరించారు. హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే చర్యలు తీసుకొంటామని చెప్పారు. తహసీల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ మౌనిక చారిటబుల్ ట్రస్టు సేవలు అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్నరాణి, రెవెన్యూ, పోలీసు శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వేగేటు వద్ద సిమెంట్ దిమ్మెల తొలగింపు

సూళ్లూరుపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట రైల్వేగేటు వద్ద అండర్ బ్రిడ్జి నిర్మాణం కోసం తెచ్చిన సిమెంట్ దిమ్మెలను రోడ్డు అడ్డంగా ఉండడంతో మంగళవారం పక్కకు తొలగించారు. మూడేళ్ల క్రితం అండర్ బ్రిడ్జి నిర్మాణం కోసం భారీ సిమెంట్ దిమ్మెలను రైల్వేగేటు వద్దకు తెచ్చి పెట్టారు. బ్రిడ్జి పనులు ఆగిపోవడంతో ఆ సిమెంట్ దిమ్మెలను రైల్వేగేటు దక్షిణవైపు ఉన్న రోడ్డులో పెట్టేశారు. ఆ దిమ్మెలు రోడ్డుకు అడ్డంగా ఉండడంతో నిత్యం ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు ఇబ్బందులు పడేవారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె స్పందించి రైల్వే అధికారులతో మాట్లాడారు. మంగళవారం రైల్వే అధికారులు రోడ్డుకు అడ్డంగా ఉన్న ఆ దిమ్మెలను భారీ క్రేన్‌ల సాయంతో పక్కకు తొలగించారు. ఈ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, అలవల శ్రీనివాసులు, దంతాల రవి, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



విద్యార్థులకు మొక్కలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ శంకర్ శర్మ, యదుముడి స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు గీతికా వెంకటేశం

సూళ్లూరుపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని వీఎస్‌ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. మంగళవారం కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్, యదుముడి స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. యదుముడి స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు గీతికా వెంకటేశం మాట్లాడుతూ మొక్కలు నాటి వాటిని రక్షించాల్సిన బాధ్యత కూడా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ విక్టోరియా రాణి, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి ఏడుకొండలు, శ్రీనివాసులు, అధ్యాపకులు రమేష్, శరత్, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

చదువుల్లో ప్రోత్సహించేందుకు ఆర్థిక సాయం



ఆర్థికసాయాన్ని అందజేస్తున్న శ్రీకంటి రామమోహన్‌రావు

గూడూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులను చదువుల్లో ప్రోత్సహించేందుకు ఎస్‌వీ రత్నం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు ట్రస్ట్ అధ్యక్షుడు, సీనియర్ ఆడిటర్ శ్రీకంటి రామమోహన్‌రావు తెలిపారు. మంగళవారం ట్రస్ట్ కార్యాలయంలో రోటరీవెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థుల విద్యాసామగ్రి కోసం రూ.1.49 లక్షలను విద్యార్థుల కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుల ద్వారానే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. పేద విద్యార్థులకు అవసరమైన విద్యాసామగ్రి, పాఠశాలల ఫీజుల నిమిత్తం తన వంతు సాయంగా వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయాన్ని అందించామన్నారు. కార్యక్రమంలో ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, నాశిన నాగులు, తాళ్లూరు శ్రీనివాసులు, విజయభాస్కర్‌రెడ్డి, గిరిబాబు, సనత్ కుమార్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.


బీజేపీ జిల్లా కార్యదర్శులుగా విజయమ్మ, కృష్ణమూర్తి



విజయమ్మ

సూళ్లూరుపేట, తడ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటకు చెందిన బెజవాడ విజయమ్మ బీజేపీ జిల్లా కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్.శ్రీనివాస్ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర మహిళా మోర్చా కార్యదర్శిగా ఉన్న విజయమ్మ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. ఆమె పార్టీకి చేసిన సేవలను గుర్తించి జిల్లా కార్యదర్శిగా నియమించారు. విజయమ్మను పార్టీ నాయకులు అభినందించారు. అలాగే సుదీర్ఘకాలం నియోజకవర్గ కన్వీనర్‌గా పనిచేసిన రాచర్ల కృష్ణమూర్తిని జిల్లా కార్యదర్శిగా నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ ప్రకటించారు.

ఉపాధ్యక్షులుగా నరేంద్రరెడ్డి, పురుషోత్తమరెడ్డి



నరేంద్రరెడ్డి

పెళ్లకూరు, వాకాడు, జూలై 22(ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండలం పాలచ్చూరు గ్రామానికి చెందిన ఎద్దల నరేంద్రరెడ్డి బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడుగా మరోసారి నియమితులయ్యారు. ప్రస్తుతం జిల్లా ఉపాధ్యక్షుడుగా ఉన్న ఆయన రెండోసారి అదే పదవిలో నియమితులయ్యారు. బీజేపీ మండల అధ్యక్షుడు కలిచేటి నరసింహులు, మాజీ అధ్యక్షుడు గోగుతోటి మురళి తదితరులు తాళ్వాయిపాడు పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. అలాగే వాకాడు మండలంలో జెమిన్‌కొత్తపాళెం గ్రామానికి చెందిన పాపారెడ్డి పురుషోత్తమరెడ్డిని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడుగా, జిల్లా కార్యవర్గ సభ్యుడుగా కళావల్లి ప్రసాద్‌ను నియమించినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ ప్రకటించారు.

తడి, పొడి చెత్తపై అవగాహన

వెంకటగిరి టౌన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గొట్లగుంట ఎస్సీ కాలనీలో తడి, పొడి చెత్తపై ఎంపీడీవో గుణశేఖర్ మంగళవారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్త వేరుచేసి గ్రీన్ అంబాసిడర్లకు ఇచ్చి గ్రామాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

ఫెన్సింగ్ రాయిని ఢీకొని దుప్పి మృతి

గూడూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతుండగా ప్రమాదవశాత్తు ఫెన్సింగ్ రాయిని ఢీకొని చుక్కలదుప్పి మృతి చెందింది. స్థానికుల వివరాల మేరకు... మండలంలోని గోగినేనిపురం సమీపంలో మంగళవారం ఓ చుక్కలదుప్పి రోడ్డు దాటుతూ ఫెన్సింగ్ రాయిని ఢీకొనడంతో మృతిచెందింది. స్థానికులు గమనించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు.

పాఠశాలకు కుర్చీల వితరణ

చిల్లకూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లిపేడు జడ్పీ ఉన్నత పాఠశాలకు ఎన్‌ఆర్‌ఐ సతీష్ ఆయన తల్లిదండ్రులు సూర్యప్రకాష్, రాజేశ్వరమ్మ జ్ఞాపకార్థం 20 కుర్చీలను వితరణగా మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మధుకర్, శేషయ్య, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీవి స్కాములు... కూటమివి స్కీములు: విజయశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పక్కన నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం

ఓజిలి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనంతా స్కాములు జరగ్గా... కూటమి స్కీములతో సంక్షేమం అందిస్తోందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. ఓజిలి మండలం అత్తివరం గ్రామంలో సొసైటీ మాజీ అధ్యక్షుడు కనుమూరు గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. గ్రామంలో రూ.5 లక్షల వ్యయంతో నిర్మించిన సిమెంటు రోడ్డు, దాతల సాయంతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో జరిగిన స్కాముల ఫలితాన్ని నేడు ఆ పార్టీ నేతలు అనుభవిస్తున్నారన్నారు. లిక్కర్ స్కాముతో దోచుకోవడంతో పాటు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడారని విమర్శించారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలన సాగిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు పద్మావతి, ఎంపీడీవో విజయలక్ష్మి, ఏఈ రవివర్మ, ఏపీఎం పద్మ, ఏపీవో చిన్నయ్యతో పాటు పెళ్ళకూరు మండల టీడీపీ కన్వీనరు సంచి కృష్ణయ్య, ఓజిలి మండల ప్రధాన కార్యదర్శి దాసరి నిరంజన్, జిల్లా మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు ఎస్‌కే ఖలీల్, నాయకులు గున్నం మధురెడ్డి, ఎద్దల ధనుంజయరెడ్డి, బచ్చల రవీంద్రారెడ్డి, దారా అంకయ్య, పురుషోత్తంరాజు, ఫణీంద్రరెడ్డి, ఈశ్వరరాజు, కమలాకర్, మన్మద తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రగతిని హోలిస్టిక్స్ కార్డ్‌లో నమోదు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో కేవీఎస్ కుమార్

నాయుడుపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ప్రగతిని హోలిస్టిక్స్ కార్డ్‌లో నమోదు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి కేవీఎస్ కుమార్ అన్నారు. పట్టణంలోని విశ్వం జూనియర్ కళాశాలలో మంగళవారం గూడూరు డివిజన్‌లోని 14 మండలాల విద్యాశాఖ అధికారులు, 1, 2 క్లస్టర్స్ ప్రధానోపాధ్యాయులకు, సీఆర్‌ఎంపీల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థుల నమోదు యూడేస్ క్లబ్‌లో తప్పక నమోదు చేయాలన్నారు. అలాగే కొత్తగా నమోదు చేసిన విద్యార్థులకు కూడా తల్లికి వందనం వర్తించేలా చూడాలన్నారు. మధ్యాహ్న భోజనం పథకంపై ప్రత్యేక సూచనలు ఇచ్చారు. ఆధార్ లేని విద్యార్థులకు ఎంపీడీవో, సచివాలయ సిబ్బందితో మాట్లాడి నమోదు చేయించాలన్నారు. 10వ తరగతి విద్యార్థులకు సాయంత్రం స్టడీ క్లాసులను తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డీవైఈవో సనత్‌కుమార్, అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ గౌరీశంకర్, అకడమిక్ మానిటరింగ్ అధికారి శివశంకర్, కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి సురేష్, ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్, ఎంఈవో మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

నేదురుమల్లి ఆరోపణలు నిరూపిస్తే రాజకీయ సన్యాసం

తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్ నాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్ నాయుడు

వెంకటగిరి, జులై 22 (ఆంధ్రజ్యోతి) టీడీపీ నాయకులు అధికారాన్ని అడ్డం పెట్టుకొని భూ కబ్జాలకు పాల్పడుతున్నట్లు వైసీపీ ఇన్‌చార్జి నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి చేసిన ఆరోపణలను నిరూపిస్తే తాను రాజకీయ సన్యాసం పుచ్చుకుంటానని తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీకే ప్రసాద్ నాయుడు సవాల్ విసిరారు. పట్టణంలోని 6వ వార్డులో మంగళవారం టీడీపీ పట్టణ అధ్యక్షుడు శ్రీరాందాస్ గంగాధర్ ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో ప్రసాద్ నాయుడు మాట్లాడుతూ ఇటీవల నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి కూటమి ప్రభుత్వంపై చేసిన విమర్శలను ఖండించారు. టీడీపీ నాయకులు ఎవరైనా ఒక్క సెంటు భూమి ఆక్రమించి ఉన్నా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసుకోవచ్చన్నారు. ఇటీవల పదవీ విరమణ పొందిన వెంకటగిరి తహసీల్దార్ రాత్రి 12 గంటల వరకూ దొంగ పట్టాలపై సంతకాలు పెడుతూనే ఉన్నారని నేదురుమల్లి ఆరోపించడంలో అర్థం లేదన్నారు. అవసరమైతే తహసీల్దార్ కార్యాలయంలో సీసీ ఫుటేజీలు తెప్పించుకుని చూస్తే తెలుస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాల లబ్ధి చేకూరుతోందని చెప్పారు. రాంకుమార్‌రెడ్డి బురద చల్లడం మాని అభివృద్ధికి సహకరించాలని హితవు పలికారు. సమావేశంలో ఏఎంసీ మాజీ చైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు, టీడీపీ నాయకులు అవ్వారు సత్యనారాయణ, రామకృష్ణ, జనసేన నాయకుడు జంపాల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పొలం పిలుస్తోంది



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

గూడూరు అర్బన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామలింగాపురం, మిటాత్మకూరు గ్రామాల్లో మంగళవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాశాఖ ఏవో రమేష్ పంటల సాగులో మెలకువలపై రైతులకు అవగాహన కల్పించారు. అవసరమైన మేరకే రసాయనిక ఎరువులను వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో కల్యాణి, శివశంకర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమా పథకాలను సద్వినియోగం చేసుకోండి

కోట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పంటల బీమా పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సుచేంద్రప్రసాద్ కోరారు. మండల పరిధిలోని నెల్లూరుపల్లి, తిమ్మానాయుడుపాళెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. వరి పంటలకు వచ్చే చీడపీడలపై అవగాహన కల్పించారు. ప్రధానమంత్రి పసల్ బీమా యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి సాయికుమార్, సహాయ వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

వైసీపీని బలోపేతం చేయండి

కోట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): అధికార టీడీపీ వైఫల్యాలను తెలియజేస్తూ గ్రామస్థాయి నుంచి వైసీపీని బలోపేతం చేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ మేరిగ మురళి అన్నారు. మండల పరిధిలోని విద్యానగర్‌లో గల నేదురుమల్లి సుబ్బరామిరెడ్డి కళాభవన్‌లో మంగళవారం వైసీపీ నాయకుల సమావేశం జరిగింది. కొడవలూరు ధనంజయరెడ్డి, పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, సాయిప్రసాద్‌రెడ్డి, మధుసూదనరెడ్డి, రమణారెడ్డి, రాఘవరెడ్డి, రాధాకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే ప్రభుత్వ ఎజెండా

సూళ్లూరుపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధే ఎజెండాగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. మంగళవారం రాత్రి సూళ్లూరు, నాగరాజపురంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటా తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుతుంటే ప్రతిపక్ష నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నామన్నారు. అనంతరం టీడీపీ నాయకులతో కలిసి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతనిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, మాజీ ఎంపీపీ పిట్ల సుబ్రమణ్యం, కౌన్సిలర్ ఈదూరు చెంగమ్మ, వెంకటస్వామి, దంతాల రవి, మునస్వామి తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబుకు పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

హత్యాయత్నం కేసులో ఒకరి అరెస్టు

దొరవారిసత్రం, జూలై 22(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం వెదురుపట్టులో నాగముంతల పోలయ్యపై హత్యాయత్నానికి పాల్పడిన కేసులో అదే గ్రామానికి చెందిన నాగముంతల సుధాకర్‌ను మంగళవారం అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈనెల 18న పొలం విషయంలో గొడవ కారణంగా పోలయ్యపై సుధాకర్, అనవల మోహన్ హత్యాయత్నం చేసినట్లు బాధితుడు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన ఎస్‌ఐ అజయ్‌కుమార్ నిందితుడు సుధాకర్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. మరొక నిందితుడు మోహన్ పరారీలో ఉన్నట్లు తెలిపారు.

మున్సిపల్ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన



అర్ధనగ్నంగా నిరసన తెలుపుతున్న మున్సిపాలిటీ కార్మికులు

సూళ్లూరుపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్లను పరిష్కరించి వేతనాలు పెంచాలంటూ సమ్మె చేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మికులు మంగళవారం అర్ధనగ్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు లక్ష్మయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించేంత వరకు సమ్మె కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు చంద్రశేఖర్, పద్మనాభం, రియాజ్, బాలాజి, కరీం తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ నేతలు

గూడూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించేలా అధికారులు చొరవ తీసుకోవాలని సీఐటీయూ నాయకులు అన్నారు. మంగళవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెల్లటూరు గ్రామంలో పారిశుధ్య కార్మికరాలిగా పనిచేస్తున్న గిరిజన మహిళకు సంబంధించిన సమస్యపై మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడేందుకు వెళ్లగా ఆయన దురుసుగా వ్యవహరించడాన్ని ఖండించారు. ఉన్నతాధికారులు ఈవిషయమై విచారణ నిర్వహించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శివకుమార్, బీవీ.రమణయ్య, ప్రసాద్, చంద్రయ్య, శంకరయ్య, మధు, ముత్యాలయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

గూడూరు అర్బన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కార్మికుల భద్రతకు పరిశ్రమల యాజమాన్యాలు ప్రాధాన్యం ఇవ్వాలని సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా అన్నారు. మంగళవారం పరిశ్రమల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల్లో పనిచేసే సిబ్బంది ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శివశంకర్‌రెడ్డి, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

చర్చి నిర్మాణానికి అమెరికావాసి విరాళం

కోట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కోట మండలం తిన్నెలపూడిలో చర్చి నిర్మాణానికి అమెరికాలోని డాక్టర్ విజయభాస్కర్, డాక్టర్ జయరావు రూ.లక్ష విరాళం మంగళవారం అందజేశారు.

రేపు పలు రైళ్ల రద్దు

తడ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): చెన్నై - గూడూరు ప్రాంతంలో గుమ్మిడిపూడి - కవరేపేట మధ్య ఇంజనీరింగ్ పనులు జరుగుతున్న కారణంగా 24వ తేదీ గురువారం మధ్యాహ్నం 1.15నుంచి సాయంత్రం 5.15 వరకు పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు సదరన్ రైల్వే చెన్నై డివిజన్ అధికారులు ప్రకటించారు.

రద్దైన రైళ్ల వివరాలు...

- చెన్నై మోర్ మార్కెట్ కాంప్లెక్స్ నుంచి సూళ్లూరుపేటకు ఉదయం 10.15, మధ్యాహ్నం 12.10కు వెళ్లే ఈఎంయూ లోకల్ రైళ్లు రద్దయ్యాయి.
- సూళ్లూరుపేట నుంచి చెన్నై మోర్‌మార్కెట్ కాంప్లెక్స్‌కు మధ్యాహ్నం 1.15, 3.10కు వెళ్లే ఈఎంయూ లోకల్ రైళ్లు.
- చెన్నై మోర్‌మార్కెట్ కాంప్లెక్స్ నుంచి గుమ్మిడిపూడికి ఉదయం 11.35, మధ్యాహ్నం 12.40, 1.40, 2.40, 3.05, 3.45కు వెళ్లే ఈఎంయూ లోకల్ రైళ్లు.
- గుమ్మిడిపూడి నుంచి చెన్నై మోర్ మార్కెట్ కాంప్లెక్స్‌కు మధ్యాహ్నం 1.00, 2.30, 3.15, 3.45, 4.30కు వెళ్లే ఈఎంయూ లోకల్ రైళ్లు.
- చెంగల్‌పట్టు నుంచి గుమ్మిడిపూడికి ఉదయం 9.55కు బయలుదేరి వెళ్లే ఈఎంయూ లోకల్ రైలును మీజూరు వరకు నడపనున్నారు.
- గుమ్మిడిపూడి నుంచి తాంబ్రంకు మధ్యాహ్నం 3.00కు బయలుదేరి వెళ్లే ఈఎంయూ లోకల్ రైలు మీజూరు నుంచి బయలుదేరి వెళ్లనుంది.

అలాగే మరికొన్ని రైళ్లు పొన్నేరి, చెన్నై మధ్య నడపనున్నట్లుగా చెన్నై డివిజన్ అధికారులు తెలిపారు.

మురుగునీటితో అవస్థలు



రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

గూడూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక త్యాగరాజవీధిలోని కృష్ణమందిరం ఆలయం వద్ద రోడ్డుపై మురుగునీరు ప్రవహిస్తుండడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. కృష్ణమందిరంలో సమీపంలో కల్వర్టు వద్ద నుంచి మురుగునీరు ముందుకు కదలక రోడ్లపైకి ప్రవహిస్తుండడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు, పాదాచారులు ఇబ్బందులు పడుతున్నారు. గమళ్లపాళెం, నలజాలమ్మవీధి, దర్గావీధి, రాజావీధి ప్రాంతాలకు ఈ మార్గంలో రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. ప్రధాన రహదారి కూడలి వద్ద కల్వర్టు నుంచి మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తూ నిల్వచేరి ఉండడంతో దుర్వాసన వ్యాప్తి చెందడంతో పాటు పరిసరాలు అపరిశుభ్రంగా మారి దోమలు పెరిగిపోతున్నాయని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి మురుగునీరు నిల్వ చేరకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పెన్నక్క చెరువులోకి గంగ జలాలు



స్వర్ణముఖినది నుంచి పెన్నక్క చెరువులోకి వెళ్తున్న గంగజలాలు

కోట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెన్నక్క చెరువులోకి రెండు రోజుల నుంచి గూడలి స్వర్ణముఖినది నుంచి గంగజలాలు చేరుతున్నాయి. కండలేరు నుంచి రాంబట్లపల్లి ఎస్కేప్ చానల్ ద్వారా రెండు టీఎంసీల నీటిని స్వర్ణముఖినదిలోకి వదిలారు. గూడలి స్వర్ణముఖినదిలోకి చేరుకున్న నీరు అటు పెన్నక్క చెరువులోకి వెళ్తోంది. రెండు టీఎంసీల గంగనీటితో 20వేల ఎకరాల పంటలకు సాగునీరు అందిస్తామని గంగ ఈఈ తెలిపారు. సాగులో ఉన్న వరి పంట రెండో తడికి సాగునీటి కొరత ఉండదని చెందోడు, విద్యానగర్, నెల్లూరుపల్లి కొత్తపాళెం గ్రామాల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం



వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఇండెస్ట్ కాఫీ డైరెక్టర్ హరీంద్రనాథ్

కోట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): చిట్టేడు గ్రామానికి స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తూ అన్ని రకాలుగా ఆదుకుంటామని నాయుడుపేట మండలం మేనకూరులోని ఇండెస్ట్ కాఫీ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ హరీంద్రనాథ్, జీఎం రమేష్, పీఎఫ్‌వో మహేష్ అన్నారు. మండల పరిధిలోని చిట్టేడులో ఇండెస్ట్ కాఫీ పరిశ్రమ సౌజన్యంతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ఆ సంస్థ ప్రతినిధులు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచు రాఘవయ్య, మాజీ ఎంపీటీసీ కృష్ణపట్నం చంద్రశేఖర్, సురేష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో తప్పుచేస్తే కఠిన చర్యలు

వెంకటగిరి టౌన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో తప్పుచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ నరసింహారావు హెచ్చరించారు. మంగళవారం రెవెన్యూ కార్యాలయంలో సచివాలయ సర్వేయర్లు, వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

బాలాయపల్లి, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిడిగల్లు గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీవో వినీల్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. కూలీలతో మాట్లాడుతూ నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు చేస్తే కూలి గిట్టుబాటు అవుతుందన్నారు. మస్టర్ల నమోదులో జాగ్రత్తలు వహించాలని, అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు.